ఆగస్టు
2023

సంపుటి :19 సంచిక : 3

208

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

### ఈ సంచికలో........

ఎన్నికల ముందు మతచిచ్చు రేపడానికే

ఏకరూప పౌరస్మృతి (యుసిసి) నాటకం

తెలంగాణలో ఇండ్లు, ఇండ్లస్థలాల పోరాటం

మత వ్యవస్థలలో పరిణామాలు

అమెరికా సంస్థల లాభాల కోసమే సైనిక ఒప్పందాలు

మార్క్స్ దృష్టిలో పరాయికరణ

ఆర్యుల భారతీయ మూలాలపై ఆధారాలు లేవు

హిందుత్వ, కార్పొరేట్ శక్తులు ఎగదోసిన మణిపూర్ మంటలు

పశ్చిమాసియాలో పట్టుకోల్పోతున్న ఇస్లామిక్ తీవ్రవాదం

జాతీయ విప్లవకారుడు భగత్ సింగ్

స్ఫూర్తి

# జాతీయ విప్లవకారుడు భగత్ సింగ్

పిబి చారి



**నా**లుగేళ్ల ప్రాయంలో ఉన్న పిల్లాడిని తన తండ్రి భుజం మీద ఎత్తుకుని తోటకు తీసుకువెళ్ళాడు ఒకనాడు. తండ్రి ఇతన స్నేహితుడితో ముచ్చటిస్తూ, కొంత సమయం గడిచాక ఏమి చేస్తున్నాడో అని పిల్లాడి వైపు చూశాడు. ఆడుకుంటాడులే అనుకున్న ఆ పిల్లవాడు భూమిలో గడ్డి పరకలు నాటుతున్నాడు. ఏమి చేస్తున్నావు రా నాన్న అని అడిగితే చిన్న చిన్న తుపాకీ మొక్కలు నాటుతున్నాను, అవి పెరిగి పెద్ద పెద్ద తుపాకులు కాస్తాయి. వాటితో ఇంగ్లీష్ వాళ్ళను చంపి దేశానికి స్వాతంత్రం తీసుకు వస్తా అంటూ ఆ పిల్లాడు తలెత్తకుండా సమాధానం చెప్పాడు. ఆ పిల్ల వాడి మాటలకు ఆ తండ్రి, అతని మిత్రుడు ఐదు నిమిషాల పాటు చప్పట్లు కొడుతూనే ఉన్నారు. నిజంగా నాలుగు సంవత్సరాల వయసులో తుపాకీ పట్టాలని భావించిన ఆ పిల్లాడే తరువాతి కాలంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన భారత విప్లవోద్యమ నాయకుడు షహీద్ భగత్ సింగ్‌గా యావత్ భారత ప్రజల గుండెల్లో చిరస్థానాన్ని ఆక్రమించాడు.

భారత దేశ స్వాతంత్రం తెచ్చేందుకు ఎందరో మహానుభావులు తమ జీవితాలను త్యాగం చేశారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెళ్లగించటానికి ప్రాణాలను సైతం పణంగా పెట్టారు. వీరిలో ఎప్పటికీ గుర్తుండిపోయే మహానుభావుడు షహీద్ భగత్ సింగ్. ఆయన పేరు వింటేనే భారతీయ యువతకు రక్తం ఉద్రేకంతో, గర్వంతో ఉప్పొంగిపోతుంది. ఆయన ఆశయాలు, ఆలోచనలు, ఆవేశం ఎంతోమంది యువతకు స్ఫూర్తి ఇస్తూనే ఉంటుంది. గొప్ప విప్లవకారుడిగా, స్వాతంత్ర సమర యోధుడిగా చరిత్రలో నిలిచిపోయిన వీరుడు, ధీరుడు భగత్ సింగ్.

భగత్ సింగ్ 1907 సెప్టెంబర్ 28న నేటి పాకిస్తాన్‌లో ఉన్న లాయల్ జిల్లా సీబంగా సమీపంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలో, సర్దార్ కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించాడు. ఈ దంపతులు ఇద్దరూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా విప్లవ ఉద్యమాలు చేపట్టిన కుటుంబానికి చెందినవారే. కిషన్ సింగ్ సోదరులు ఇద్దరూ గదర్ పార్టీ సభ్యులు. విద్యార్థి దశలో భగత్‌సింగ్ అందరితో చాలా కలివిడిగా ఉండేవాడు. ఆర్య సమాజ్‌లో పని చేస్తున్న తన తాతగారైన అర్జున్ సింగ్ కార్యకలాపాలు భగత్ సింగ్‌ను బాగా ప్రభావితం చేశాయి. భగత్ సింగ్ విద్యాభ్యాసం ఆర్య సామాజిక పాఠశాల అయిన "దయా నంద ఆంగ్లో వేదిక్" ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యింది. యుక్త వయసు వచ్చిన తరువాత లాహోర్ లోని నేషనల్ కాలేజీలో విద్యనభ్యసించాడు.

13 ఏళ్ల వయసులోనే మహాత్మా గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమానికి భగత్ సింగ్ ప్రభావితుడయ్యాడు. ఆ సమయంలోనే బ్రిటిష్ ప్రభుత్వానికి ఎదురు తిరిగిన ఆయన విదేశీ వస్తు బహిష్కరణలో పాల్గొని బ్రిటన్ నుండి దిగుమతి అయిన వస్తువులను తగలబెట్టడం ద్వారా గాంధీజీ సిద్ధాంతాలను అనుసరించాడు. అయితే ఉత్తరప్రదేశ్ లోని చౌరీ చౌరా గ్రామస్తులపై బ్రిటిష్ పోలీసులు జరిపిన కాల్పుల్లో అనేక మంది నిరాయుధులైన రైతులు ప్రాణాలను కోల్పోయారు. దానికి ప్రతిగా గ్రామస్తులు తిరగబడి ఆ పోలీస్ స్టేషన్‌కు నిప్పు పెట్టి తగలబెట్టారు. ఆ స్టేషనులో ఉన్న పోలీసులు కొందరు మాడి మసి అయినారు. ఈ సందర్భంగా అహింసవాది అయిన గాంధీ ఆ గ్రామస్తులు తిరుగుబాటు హింసను అపరాధంగా భావించి తాను చేపట్టిన సహాయ నిరాకరణోద్యమాన్ని అర్ధంతరంగా నిలిపి వేశారు. గాంధీ గారి అహింసావాదం పై అసంతృప్తి చెందిన భగత్ సింగ్ విప్లవోద్యమంలో చేరి తెల్ల దొరలకు వ్యతిరేకంగా హింసాత్మక ఉద్యమాన్ని ఉధృతం చేశాడు.

గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఉపసంహరించుకున్నాక దేశంలో హిందూ ముస్లింల మధ్య తలెత్తిన సంఘర్షణలను భగత్ సింగ్ కళ్ళారా చూశాడు. అప్పటి నుండి మతాన్ని, మత నమ్మకాలను సిద్ధాంతాలను విమర్శించటం మొదలుపెట్టాడు. విప్లవకారుల స్వతంత్ర ఉద్యమానికి మతం అడ్డుగోడగా నిలుస్తుందని గ్రహించిన భగత్ సింగ్ ఆ క్షణం నుండి మతవిశ్వాసాలను విడనాడాడు. "నౌ జవాన్ భారత్ సభ" (భారత యువజన సంఘం) లో చేరాడు. 1928లో "కీర్తి కిసాన్ పార్టీ" కార్యదర్శిగా, తరువాత అధ్యక్షుడిగా పని చేసాడు. భగత్ సింగ్ "హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ పార్టీ'' వ్యవస్థాపక సభ్యులలో ఒకరుగా ఉన్నాడు. ఈ పార్టీలో పని చేస్తూ సహా విప్లవకారులను, అనేక మంది యువకులను ఆకర్షించాడు.

1928లో భారత దేశంలోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ బ్రిటిష్ ప్రభుత్వం సైమన్ కమిషన్‌ను వేసింది. ఆ కమిషన్‌లో ఒక్కరు కూడా భారతీయ సభ్యుడు లేకపోవటంతో దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ఆ కమిషన్‌ను బహిష్కరించాయి. ఫలితంగా దేశవ్యాప్తంగా సైమన్ కమిషన్ గోబ్యాక్ అనే నినాదాలు, నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి. 30 అక్టోబర్ 1928న ఆ కమిషన్ లాహోర్‌ని సందర్శించినప్పుడు సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా లాలా లజపతిరాయ్ (పంజాబ్ కేసరి) నాయకత్వంలో అహింసాయుత నిరసన కార్యక్రమం జరిగింది. ఆ నిరసనను బ్రిటిష్ పోలీసులు హింసాయుతంగా మార్చారు. లాలా లజపతిరాయ్ మీద అత్యంత క్రూరంగా లాఠీఛార్జి చేసి చాతి మీద విపరీతంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆయన తరువాత మరణించాడు. ఈ సంఘటనను కళ్ళారా చూసిన భగత్ సింగ్ చలించిపోయాడు. దెబ్బకు దెబ్బ ఎలాగైనా ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. లాలా లజపతిరాయ్ హత్యకు కారణమైన పోలీస్ అధికారి "స్కాట్"ను ఎలాగైనా మట్టుపెట్టాలని విప్లవకారులు శివ రామ్, రాజ్ గురు, జై గోపాల్, సుఖదేవ్ థాపర్‌లతో కలిసి పథకం

**(మిగతా 35వ పేజీలో)**

## ఈ సంచికలో...


1. జాతీయ విప్లవకారుడు భగత్ సింగ్
పిబి చారి ......2

2. ఎన్నికల ముందు మతచిచ్చు రేపడానికే ఏకరూప పౌరస్మృతి (యుసిసి) నాటకం
ఎంవిఎస్ శర్మ...........4

3. తెలంగాణలో ఇండ్లు, ఇండ్లస్థలాల పోరాటం
ఎస్ వీరయ్య ...........11

4. మత వ్యవస్థలలో పరిణామాలు
ఎంవిఎస్ శర్మ........14

5. అమెరికా సంస్థల లాభాల కోసమే సైనిక ఒప్పందాలు
రఘు...........18

6. మార్క్స్ దృష్టిలో పరాయికరణ
వై రాము...........21

7. ఆర్యుల భారతీయ మూలాలపై ఆధారాలు లేవు
జాఫర్ హబీబ్ ......23

8. హిందుత్వ, కార్పొరేట్ శక్తులు ఎగదోసిన మణిపూర్ మంటలు
ఎ కోటిరెడ్డి......26

8. పశ్చిమాసియాలో పట్టుకోల్పోతున్న ఇస్లామిక్ తీవ్రవాదం
తమీజ్ అహ్మద్......29



**సంపాదకుడు :**
**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం :**
**పాటూరు రామయ్య**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at: cpim.org


# మణిపూర్ మారణకాండ

**మ**ణిపూర్ మరో గుజరాత్‌గా మారింది. 2002లో గుజరాత్‌లో మాదిరిగానే నేడు ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ ఒక పద్ధతి ప్రకారం ప్రోత్సహించిన నరమేధంలో వందలాది మంది మరణించారు. వేల మంది గాయాలతో ఆసుపత్రిపాలైనారు. అయిదు వేలకు పైగా ఇళ్లు దగ్ధమైనాయి. దాదాపు రెండు వందల గ్రామాలు అగ్నికి ఆహుతయ్యాయి. 60,000 మంది శరణార్థులుగా మారారు. కేంద్రంలో బిజెపి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, మణిపూర్‌లో బిజెపి ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ల డబులింజిన్ సర్కారు హయాంలో మూడు మాసాలుగా మణిపూర్ గిరిజనులపై దాడులతోనూ, జాతి హననంతోనూ రావణ కాష్టంగా మారింది.

గిరిజన కుకీ ఆడపడుచులను పోలీసుల సమక్షంలోనే మతోన్మాదులు నగ్నంగా ఊరేగించి, అత్యాచారం గావించి హత్య చేసిన పైశాచిక ఘటన, ఇంకా అనేక మంది ఆడపడుచుల మాన ప్రాణాలు హరించిన క్రూరత్వం వీడియోల ద్వారా వైరల్ అయి యావత్ భారత దేశాన్ని దిగ్భ్రమకు, ఆగ్రహానికి గురిచేశాయి. మూడు మాసాలుగా ఇటువంటి ఘటనలు జరుగుతున్నా, మంటల్లో మణిపూర్ తగలబడుతున్నా చలించని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంటున్నదని గ్రహించి, తాపీగా పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడుతూ 'బాధ' వ్యక్తి చేశారు. కానీ పార్లమెంటు లోపల ఈ దారుణం గురించి చర్చించడానికి మోడీకి నోరు రావడం లేదు.

ప్రశాంతతకు మారుపేరైన మణిపూర్‌లో బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ ప్రజల మధ్య ఒక పద్ధతి ప్రకారం మత విద్వేషాలు రెచ్చగొట్టింది. మెజారిటీ మైతీ ప్రజలకూ, మైనారిటీలైన కుకీలకూ మధ్య జాతుల వైరం సృష్టించింది. నిజానికి మణిపూర్ ఘటనల వెనుక మతోన్మాద, కార్పొరేట్ శక్తులు రెంటి ప్రమేయం ఉంది. అక్కడి పర్వతాల్లో విలువైన ఖనిజ సంపదను కాజేయాలని కార్పొరేట్ శక్తులు ప్రయత్నాలు ఆరంభించడంతోనే వారికి అనుకూలంగా కుకీలను పర్వత ప్రాంతాల నుండి తరిమేసి, కార్పొరేట్లకు అటవీ ప్రాంతాలు అప్పగించడానికి బిజెపి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రాజకీయంగా, ఆర్థికంగా ప్రాబల్యం గల మైతీలను గిరిజనులుగా గుర్తించే ప్రయత్నాలు ఇందులో భాగమే. ఈ ప్రయత్నాలను నెరవేర్చడం కోసం ఆర్‌ఎస్‌ఎస్ సోషల్ మీడియాను పెద్ద ఎత్తున ఉపయోగించుకుని కుకీలకు వ్యతిరేకంగా విష ప్రచారం గావించింది. కుకీలు కొకైన్ పెంపకం దారులు, డ్రగ్స్ సరఫరా దారులనీ, వారు మ్యాన్మార్ నుండి మణిపూర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన వారనీ ప్రచారం చేసింది. మెయితీల్లో హిందూత్వ ఉన్మాదాన్ని రెచ్చగొట్టి మెజారిటీ క్రైస్తవులుగా ఉన్న కుకీలు, నాగాలపైకి ఎగదోసింది. వారు పోలీస్ స్టేషన్లపై బడి ఆయుధాలు దోచుకున్నప్పటికీ మణిపూర్ ప్రభుత్వం చూసీ చూడనట్లు వదిలిపెట్టింది. దాంతో ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదం తలకెక్కిన దుండగులు కుకీలపై పెద్ద ఎత్తున దాడులకు పాల్పడ్డారు. చర్చిలను తగులబెట్టారు. వాటిలో మెయితీలకు చెందిన వందలాది చర్చిలు కూడా ఉండడం విశేషం.

మణిపూర్ మంటల్లో తగల బడుతుంటే ప్రధాని మోడీ కనీసం అటువేపు చూడలేదు. మూడు మాసాల్లో ఒక్క ప్రకటన కూడా చేయలేదు. పైగా విదేశాల్లో పర్యటనలు జరిపారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దేశంలోని పలు రాష్ట్రాల్లో మోడీ ప్రచార యాత్రల్లో పాల్గొన్నారు. కానీ గత కొద్ది రోజులుగా ప్రతిపక్షాలన్నీ ఏక కంఠంతో కోరుతున్నా ఆయన పార్లమెంటులో మాత్రం ఈ ఘోరాన్ని గురించి నోరు విప్పడం లేదు. చివరికి ఈ చర్మం మందం ప్రధానిచేత మాట్లాడించడానికి ప్రతిపక్షాలు పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం బాట ఎంచుకోవలసి వచ్చింది. దేశంలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీలన్నీ అవిశ్వా తీర్మానానికి మద్దతివ్వడం ద్వారా మణిపూర్ ఘటనలపై తమ నిరసన తెలియజేయడానికి పూనుకుంటే ఆంధ్ర ప్రదేశ్‌లోని రెండు ప్రధాన రాజకీయ పార్టీలయిన వైసిపి, తెలుగు దేశం తీర్మానాన్ని వ్యతిరేకించడం సిగ్గుచేటు, తెలుగు వారికి అవమానం. లౌకిక, ప్రజాతంత్ర వాదులంతా ఈ ఘోరాన్ని ముక్త కంఠంతో ఖండించాలి, మణిపూర్ హింస ఆగేవరకు, బాధితులకు న్యాయం జరిగేవరకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి.

ఈ మాసం ముఖ్యాంశం

# ఎన్నికల ముందు మతచిచ్చు రేపడానికే ఏకరూప పౌరస్మృతి (యుసిసి) నాటకం



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకులు

**ఎం.వి.ఎస్.శర్మ**

**(ఏకరూప పౌరస్మృతి– యుసిసి పై ఇటీవల విజయవాడలో జరిగిన సభలో సిపిఐ(ఎం) మాజీ కార్యదర్శివర్గ సభ్యులు, ప్రజాశక్తి మాజీ సంపాదకులు ఎంవిఎస్ శర్మ చేసిన ప్రసంగ పాఠాన్ని మార్పిస్తు పాఠకులకు అందిస్తున్నాం.... సంపాదకుడు)**

ఉమ్మడి పౌరస్మృతి అని మనం అంటున్నాం. ఇంగ్లీషులో దీనిని యూనిఫామ్ సివిల్ కోడ్ యూసిసి అని వాడుతున్నాం. దీనిని తెలుగులో అర్థం వచ్చేలా చెప్పాలంటే ఉమ్మడి కాదు. ఉమ్మడి అంటే ఒక పాజిటివ్ అర్థంగా వస్తుంది. ఉమ్మడిగా అంటే అందరూ అనుకొని ఒప్పుకొని చేసిందని. యూనిఫారమ్ అంటే ఏకరూప పౌరస్మృతి అని దానికి సరైన అనువాదం. మనం ప్రస్తుతం అర్థం చేసుకోవాల్సింది కూడా ఇదే. ఏకరూపత కావాలా, సమానత్వం కావాలా అని బిజెపి ప్రభుత్వాన్ని సవాల్ చేయాల్సిన అంశం. అసలు సమానత్వం లేకుండా ఏకరూపత ఎలా వస్తుంది?

అసలు ఈ పౌరస్మృతి అంటే ఏంటి? స్మృతి అంటే చట్టం. అనేక చట్టాలు కలిపి గుదిగుచ్చితే అది కోడ్. నాలుగు లేబర్ కోడ్‌లు మోడీ తీసుకొచ్చారు. అంటే అప్పటి వరకూ ఉన్నటువంటి పాతికో, ముప్పైయో కార్మికక చట్టాలన్నింటినీ నాలుగు భాగాలుగా విడదీసి. వాటిని గుదిగుచ్చి నాలుగు కోడ్‌లు పెట్టి దానిలో వాళ్ళు కావాలనుకున్న మార్పులు చేర్పుల్ని చేసి అది అమలు జరప ప్రారంభిస్తున్నారు. అలా చిన్నచిన్న చట్టాలన్ని కలిపి గుదిగుచ్చితే ఒక కోడ్ అవుతుంది. ఇప్పుడు మనదేశంలో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ఉంది. సివిల్ ప్రొసీజర్ కోడ్ ఉంది. క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ దేశం మొత్తానికి ఉమ్మడిగానే వర్తిస్తుంది. కొన్ని చిన్నచిన్న మినహాయింపులు ప్రతి చట్టానికీ ఉంటాయి. సిఆర్‌పిసి– క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ అంటే నేరస్మృతి అంటే నేరాలు చేసేవాటికి సంబంధించిన చట్టాలు, ఇది దేశం మొత్తం మీద అందరికీ వర్తిస్తుంది. వాళ్ళ కులం, మతం, ప్రాంతం, వీటితో నిమిత్తం లేకుండా నేరం కింద పరిగణించబడేవన్నీ కూడా ఈ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కింద వస్తాయి. ఒకడు ఇంకొకడిని కొట్టాడనుకోండి, లేదా దాడి చేశాడనుకోండి అది నేరం అవుతుంది. ఆ కొట్టినవాడు తన్నులు తిన్నవాడు, వాళ్ళ మతాలు ఏవైనా, ప్రాంతాలు ఏవైనా ఏదైనాసరే కొట్టడం నేరం అని సిఆర్‌పిసి చెబుతుంది. అక్కడ మతం, కులం, వయస్సు అలాగే స్త్రీ, పురుషులు అనే బేధం లేకుండా అందిరికీ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ వర్తిస్తుంది.

**సివిల్ ప్రొసీజర్ కోడ్**

ఇక సివిల్ ప్రొసీజర్ కోడ్ అంటే నేరంగా పరిగణించబడనటువంటి వివాదాలు ఉంటాయి. ఆస్తి తగువులు, భూమి వివాదాలు, వ్యాపారంలో భాస్వాముల మధ్య గొడవలు, కాంట్రాక్టులకు సంబంధించిన వివాదాలు వంటివి సివిల్ కేసులు అంటారు. అంటే ఇది వ్యక్తుల మధ్య తగువులు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ అంటే ప్రభుత్వానికీ ప్రజలకి మధ్య తగువు. నువ్వు ఒక హత్య చేస్తే ఆ హత్యని క్రైమ్ కింద పరిగణిస్తారు. అంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేరం చేసినట్టు లెక్క. హత్య చేసిన వాడి మీద పోలీసులే కేసు పెడతారు. పోలీసుల తరపున, ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదిస్తాడు. నేరం అరోపించబడిన వాడి తరపున డిఫెన్స్ లాయర్ వాదిస్తాడు. సివిల్ వివాదాల్లో ఈ పద్ధతి ఉండదు. సివిల్ కేసులలో ఇరుపక్షాల లాయర్లే ఉంటారు. వాళ్ళ వాదనవాళ్ళు, వీళ్ళ వాదన వీళ్ళు చేస్తారు. అక్కడ ప్రభుత్వం పాత్ర ఏమీ ఉండదు. ఒకవేళ ప్రభుత్వంపై ఏదైనా సివిల్ కేసు వేస్తే ప్రభుత్వం ఒక పార్టీ ,కేసు వేసిన వాడు ఒక పార్టీ అవుతారు. ఇద్దరు సమాన హోదాలోనే ఉంటారు. ఇప్పుటి వరకూ ఏకరూపమైన పౌరస్మృతి అంటే సివిల్ చట్టాలు ఏమి లేవనేది కాదు. ఆస్తులకు సంబంధించి, వ్యాపారాలకు సంబంధించి, కాంట్రాక్టులకు సంబంధించి లావా దేవీలు అప్పులు, తీర్చుకోడానికి కూడా దేశం అంతటా ఒకటే చట్టాలున్నాయి.

ఇప్పటి వరకూ దేశం మొత్తం మీద ఒక చట్టం లేనట్టు రకరకాల చట్టాలు ఉన్నట్టు మోడీ ప్రభుత్వం చర్చ పెడుతున్నది. ఈ దేశం అంతా అలా ఎవరికి తోచినట్టు వారు ఉంటే ఈ దేశం ఏమైపోతుందని మోడీ గారు వాపోతున్నాడు. కాని ఇప్పటికి తొంబై శాతం చట్టాలు ఒకటే ఉన్నాయి. దేశమంతా ఒక్కటిగా లేనివి కుటుంబ చట్టాలు. అందులో ప్రధానంగా నాలుగు భాగాలు వస్తాయి.

అవి 1. వివాహం, 2. విడాకులు, 3. దత్తత, 4.వారసత్వం. ఆస్తికి ఎవరు వారసులు ఈ నాలుగు ప్రధానమైన అంశాలు. కుటుంబ చట్టాలు వేర్వేరు చట్టాలుగా ఉన్నాయి.

ఎందుకంటే, కుటుంబము పెళ్ళి, దత్తత, తర్వాత వారసత్వం ఇలా అంశాలన్నీ మత విశ్వాసాలతో ముడిపడి ఉన్నాయి. దేశంలో అనేక మతాలు ఉన్నాయి. ఆయా మత విశ్వాసాలకు అనుగుణంగా వాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకొనేటప్పుడు, కుటుంబాలు నడిపేటప్పుడు, ఆచార వ్యవహారాలు పాటించేటప్పుడు, అందరికీ ఒకటే చట్టం ఉండడం సాధ్యం కాదు. అందుకని మనం దాన్ని వెంటనే సాధించలేం అని రాజ్యాంగ సభలో అభిప్రాయపడ్డారు. కాబట్టి, వివాహం, దత్తతు, వారసత్వం, విడాకులు ఈ నాలుగింటికి సంబంధించి ఉన్నటువంటి అంశాల మీద వెంటనే మనం దేశమంతటా అన్ని మతాల వాళ్ళకీ, అన్ని ప్రాంతాల వాళ్ళకీ ఒకటే రుద్దకుండా క్రమంగా దాన్ని ఒకతాటి మీదికి తీసుకువచ్చేందుకు మెల్లిగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. కొన్ని పద్ధతులను మతం పరిధిలోంచి బయటకు తీసుకువచ్చి వాటిని జాగ్రత్తగా ఉమ్మడి చట్టాలుగా చేయాలని రాజ్యాంగ నిర్మాతలు అనుకున్నారు.

> **“ హిందువుల్లో కూడా చాలా తేడాలు ఉన్నాయి. ఒక ప్రాంతంలోని కుటుంబ చట్టం ఇంకో ప్రాంతంలో లేదు. అన్నింటిలోనూ ప్రాంతీయ హెచ్చు తగ్గులు చాలా ఉన్నాయి. కాబట్టి హిందూ ఉమ్మడి చట్టంగా హిందూ కోడ్ బిల్లు తీసుకు రావాలని అంబేద్కర్ ప్రయత్నించారు. దానిలో భాగంగానే వివాహం వయస్సును కొద్దిగా పెంచ డం, వరకట్నాన్ని నిషేధించడం, అంటరాని తనాన్ని నిషేధించడం ఇలా కొన్ని అభ్యుదయ ఆలోచనలతో బిల్లు తీసుకువస్తే పార్లమెంట్ దానిని ఓడించింది. ”**

### ఆదేశ సూత్రం మాత్రమే

అందుకనే ఏకరూప పౌరస్మృతి ని రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలలో భాగంగా చేశారు. ఆదేశ సూత్రాలు అంటే, రాజ్యాంగంలో ప్రభుత్వాలు ఈ లక్ష్యాలు సాధించాలని రాజ్యాంగం అదేశించింది. అందుకోసం కొన్ని లక్ష్యాలు పెట్టింది. అవి అందరికీ చదువు, ఉపాధి, పేద, ధనిక మధ్య తారతమ్యాల తగ్గింపు, సామాజిక న్యాయాన్ని సాధన, ప్రాంతాల మధ్య అసమానతలు తగ్గించడం, స్త్రీ, పురుషుల మధ్య హెచ్చు తగ్గులు లేకుండా చేయడం, మద్యపానాన్ని నిషేధించడం వగైరా. ఇటువంటి ఆదేశ సూత్రాలలో వెంటనే అమలు చెయ్యలేని వాటిని క్రమంగా అందరినీ కలుపుకొంటూ అందర్నీ ఒప్పిస్తూ అమలు చేయాలి. కుటుంబ చట్టాలకు సంబంధించి కూడా చట్టాలు తీసుకురావాలని రాజ్యాంగం చెప్పింది. అందుకనే రాజ్యాంగ నిపుణులు ఈ కుటుంబ చట్టాలను కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన ఉమ్మడి జాబితాలో చేర్చారు. కేంద్రానికి, రాష్ట్రానికి ఇద్దరికీ అధికారం ఉండేటట్టు ఇలా చేర్చారు. ఆయా రాష్ట్రాలుఆయా ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేకమైన చట్టాలు కావాలి అనుకున్నప్పుడు చేసుకోవచ్చు. కాబట్టి ఏకరూప పౌరస్మృతిని వెంటనే సాధించాలని ఐదేళ్ళో పదేళ్ళో లక్ష్యాలు పెట్టలేదు. దేశంలో అనేకమైన జాతులు, మతాలు, కులాలు, ఆచారాలు, సాంప్రదాయాలు ఉన్నాయి. అనేక స్థాయిలలో అభివృద్ధిలో అంతరాలు ఉన్నాయి. ఇలాంటి స్థితిలో క్రమంగా అందర్నీ ఒప్పించి ఉమ్మడి చట్టం తీసుకురావాలి అన్నదే ఆరోజు రాజ్యాంగం రాసిన వాళ్ల అభిప్రాయం.

అయితే అలాగ అందర్నీ ఒప్పించే క్రమంలో మనం ఒక అడుగైనా ముందుకు వేద్దామని అంబేద్కర్ ఆనాడు ప్రతిపాదించారు. నెహ్రూ, అంబేద్కర్ మొత్తం అన్ని మతాలకు సంబంధించి ఉమ్మడి చట్టాలు చేయటం ఇప్పుడే కుదరదు కాబట్టి కనీసం హిందువులకు సంబంధించి ఒకడుగు ముందుకు వేయాలనుకున్నారు. హిందువుల్లో కూడా చాలా తేడాలు ఉన్నాయి. ఒక ప్రాంతంలోని కుటుంబ చట్టం ఇంకో ప్రాంతంలో లేదు. అన్నింటిలోనూ ప్రాంతీయ తేడాలు హెచ్చు తగ్గులు చాలా ఉన్నాయి. కాబట్టి హిందూ ఉమ్మడి చట్టంగా హిందూ కోడ్ బిల్లు తీసుకు రావాలని అంబేద్కర్ ప్రయత్నించారు. దానిలో భాగంగానే వివాహం వయస్సును కొద్దిగా పెంచ డం, వరకట్నాన్ని నిషేధించడం, అంటరానితనాన్ని నిషేధించడం ఇలా కొన్ని అభ్యుదయ ఆలోచనలతో బిల్లు తీసుకువస్తే పార్లమెంట్ దానిని ఓడించింది. ఆరోజున్న సనాతన వాదులు, భూస్వామ్య శక్తులు, అగ్రకులాల ఆధిపత్యం ఇవన్నీ కలిసి దాన్ని ఓడించాయి. దాంతో మనస్థాపం చెంది అంబేద్కర్ బయటకి వచ్చేశాడు. 1952 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే హిందూ సమాజాన్ని కాస్త సంస్కరించి, అభివృద్ధి దిశగా కొన్ని చట్టాలు చేస్తామని నెహ్రూ హామీ ఇచ్చాడు.

### అనేక రకాల పర్సనల్ చట్టాలు

ఆ హామీ ఫలితంగా ఒక హిందూ కోడ్ బిల్లు కాకుండా 4 బిల్లులు తీసుకువచ్చారు. 1. హిందూ వివాహ చట్టం, 2. హిందూ వారసత్వ చట్టం, 3. హిందూ మైనార్టీ మరియు దక్షత (గార్డియన్) చట్టం 4. దత్తత మరియు పోషణ చట్టం. ఈ నాలుగు చట్టాలను 1955-56 సంవత్సరాలలో ఆయన తీసుకువచ్చాడు. హిందువులకు సంబంధించిన ఈ నాలుగు చట్టాలే కాకుండా 'స్పెషల్ మ్యారేజి యాక్ట్' (ప్రత్యేక వివాహ చట్టం) అనేదాన్ని కూడా తీసుకువచ్చారు. బ్రిటిషు వాళ్ళ టైంలో 1873లోనే స్పెషల్ మ్యారేజి యాక్ట్ ఒకటి ఉండేది. ఆ తరువాత 1954లో ఈ స్పెషల్ మ్యారేజ్ చట్టాన్ని తీసుకువచ్చారు. తర్వాత దానికి అప్పుడప్పుడూ సవరణలు కూడా చేస్తూ వచ్చారు. అందువల్ల మొత్తం హిందువులకు వర్తించే ఐదు చాట్టాలు ప్రస్తుతం ఉన్నాయి. అలాగే ముస్లిం పర్సనల్ లా 1937లో చేసింది అదే కొనసాగుతోంది. ముస్లింలకి వేరే చట్టం, పార్శీలకి వేరే చట్టం, గోవాలో ఒక ప్రత్యేకమైన పౌరస్మృతి ఉంది. అలాగే పాండిచ్చేరిలో ఇంకొకటి ఉంది. గోవా, దయ్యూ, డామన్, పోర్చుగల్ వాళ్ళ పాలనలో 1958-59లో విముక్తి అయ్యాయి కాబట్టి వాళ్ళకి వేరే చట్టాలు ఉన్నాయి. ఈరోజు గోవాలో అమలులో ఉన్న చట్టం పోర్చుగల్ దేశంలో 1867లో చేసింది. పాడించేరిలో ఫ్రెంచి వాళ్ళు 1804లో చేసిన చట్టం అమలులో ఉంది. గిరిజన ప్రాంతాల్లో ఈ చట్టాలన్నింటికి మినహాయింపు ఉంది. ఐదవ షెడ్యూల్, ఆరవ షెడ్యూల్ ప్రాంతాలలో ఈ చట్టాలకి మినహాయింపు ఉంది. ఆరవ షెడ్యూల్‌కి అంటే ఈశాన్య ప్రాంత రాష్ట్రాలకు ఎక్కువ మినహాయింపు ఉంది. ఇలా చాలా తేడాలు ఉన్నాయి. అంతే కాదు ఈ చట్టాలలో ఒక ప్రాంతంలో వర్తించేవి ఇంకో ప్రాంతంలో వర్తించవు. ఉదాహరణకి ముస్లిం పర్సనల్ లాలో ఉన్నది కాశ్మీర్ ప్రాంతంలో వర్తించవు, వాళ్ళకి వేరే చట్టాలు ఉన్నాయి. షియాలకి వర్తించే చట్టాలు సున్నిలకు వర్తించవు. ఇలా చాలా తేడాలు ఉన్నాయి.

ఇన్ని తేడాలున్న దేశంలో ఒక దేశం-ఒకే చట్టం-ఒకే పాలనా ఉండాలి కాబట్టి అనిటినీ కలిపి ఒకటే చట్టం తెచ్చేద్దాం మీకు అంగీకారమా కాదా అని అంటున్నారు. అయితే, వాళ్ళు చేసే మార్పులేంటనేది ఇంత వరకూ

> **“ ముస్లిం మహిళల కన్నీళ్ళు తుడవటానికే ఈ ప్రయత్నం చేస్తున్నట్టు మోడీ మాట్లాడుతున్నాడు. అది అబద్ధం, ఇదంతా మొసలి కన్నీళ్లని స్పష్టంగా చెప్పగలం. వివాహ వ్యవస్థలో ఒకే రకమైన పద్ధతి తీసుకురావడం నేటి భారతీయ పరిస్థితుల్లో కుదరని పని. ఇప్పుడు ముస్లిం చట్టంలో విడాకులు తీసుకునే దానికి ఒక పద్ధతి ఉంది. తలాక్ అనే ఒక పద్ధతి. హిందూ వివాహ చట్టాలలో అసలు విడాకులు అనేదానికి అవకాశమే లేదు. ”**

చెప్పలేదు. యూనిఫారమ్ చట్టం అనడం తప్ప అందులో ఎటువంటి మార్పులు తీసుకువస్తారనేది ఇంతవరకూ చెప్పలేదు. మార్పులు ఎంటో చెప్పకుండానే ఈ యూనిఫారమ్ సివిల్‌కోడ్‌కి అంగీకారమా కాదా అని అడగడం, వ్యతిరేకం అంటే నువ్వు దేశాన్ని విచ్ఛిన్నం చేసే వాడివి. అనడం ఎంతవరకు సబబు? “ముస్లింలు, క్రైస్తవులు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. హిందువుల అందరూ అనుకూలంగా ఉన్నారు” అనే అభిప్రాయాలన్ని సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. అంటే ఈ మొత్తం సమస్యను హిందువులకూ, ఇతరులకూ మధ్య వివాదంగా మలిచి ఎన్నికలలో లబ్దిపొందాలని బిజెపి పార్టీ ప్రయత్నస్తోంది.

అయితే ఇందులో లోతుపాతులకు వెళితే వాళ్ల వాదనల్లోని బండారం బయట పడుతుంది. మొదటిది, ఒకటే చట్టం ఉండాలన్న వాదన. ఉదాహరణకి వివాహమే తీసుకోండి. వివాహం విషయంలో దేశమంతటా మతాలతో నిమిత్తం లేకుండా అందరికి ఒకటే చట్టం ఉండాలని అన్నార ఁకోండి, అప్పుడు దానిలో చాలా తేడాలు వస్తాయి. ఉదాహరణకు మన దక్షిణాదిలో మేనరికాల పెళ్ళిళ్ళు చాలా జరుగుతూ ఉంటాయి. అదే ఉత్తరాదిలో అమ్మాయివైపు మూడు తరాలు, అబ్బాయి వైపు ఐదు తరాలలో ఉమ్మడిగా ఎవరైనా పెద్దలు ఉంటే వాళ్ళిద్దరి మధ్య పెళ్ళి చేయ్యకూడదు. వాళ్లు సగోత్రికులవుతారు. ఐదు తరాలు అటు, మూడు తరాలు ఇటు గోత్రాలు కలవ కూడదు. ఎక్కడైనా కలిస్తే ఆ పెళ్ళి కుదరదు. హర్యానాలో ఖాప్ పంచాయితీలు, అంటే కుల పంచాయితీలు జరుగుతున్నాయి. ఒకే గోత్రం కలిసిన వారి మధ్య గనక పెళ్ళి జరిగితే ఖాప్ పంచాయితీ ఆ పెళ్ళిని రద్దు చేస్తుంది. వాళ్ళకు శిక్షలు వేస్తుంది. ఇప్పుడు హర్యానా వాళ్ళు పాటిస్తున్నట్లు ఒకే గోత్రం వాళ్ళకి పెళ్ళిళ్ళు చేయ్యకూడదు అన్న సూత్రాన్ని అనుసరించి బిజెపి ఒక చట్టం చేసిందను కోండి. దక్షిణాదిలో మేనరికపు పెళ్ళిళ్ళన్నీ చెల్లకుండా పోతాయి. ఇక ముందు అలాంటి పెళ్ళిళ్ళు చేయ్యకూడదు అనేది వస్తుంది. దక్షిణాది వాళ్ళు ఒప్పుకుంటారా! ఒప్పుకోరు. మేనరికం పెళ్ళిళ్ళు కూడా పర్మిట్ చేద్దామని చట్టం చేసిందనుకోండి ఉత్తరాది వాళ్ళు ఒప్పుకుంటారా! ఒప్పుకోరు. అలాగే పెళ్ళిళ్ళలో గిరిజనులల్లో బహు భార్యత్వ పద్ధతి ఉంది. దేశం మొత్తం మీద ఎక్కువగా బహు భార్యత్వం ఉన్నది గిరిజనుల్లోనే. ఇప్పుడు ఒకే భార్య, ఒకే భర్త అనే పద్ధతి ఉండాలి ఒక మగాడికి ఒక ఆడదే ఉండాలి అన్న చట్టం చేశారనుకోండి, అప్పుడు గిరిజనులందరూ దీన్ని అంగీకరిస్తారా!

ముస్లింలకే దుర్మార్గమైన చట్టాలు ఉన్నట్లు ముస్లిం మహిళల కన్నీళ్ళు తుడవటానికే ఈ ప్రయత్నం చేస్తున్నట్టు మోడీ మాట్లాడు తున్నాడు. అది అబద్ధం, ఇదంతా మొసలి కన్నీళ్లని స్పష్టంగా చెప్పగలం. వివాహ వ్యవస్థలో ఒకే రకమైన పద్ధతి తీసుకురావడం నేటి భారతీయ పరిస్థితుల్లో కుదరని పని. ఇప్పుడు ముస్లిం చట్టంలో విడాకులు తీసుకునేదానికి ఒక పద్ధతి ఉంది. తలాక్ అనే ఒక పద్ధతి. హిందూ వివాహ చట్టాలలో అసలు విడాకులు అనేదానికి అవకాశమే లేదు. హిందూ శాస్త్రాల ప్రకారం విడాకులనేది అనుమతించకూడనిది. మరి ఇప్పుడు ఈ చట్టాన్ని తీసుకువచ్చి మనువాదాన్ని ముస్లింల మీద రుద్దు తారా, ముస్లింల తలాక్ తీసుకువచ్చి హిందువుల మీద రుద్దుతారా! వివాహ చట్టాల్లో అయా మతాల వారీగా మాత్రమే కాదు, ఆయా ప్రాంతాల వారిగా కూడా తేడాలు ఉన్నాయి. ఒకే మతంలో కూడా వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు పద్ధతులు ఉన్నాయి. వీటన్నింటిని ఒక దగ్గరికి తెచ్చి వాటిని నెమ్మదిగా క్రమ క్రమంగా మత ప్రభావం, నమ్మకాలు, విశ్వాసాల పరిధిలోంచి బయటికి తీసుకువచ్చి ఒకే రూపంలోకి మార్చాలని సుప్రీంకోర్టు చెప్పింది.

నిజానికి లౌకిక లక్షణం ఉన్న పెళ్ళికి గానీ, విడాకులకు గానీ మతంతో సంబంధం లేదు. దత్తతకూ, ఆస్తి వారసత్వానికి కూడా మతంతో సంబంధం లేదు. కాని ప్రస్తుతం పరిస్థితుల్లో అవి మతంతోనూ, మతాచారాలతోనూ ముడిపడి ఉన్నాయి. వాటిని సున్నితంగా విడగొట్టి తీసుకువచ్చి అందరికి అంగీకారం అయ్యే పద్ధతిలో చెయ్యాలంటే ఈ బిల్లు స్వచ్ఛందంగా వారు అంగీకరించేటట్టు ఉండాలి. అంబేద్కర్ కూడా యూనిఫారమ్ సివిల్‌కోడ్ తేవాలంటే అది స్వచ్ఛందంగా, అందరూ ఒప్పుకొనేలా చేసి తీసుకురావాలి తప్ప బలవంతంగా రుద్దకూడదని స్పష్టంగా చెప్పారు. రాజ్యాంగ పరిషత్‌లో చర్చల సందర్భంగా ఆయన చెప్పిన అభిప్రాయాలన్నీ రికార్డయి ఉన్నాయి. అందువల్ల వివాహ చట్టాలు బలవంతంగా రుద్దడం సాధ్యం కాదు. ఆచరణ సాధ్యం కూడా కాదన్న విషయాన్ని మనం గుర్తుపెట్టుకోవాలి.

**మోడీ ప్రభుత్వ కుట్ర**

మరి ఈ విషయం ఇప్పుడు ఎందుకు చర్చకు వచ్చింది? మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రధానంగా ముందుకు తెచ్చిన అజెండా 1. రామమందిరం నిర్మాణం, 2. అధికరణం 370 రద్దు, 3. ఏకరూప పౌరస్మృతి (యూనిఫారమ్ సివిల్‌కోడ్). ఈ మూడింటినీ ప్రాధాన్యతా క్రమంలో అలా తెచ్చారు. మొదటిది రామమందిర నిర్మాణానికి మతకల్లోలాలు రెచ్చగొట్టి బాబ్రీ మసీదు పడగొట్టారు. రెండవది కాశ్మీర్‌ను ముక్కలు చేసి 370 వ అధికరణాన్ని రద్దు చేశారు. మూడవదైన ఏకరూప పౌర స్మృతిని ముందుకు తీసుకువస్తున్నారు.. ఎన్నికల ముందు ఈ అంశాన్ని వివాదంగా చెయ్యాలనేది మోడీ ఉద్దేశ్యం. మోడీ 2014 అధికారంలోకి వచ్చిన తర్వాత 21వ లా కమీషన్ ఏర్పాటు చేశారు. ఈ కమీషన్ 2018లో కొన్ని సిఫార్సులు చేసింది. ఆ సిఫార్సులు ఏమిటి? ఇప్పుడున్న పరిస్థితుల్లో వెంటనే ఒక ఏకరూప పౌరస్మృతిని ముందుకు తేవడం వల్ల దేశ ఐక్యత, సమగ్రత రెండు దెబ్బతింటాయి, ఇది ఈ సమయంలో తీసుకురాడం మంచిది కాదు అని లా కమిషన్ 2018లో చెప్పింది. 2018కీ 2023కీ పరిస్థితి ఏమన్నా మారిపోయిందా! నిజానికి ఈ కాలంలో మరి కొంచెం విద్వేషాలు పెరిగాయే తప్ప తగ్గింది ఏమి లేదు.

> ❝ ఈ కుటుంబ చట్టాల్లో పురుషుడి కంటే స్త్రీ తక్కువ స్థాయిలో చూడబడుతోంది. అన్ని మతాల్లోనూ, అన్ని కులాల్లోనూ చివరికి గిరిజనుల్లో కూడా ఎక్కడా కూడా స్త్రీ, పురుషులకు సమానత్వం అనేది లేదు. కాబట్టి ముందు ఆయా కులాల్లో ఆయా సామాజిక సమూహాల్లో స్త్రీ, పురుష అసమానత పోయేలాగా చట్టాలను సంస్కరించాలి. ఒక కులంలోనో లేక, గిరిజనులు, హిందువులు లేక ముస్లింలలోనో ఉన్న అసమానతలను సరి చేసుకుంటూ వస్తే తర్వాత అన్నింటిని ఒక ఉమ్మడి చట్టం కిందకు తీసుకురావచ్చు. ❞

21వ లా కమీషన్ ఏం చెప్పిన దాంట్లో మొదటిది, ఆయా సామాజిక గ్రూపులు, ఆయా మతాలు, కులాలు, తెగలు, జాతుల్లో ఉన్న ఆచారాలు వేటినైతే వాళ్ళు చట్టాలుగా పరిగణిస్తున్నారో వాటన్నింటిని కోడిఫై చేయ్యాలి. వీటిలో చాలా వాటికి రికార్డు కూడా లేదు. ఉదాహరణకు కుల పంచాయితి ఏం చెబితే అదే తీర్పు అన్నట్టుగా పరిగణిస్తుంటారు. కుల పంచాయితీ ఇవాళ ఒక తీర్పుచెప్పొచ్చు రేపు మరో తీర్పు చెప్పొచ్చు. కాబట్టి అలా రోజుకో పద్ధతిలా మారిపోకుండా మొత్తం ఇప్పుడున్న చట్టాలు మంచివా చెడ్డవా అన్నదానితో నిమిత్తం లేకుండా ముందుగా రికార్డు చేయాలి. అలా వాటన్నింటిని ఒక దగ్గరకు తీసుకువచ్చి పరిశీలించాలి అని లా కమిషన్ చెప్పింది.

రెండవది ఈ కుటుంబ చట్టాల్లో పురుషుడి కంటే స్త్రీ తక్కువ స్థాయిలో చూడబడుతోంది. అన్ని మతాల్లోనూ, అన్ని కులాల్లోనూ చివరికి గిరిజనుల్లో కూడా ఎక్కడా కూడా స్త్రీ, పురుషులకు సమానత్వం అనేది లేదు. కాబట్టి ముందు ఆయా కులాల్లో ఆయా సామాజిక సమూహాల్లో స్త్రీ, పురుష అసమానత పోయేలాగా చట్టాలను సంస్కరించాలి. ఒక కులంలోనో లేక, గిరిజనులు, హిందువులు లేక ముస్లింలలోనో ఉన్న అసమానతలను సరి చేసుకుంటూ వస్తే తర్వాత అన్నింటిని ఒక ఉమ్మడి చట్టం కిందకు తీసుకురావచ్చు. కాబట్టి మొదటిగా అన్నింటిని కోడిఫై చేయ్యమన్నారు. రెండవది స్త్రీలకి పురుషులకి మధ్య ఉన్న అసమానతలను తొలగించాలన్నారు.

మూడవది, కొన్ని చట్టాలు ఇప్పటికే మతంతో నిమిత్తం లేకుండా ఉన్నాయి. ఉదాహరణకు స్పెషల్ మ్యారేజి యాక్ట్ ఉంది. రిజిస్టర్ ఆఫీస్‌కి వెళ్ళి నోటిస్ ఇచ్చి పెళ్ళి చేసేసుకుని అక్కడ రిజిస్టర్ చేసుకుంటే దానిని స్పెషల్ మ్యారేజి యాక్ట్ కింద నమోదు చేస్తారు. స్పెషల్ మ్యారేజి యాక్ట్‌లో ఇప్పుడు ఒక ఇబ్బంది ఉంది, దాన్ని ఒక నెల ముందు నోటీస్ బోర్డులో పెడతారు. ఫలానా ఎక్స్, ఫలానా వై వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోబోతున్నారు. వీళ్ళలో ఒకరు హిందువూ, మరొకరు ముస్లిం అనుకోండి ఈ నోటిస్ బోర్డు చూసి భజరంగదళ్ వాళ్ళో, ఇంకొకళ్ళో లేకపోతే అగ్రకుల దురహంకారులో వాళ్ళ పిల్లలు మతాంతర వివాహం చేసుకుంటున్నారనో లేక దళితులను పెళ్ళి చేసుకుంటున్నారనో ఆ పెళ్ళి జరగకుండా చేయడం, చివరికి పరువు హత్యలకు దారితీస్తోన్న పరిస్థితులు నేడు ఉన్నాయి. ఒక నెల ముందు నోటీస్ ఇచ్చి పెళ్ళి చేసుకోండి అంటే అబ్బాయి, అమ్మాయి పెళ్ళి చేసుకోడానికి మొత్తం పబ్లిక్ అమోదం దొరికితేగాని పెళ్ళి చేసుకోవద్దు అన్న అర్థం వస్తుంది. పెద్దలు తమ పెళ్ళికి వ్యతిరేకం అయినా సరే మేం చేసుకుంటాం అనే వారికి ఈ చట్టం చాలా ఇబ్బంది పెడుతోంది. అందుకని అటువంటివి తీసేయ్యాలి, ఒక నెల నోటీసు అనేది తీసేయ్యాలి ఇటువంటి అంశాలన్నింటినీ ప్రస్తుత చట్టాలలోంచి తొలగించండి ముందు అని చెప్పారు.

నాలుగోది చాలా ప్రత్యేకంగా చెప్పింది. గిరిజనులను మొత్తంగా ఇందులో నుండి మినహాయించాలంది. వారు మొత్తం సమా. అభివృద్ధికే ఎడంగా ఉన్నారు కనుక వాళ్ళ విషయంలో అందరితో పాటు సమానంగా వ్యవహరిస్తే చాలా ఇబ్బందులు వస్తాయని చెప్పింది.

ఈ నాలుగు విషయాలు చెప్పి లా కమిషన్ ఒక మంచి వ్యాఖ్యానం చేసింది. ఐక్యంగా ఉండడానికి ఏకరూపతే పరిష్కారం కాదు "యూనిఫారమ్ డజంట్ మేక్ యూనిటి" ఇది ఇంగ్లీషులో వాళ్ళు చెప్పింది. అంటే అందరికి ఒకే రకమైన చట్టాలు తెస్తే ఆ ప్రజల మధ్య ఐక్యత వచ్చేస్తుంది అనుకోవడం తప్పు అని. నిజానికి అలా చేయడం వల్ల దానికి భిన్నమైన పరిణామాలు వస్తాయి. ప్రజల ఐక్యతను చెడగొట్టడానికే ఏకరూప పౌరస్మృతి దారి తీస్తుంది అని 21వ లా కమీషన్ చెప్పింది. ఇప్పుడు సిపిఐ(ఎం) చెబుతున్నదీ అదే. 21వ లా కమీషన్ చెప్పిన పాయింట్‌నే సిపిఐ(ఎం) చెప్పింది.

21వ లా కమీషన్ పై సమస్యల పరిష్కారానికి ఒక యాక్షన్ ప్లాన్ కూడా చెప్పింది. ఈ యాక్షన్ ప్లాన్‌లో నాలుగు అంశాలున్నాయి. ఒకటి, ఏ పద్ధతిలో పెళ్ళి అయినా ఆ పెళ్ళిని రిజిస్టర్ చేయ్యాలి. కొన్ని రాష్ట్రాల్లో అక్కడక్కడ చేస్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో దానిని సీరియస్‌గా పాటించడం లేదు. కాని ప్రతి పెళ్ళి నమోదు కావాలి, రిజిస్ట్రేషన్ కావాలి అనేది మొదటిది. రెండోది, పెళ్ళికి కనీస వయస్సు అనేది దేశం మొత్తం మీద ఒకటే ఉండాలి. మతాలు ఏవైనా పెళ్ళి వయసు ఒకటే ఉండాలి. ఎందుకంటే అది ఆరోగ్యానికి సంబంధించింది. మా మత విశ్వాసాల ప్రకారం అమ్మాయి పుష్పవతి కాగానే పెళ్ళి చేసేస్తాము అంటే కుదరదు. ఎందుకంటే ఆ అమ్మాయి ఆరోగ్యం, పుట్టే బిడ్డల ఆరోగ్యం దెబ్బతింటుంది. ఈ వెనుకబడిన ఆచారం వల్ల దేశం మొత్తం నష్టపోతుంది. అందుకని వివాహ వయస్సు విషయంలో ఒక ఏకరూపత తీసుకురావడానికి ప్రయత్నించాలి. మూడవది, విడాకులు పొందే పద్ధతిని సరళీకరించాలి. ఇప్పుడు విడాకులు పొందడం అంటే కోర్టు చుట్టూ సంవత్సరాల పాటు తిరగాల్సి వస్తోంది. దీన్ని సరళీకరించాలి. కలిసి బతకడం ఇష్టం లేని వాళ్ళు విడిపోవడాన్ని ప్రభుత్వమే మరింత కష్టతరం చేయ్యకూడదు కాబట్టి విడాకుల చట్టాలను సరళతరం చేయాలని చెప్పారు. నాలుగోది స్పెషల్ మ్యారేజి యాక్ట్‌లో 30 రోజుల నోటీస్ అనేది రద్దు చేయాలని చెప్పారు. ఇవన్నీ చెబుతూ... ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వం ఏకరూప పౌరస్మృతి (యూసిసి)ని తీసుకురావడం మంచిది కాదు, ఆరోగ్య కరమూ కాదని, దానివల్ల ఎన్నో నష్టాలు వస్తాయని తెలిపారు.

ఈ లా కమిషన్ మోడీ ప్రభుత్వం వేసినదే. అదే 2018లో పై సిఫార్సులు చేసింది. దాన్ని మోడీ ప్రభుత్వం పక్కన పెట్టేసింది. ఎందుకంటే వాళ్ళు కోరుకున్న సిఫార్సు అందులో లేదు కాబట్టి. యూసిసి కావాలి అని ఆ కమిషన్ చెప్పాలి అని మోడీ ప్రభుత్వం కోరుకున్నది. కాని ఆ లా కమీషన్ ప్రజలనూ, వాళ్ళ సంక్షేమాన్నీ, దేశాన్నీ దృష్టిలో పెట్టుకొని చక్కగా చెప్పింది. కమిషన్ ప్రజల నుండి దాదాపు 77 వేల పైచిలుకు పిటిషన్‌లు తీసుకుంది, అనేక

> 21వ లా కమిషన్ చేసిన సిఫార్సులపై చర్చ జరగకుండా, వాటిని అమలు చేయకుండా, నొక్కి పెట్టింది మోడీ ప్రభుత్వం. తిరస్కరిస్తున్నాం అని కూడా చెప్పలేదు. టైం అయిపోయింది. కాబట్టి కొత్తది తీసుకువస్తున్నాం, మరో లా కమిషన్ వేశాము అన్నారు. దీని వెనకాల మోడీ ప్రభుత్వం ఎంత నాటకమాడుతున్నదో అర్థం అవుతుంది.

సంస్థలను, మతాధికారులను, కులాల పెద్దలను, రకరకాల వయసుల వాళ్ళని, రక రకాల వృత్తుల్లో ఉన్నవాళ్ళని, న్యాయ నిపుణులని ఇంకా అనేక మంది ఇతరులనూ కలిసి వాళ్ళ అభిప్రాయాలు తీసుకున్నాక తన నివేదికను ఇచ్చింది.

ఇంతటి ప్రజాభిప్రాయం తీసుకుని, ఇంత గొప్ప సిఫార్సు చేసిన తర్వాత మోడీ ప్రభుత్వం దాన్ని పక్కన పెడెసి మళ్లీ 22వ లా కమిషన్‌ను 2020లో నియమించింది. ఈ లా కమిషన్ పదవీ కాలం 2023లో పూర్తయింది. కానీ పదవీకాలం ముగియడానికి ఒక్క రోజు ముందు దాని పదవీ కాలాన్ని తిరిగి ఆగస్టు 2024 దాకా పొడిగించింది. ఇక్కడే రాజకీయం ఉంది. ఈ లా కమిషన్ పొడిగించిన పదవీ కాలం ఎన్నికల తరువాత అంటే 2024 ఆగస్టు తర్వాత ముగుస్తుంది. ముగిసిన తరువాత అది తన నివేదిక ఇస్తుంది. అలా కాకుండా ఎన్నికల ముందు ఈ లా కమిషన్ ఏదో సిఫార్సు ఇచ్చిందను కోంది అప్పుడు మోడీ ప్రభుత్వం దానిపై ఏదో ఒక చర్య తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు, లా కమీషన్ మోడీ చెప్పినట్టే ఏకరూప పౌరస్మృతి ఉండాలని వచ్చే నెలలో సిఫార్సు చేస్తే అప్పుడు మోడీ ప్రభుత్వం ఏం చేయాలి? దాన్ని ఆమోదించి ఏకరూప పౌరస్మృతి తయారు చేయాలి. అందులో వివాహ వయస్సు ఇంత ఉండాలి అని పెట్టాలి. హిందువులకి, ముస్లింలకి ఇతరులందరికీ వర్తించే వన్నీ ఏమిఏమి ఉండాలిలో పెట్టాలి. అలా పెడితే అప్పుడు అసలు వ్యతిరేకత, గందగోళం వస్తుంది. మోడీ ప్రభుత్వమే కాదు ఏ ప్రభుత్వమైనా దీన్ని తట్టుకోలేదు. అందుకని మోడీ ప్రభుత్వ తాపత్రయం యుసిసి తీసుకు రాడం గురించి కాదు. ఈ 2024 లోపున యుసిసి రాదు. యుసిసిలో ఏం ఉండాలి ఏం ఉండకూడదు అనేది చర్చ జరగదు. యుసిసి ఉండాలా వద్దా అన్న ఒక్క పాయింట్‌ని పట్టుకుని హిందువులకి ముస్లింలకి మధ్యన తగువుగా పెట్టేసి ఎన్నికల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టి మెజార్టీ హిందువుల ఓట్లు తెచ్చుకుని మళ్లీ అధికారంలోకి రావాలనేది మోడీని నడిపించే బిజెపి–ఆర్ఎస్ఎస్ ఆలోచన. నిజంగా యూసిసి మీద వాళ్ళకి శ్రద్ధ ఉంటే గతంలో 21వ లా కమిషన్ చెప్పిన సిఫార్సులను అర్జెంట్‌గా అములు జరపాలి కదా. 21వ లా కమిషన్ యుసిసిని వద్దనేం చెప్పలేదు. ఇప్పుడు వెంటనే తేవద్దంది.

అందుకని వెంటనే చెయ్యాల్సిన పనులు ఏమున్నాయో వాటిని చేయకుండా 5, 6 ఏళ్ళ ఆలస్యం చేసి ఇప్పుడు అర్జెంట్‌గా యూసిసి అంటే అర్థం ఏముంది. మోడీ ప్రభుత్వం 2018లో లా కమిషన్ సిఫార్సులు రాగానే వాటిని అమోదించి, అములు చేయడానికి కొన్ని చర్యలు తీసుకొని ఉండాల్సింది. ప్రజల స్పందన అంటే ఆయా తరగతులు, మతాలు,గిరిజనుల స్పందన చూసి అది సానుకూలంగా వస్తే మరికొన్ని చర్యలు తీసుకుని ముందుకు పోవచ్చు. కానీ ఏ చర్యా తీసుకోకుండా 22వ లా కమిషన్ వేసి, దాన్ని వేసి మూడేళ్ళు అయిపోయింది కాబట్టి మళ్లీ దాని పదవీ కాలాన్ని పొడిగించామంటే, ఈ మూడేళ్లలో ఏంచేసినట్టు? 21వ లా కమిషన్ చేసిన సిఫార్సులపై చర్చ జరగకుండా, వాటిని అములు చేయకుండా, నొక్కి పెట్టింది మోడీ ప్రభుత్వం. తిరస్కరిస్తున్నాం అని కూడా చెప్పలేదు. టైం అయిపోయింది. కాబట్టి కొత్తది తీసుకువస్తున్నాం, మరో లా కమిషన్ వేశాము అన్నారు. దీని వెనకాల మోడీ ప్రభుత్వం ఎంత నాటకమాడుతున్నదో అర్థం అవుతుంది. 21వ లా కమిషన్ ఏ సిఫార్సులు చేసిందో వాటిని ముందు అములు చేసి తర్వాత మిగతా విషయాలు మాట్లాడాలి. ఇలా మాట్లాడకుండా మళ్లీ లా కమిషన్ వేసి, మళ్లీ చర్చలు పెట్టి వాటి ఆధారంగా భావోద్వేగాలు రెచ్చగొట్టి రాజకీయాలు నడపడం అంటే ప్రజల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రగుల కోల్పడం తప్ప మరోటి కాదు.

ఇక యూసిసికి అనుకూలమా, వ్యతిరేకమా అనే ప్రశ్న తప్పు. యూసిసిని ఎలా తీసుకురావాలి అనేది ప్రశ్న. మోడీ ఒక తప్పు ప్రశ్న వేసి దానికి సమాధానం అడుగుతున్నారు. అందుకు మనం తిరిగి ప్రశ్నించాల్సిందేమంటే మీ యుసిసిలో స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం ప్రధానమా కాదా చెప్పండి ముందు అని. సమానత్వం ముఖ్యమా ఏకరూపత ముఖ్యమా చెప్పండి అని. ఇప్పుడు ఒక స్కూల్‌లో పిల్లలందరికీ ఒకటే యూనిఫారమ్ ఉంటుంది. కాని అందులో ఒకరు కారులో వస్తారు, ఒకరు నడుచుకుని వస్తారు. కాని ఇద్దరు సమానమేనా. ఇద్దరు సమానం కాదు. చూడ్డానికి అంతా ఏకరూపమే అందుకని ఏకరూపత అంటే సమానత్వం కాదని అర్థం చేసుకో వాలి. ఏకరూపత కాదు సమానత్వం కావాలి. ముందు సమానత్వం సంగతి మాట్లాడి అది సాధించాక ఏకరూపత సంగతి తర్వాత మాట్లాడాలి.

రాజకీయ దురుద్దేశం లేకపోతే మీరు ఎందుకిలా హడావుడి చేస్తున్నారు అని ఇప్పుడు అడగాల్సిన ప్రశ్న. రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలలో కేవలం ఒక యూనిఫార్మ్ సివిల్‌కోడ్ మాత్రమేనా ఉంది ? ఆదేశ సూత్రాల్లో ఆర్థిక అసమానతలు తగ్గించాలని ఉంది. దేశాన్ని అదానీలకు, అంబానీలకు దోచిపెడుతున్నప్పుడు మోడీకి ఈ ఆదేశ సూత్రాలుగుర్తుకు రావు. యూనిఫారమ్ సివిల్‌కోడ్ దగ్గరే ఆదేశ సూత్రాలు గుర్తుకు వచ్చాయి. అదేవిధంగా అందరికి చదువు ఇప్పటికి సాధించలేదు. ఈ విషయంలో ఆదేశ సూత్రాలు గుర్తుకురాలేదు. ప్రాంతాల మధ్య అసమానతలు తగ్గించాలి అన్నది గుర్తుకు రాలేదు. సామాజిక న్యాయం అన్నది గుర్తుకు రాలేదు. అభివృద్ధికరమైనవన్నీ మర్చిపోయి అల్లరి పెట్టడానికి అవసరమైంది మాత్రమే ఆదేశ సూత్రాల నుండి తీసుకోవడం ఎంతవరకు సరైందో అర్థం చేసుకోవాలి. ఇప్పుడు ఆదేశ సూత్రాల ప్రకారం దేశం మొత్తం అందరి సంపద వృద్ధి చెందాలి. ప్రతి ఒక్కరి తలసరి ఆదాయం పెరగాలి. ఇటువంటివన్ని ఆదేశ సూత్రాలలో ఉన్నాయి. అవన్ని ముందు అములు చేయాలి. ఆ ఊసేలేదు. ఎందరో పేదరికంలో ఉన్నారు, కడుపునిండా తిండి తినలేకపోతున్నారు. మరి ఆకలి సూచికలో మనం కిందకు దిగజారిపో తున్నాం. ఇవన్ని వచ్చినప్పుడు ఆదేశ సూత్రాలు గుర్తుకు రాకుండా యుసిసి దగ్గరే గుర్తుకు రావడం అత్యంత హేయమైంది.

### షా బానో కేసు

21వ లా కమిషన్ గురించి చెబితే వాళ్ళు సుప్రీం కోర్టు షాబానో కేసులో చెప్పింది అంటున్నారు. అసలు షాబానో కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులో చెప్పిందేమంటే ఇలాంటి తగువులు లేకుండా ఉండాలంటే తొందరగా మీరు ఉమ్మడి పౌరస్మృతి తీసుకురండి అని. 1995లో షాబానో కేసు తది తీర్పు సందర్భంగా అలా చెప్పింది. కాని 1996లో మళ్లీ దానికి భిన్నంగా మరొక తీర్పు వచ్చింది. పన్నాలాల్ బన్సిలాల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో యుసిసి ఉండటం మంచిదే కాని ఇప్పుడు దానిని తీసుకురావడం దేశ సమైక్యతకి, సమగ్రతకి భంగం కలిగించొచ్చు అని చాలా స్పష్టంగా సుప్రీం కోర్టు చెప్పింది. మళ్లీ మరోక సందర్భంలో జాన్ వల్లమట్టం వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు సందర్భంగా పెళ్ళిళ్లు, విడాకులు, దత్తత వంటివి మత విశ్వాసాలతో సంబంధం లేని లౌకిక విషయాలు. మనం మత విశ్వాసాలనూ, లౌకిక వ్యవహారాలనూ జాగ్రత్తగా విడదీసి అటువంటి వాటన్నిటికీ ఉమ్మడిచట్టాలు చేసుకుటూ రావాలి అని సుప్రీం కోర్టు చెప్పింది.

మరి ఈ రెండు తీర్పులు గురించి ఎందుకు నోరు విప్పరు. షాబానో కేసు తీర్పు ఒక్కటి మాట్లాడతారు. దాని గురించి కూడా వక్రీకరించి మాట్లాడతారు. షాబానో కేసు అసలు సంగతేంటో తెలుసుకోవాలి. షాబానో ఒక 70 ఏళ్ళ ముసలావిడ. ఆ వయసులో ఆమెకు భర్త విడాకులు ఇచ్చాడు. విడాకులు ఇచ్చినప్పటి నుండి మూడు నెలల ఇద్దత్ కాలంలో ఆవిడకి అవసరమైన పోషణ ఖర్చులు ఇస్తాను, మిగిలిన దాంతో నాకు సంబంధం లేదు అని చెప్పాడు. తన భర్త తనని విడిచిపెట్టి దూరంగా ఉంటూ తన పోషణ కూడా పట్టించుకోవటం లేదని కోర్టుకు వెళ్ళింది షాబానో. ఈ వయసులో మూడు నెలలు పోషణ ఇస్తాను మిగతాది నాకు సంబంధం లేదని చెప్పడం కరక్టు కాదు అని ఆవిడ తరపున లాయర్ లతీఫ్ వాదించాడు. ఈ వాదనలన్ని విన్న సుప్రీం కోర్టు షాబానో అనే ఆవిడ బతికి ఉన్నంత కాలం భర్త భరణం ఇవ్వాల్సిందే అని తీర్పుచెప్పింది. ఈ తీర్పుపై ముస్లిం ఛాందసవాదులందరూ పెద్ద గోడవ చేశారు. మా ఖురాన్ నమ్మకాల జోలికి, మా షరియత్ చట్టాల జోలికి వస్తున్నారు. ఇది మా పర్సనల్ లా. మీరు క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ కింద దీనిపై ఎలా తీర్పు చెపుతారు అని గగ్గోలు చేశారు. సుప్రీం కోర్టు సివిల్ కేసు కింద తీర్పు చెప్పలేదు. సిఆర్‌పిసి 125 కింద తీర్పు చెప్పింది. క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ ఏ మతానికైనా వర్తిస్తుంది. అందుకనే లతీఫ్ గారు సిఆర్‌పిసి కేసు వేశాడు. సుప్రీం కోర్టు దానిని అడ్మిట్ చేసి షాబానోకి అనుకూలంగా తీర్పు చెప్పింది.

❝ షాబానో కేసు చూపించి ముస్లిం మహిళలు అన్యాయం అయిపోతునట్టూ, హిందూ మహిళలకు బ్రహ్మాండంగా న్యాయం జరిగిపోతున్నట్టూ ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేస్తోంది. కానీ హిందూ మహిళలకు కూడా ముస్లిం మహిళలకు ఏమి తీసుకోని విధంగా అన్యాయాలు జరుగున్నాయి. ఇందులో చాలా అంశాలు మనం చెప్పొచ్చు. హిందూ చట్టాలలో విడాకుల ప్రస్తావనే లేదు. ఆస్తి హక్కులో చాలా తేడాలు ఉన్నాయి. కొన్ని చట్టాల ప్రకారం అయితే మగ పిల్లలకే ఆస్తి హక్కు ఉంది. ❞

తీర్పుపై ముస్లిం ఛాందసవాదులందరూ గొడవ చెయ్యగానే అప్పుడున్న రాజీవ్‌గాంధీ వెంటనే, "ముస్లిం విమెన్ డైవర్స్ అండ్ మెంటెనేన్స్ యాక్ట్" అని మరో చట్టాన్ని హడావుడిగా చేశారు. దుర్మార్గమైన చట్టం అది. అందులో ముస్లిం మహిళ విడాకులకు ఇద్దత్ కాలం తప్ప మిగతా కాలం భర్తకేం సంబంధం లేదనీ, ఇద్దత్ కాలంలో ఆవిడకి న్యాయబద్ధమైననష్ట పరిహారం ఇవ్వాలనీ, తర్వాత ఆవిడ బాధ్యతను పుట్టింటి వాళ్ళైనా చూడాలి లేదా వక్ఫ్ బోర్డు వాళ్లైనా చూడాలి అని చట్టంలో పేర్కొన్నారు. షాబానోకే అప్పటికి 70 ఏళ్ళు. అప్పుడు ఆమెను పుట్టింటి వాళ్ళు చూడగలిగే పరిస్థితిలో ఉంటారా? అసలు వాళ్ళు బతికి ఉంటారా లేదా? ఈ చట్టంలో అర్థం ఏమన్నా ఉందా? కేవలం ఆ ముస్లిం పెద్దల ఒత్తిడికి లొంగి రాజీవ్‌గాంధి చేసిన పనికిమాలిన చట్టం అది.

ఆ చట్టాన్ని చూపించి ఆర్‌ఎస్‌ఎస్ వీళ్ళంతా ఇది దుర్మార్గం, సూడో సెక్యూలరిజం అని అల్లరి చేశారు. సిపిఐ(ఎం) కూడా ఆ చట్టాన్ని తప్పు అని చెప్పింది. సుప్రీం కోర్టు ఒక మంచి తీర్పు ఇస్తే దానిని నువ్వు మొత్తం చెడగొట్టావు అని రాజీవ్ గాంధిని సిపిఐ(ఎం) ఆనాడు విమర్శించింది. మత రాజకీయాల దగ్గరకి వచ్చేసరికి కాంగ్రెస్ పార్టీ ఎంత మెతకగా ఉంటుందో ఈ ఉదాహరణ మన కళ్లకు కట్టింది.

దానిమీద అప్పీలుకు వెళ్ళారు. రాజీవ్ గాంధీ చేసిన చట్టంలోనుంచే లతీఫ్ గారు తన వాదనను నిర్మించారు. ఆ చట్టం ప్రకారం అయినా విడాకులిచ్చిన భర్త ఆ భార్య కు న్యాయమైన పరిహారం ఇద్దత్ కాలం మూడు నెలల కాలంలోపే చెల్లించాలనీ, దానిని లతీఫ్ గారు చాలా తెలివిగా ఆ రాజీవ్‌గాంధి చేసిన చట్టంలో ఉన్న పదాన్ని ఇంటర్‌ప్రిట్ చేశాడు. న్యాయమైన పరిహారం అంటే అర్థం ఆ మహిళ తన తదుపరి జీవితకాలం అంతా బతకగలిగేందుకు సరిపడా ఇవ్వ వలసిన సొమ్ము అని అర్థం చెప్పాడు. ఆ సొమ్మును ఒకవేళ మూడు నెలలలోపు చెల్లించలేకపోతే వాయిదాలలో నెలనెలా చెల్లించమనండి అని వాదించాడు. సుప్రీం కోర్టు లతీఫ్ వాదనతో ఒప్పుకుంది. దాంతో ఇప్పుడు భారతదేశంలో హిందూ మహిళలకు భరణం ఎలా వస్తుందో ముస్లిం మహిళలకు కూడా అలానే వస్తుంది. ముస్లిం మహిళలకి ఇప్పుడు భరణం లేనట్టూ, హిందూ మహిళలకు మాత్రమే ఉన్నట్టు మోడీ, ఆయన పరివారం వాపోతున్నారు. అది శుద్ధ తప్పు.

ఇది షాబానో కేసు కాబట్టి దాన్ని చూపించి ముస్లిం మహిళలు అన్యాయం అయిపోతునట్టూ, హిందూ మహిళలకు బ్రహ్మాండంగా న్యాయం జరిగిపోతున్నట్టూ ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేస్తోంది. కానీ హిందూ మహిళలకు కూడా ముస్లిం మహిళలకు ఏమి తీసుకోని విధంగా అన్యాయాలు జరుగున్నాయి. ఇందులో చాలా అంశాలు మనం చెప్పొచ్చు. హిందూ చట్టాలలో విడాకుల ప్రస్తావనే లేదు. ఆస్తి హక్కులో చాలా తేడాలు ఉన్నాయి. కొన్ని చట్టాల ప్రకారం అయితే మగ పిల్లలకే ఆస్తి హక్కు ఉంది. కొన్ని చట్టాల్లో ఆడపిల్లకు ఆస్తి హక్కు ఉంది కానీ ఉమ్మడి కుటుంబంలో ఉన్నంత కాలమే అంటే హిందూ అన్‌డివైడెడ్ ఫ్యామిలిలో భాగంగా ఉంటేనే అవిడకా హక్కు ఉంటుంది. అందులోంచి వారు విడిపోయి వేరే కుటుంబంగా ఉంటే ఆ హక్కుపోతుంది. అలాగే ఈ వారసత్వపు చట్టాల్లో హిందువు ఒక్కరు సంపాదించినా ఆస్తి అతని తదనంతరం పిల్లలకి వాళ్ళ పిల్లలకి అలా చెందుతుంది. ఒక వేళ వీలునామా రాస్తే అది ఎవరికి కావాలంటే వారికి రాసి ఇచ్చేయచ్చు. ముస్లిం చట్టాల్లో దీనికంటే కాస్త

> "చిన్న పిల్లలకి వయస్సు నిండకుండానే పెళ్ళి చేసేస్తు న్నారు. ఇప్పుడు భారతదేశంలో జరిగే పెళ్ళిళ్ళలో 10 శాతం కన్నా ఎక్కువ 18 ఏళ్ళ లోపు వాళ్ళవే జరుగుతు న్నాయి. మోడీ గారు వీటన్నింటినీ దేశం మొత్తం మీద ఏకరూప స్థితికి తేగలరా? కాప్ పంచాయితీలు ఇచ్చే తీర్పు లు చెల్లవు, మీరు ఇలాంటి తీర్పులు చెప్పడానికి వీల్లేదని చెప్పి వారిని ఎదుర్కొ గలరా?"

నయం. మొత్తం తన ఆస్తిలో ఆ రకంగా తనకు తోచిన వాళ్ళకి మూడో వంతు ఆస్తి మాత్రమే రాసి ఇవ్వగలడు. మూడింట రెండొంతులు వారసత్వంగా కింద వాళ్ళకి వెళ్ళాల్సిందే. ఇష్టం వచ్చినట్లు ఎవరికి పడితే వాళ్ళకి రాయడానికి వీల్లేదు.

జరుగుతున్నది చూస్తే ప్రస్తుతం చిన్న పిల్లలకి వయస్సు నిండకుండానే పెళ్ళి చేసేస్తున్నారు. కరోనా కాలంలో ఇది ఇంకా బాగా పెరిగిపోయింది. తర్వాత పరిస్థితి ఏమిటో అని చిన్న పిల్లలకు పెళ్ళిళ్ళు చేసేశారు. ఇప్పుడు భారతదేశంలో జరిగే పెళ్ళిళ్ళలో 10 శాతం కన్నా ఎక్కువ 18 ఏళ్ళ లోపు వాళ్ళవే జరుగుతున్నాయి. రాజస్థాన్ లాంటి రాష్ట్రంలో అయితే 25% బాల్య వివాహాలు జరుగుతున్నాయి. మోడీ గారు వీటన్నింటినీ దేశం మొత్తం మీద ఏకరూప స్థితికి తేగలరా? కాప్ పంచాయితీలు ఇచ్చే తీర్పులు చెల్లవు, మీరు ఇలాంటి తీర్పులు చెప్పడానికి వీల్లేదని చెప్పి వారిని ఎదుర్కొ గలరా? యూసిసి ద్వారా మహిళలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొంటానని చెబుతున్న మోడీ అంటరానితనం ఎదుర్కొంటున్న వారికి ఏం న్యాయం చేయగలగుతున్నారు. ఇప్పుడు చట్ట ప్రకారం అంటరానితనం నేరం. బెయిలు లేని శిక్షలు ఉన్నాయి. కానీ ఎవడికి శిక్షలు పడటం లేదు. అంటే చట్టం చేసినా అన్యాయం అలాగే కొనసాగుతోంది. దాన్ని సరిచేయడం మోడీ గారి ఎజెండాలో ఎందుకు లేదు. అందువల్ల ఇదంతా యుసిసి పేరుతో ఆడుతున్న నాటకం.

### గోవాలో ఏకరూప పౌరస్మృతి ఉందా?

ఇప్పటికే గోవాలో యూనిఫారమ్ సివిల్‌కోడ్ ఉందని వారి వాదనలో మరో అంశం. అది తప్పు. గోవాలో ఉన్నది 1867 నాటి పోర్చుగీస్ చట్టం. అందులో ఏకరూపత ఏమీ లేదు. అందులో క్యాథలిక్ క్రిస్టియన్‌లకి ఒక వివాహ చట్టం, మిగతా క్రిస్టియన్లకి ఇంకో చట్టం ఉంది. హిందూ పురుషుడు పెళ్ళి చేసుకున్నాక అతని భార్యకి 25ఏళ్ల వయస్సు వచ్చేలోపు ఆమె బిడ్డల్ని కనలేకపోయినా, 30 ఏళ్ళలోపు ఒకరైనా మగ బిడ్డను కనలేక పోయినా ఆ భర్త ఇంకో పెళ్ళి చేసుకోవచ్చు అని ఉంది. ఇది ఎంత దుర్మార్గం ? అంటే బహుభార్యత్వం గోవా యుసిసిలో ఉంది. అది ఏకరూపత కాదు. హిందువులకి స్పెషల్ పర్మిషన్ ఉంది. ఇప్పుడు బిజెపి వాళ్ళు దాన్ని ఎక్కువ ప్రచారం చేస్తున్నారు. అంటే మూడు నాలుగు పెళ్ళిళ్ళు చేసుకోనేందుకు జనాలని తయారు చేద్దామనా వీళ్ళ ఉద్దేశ్యం?

### గిరిజన ప్రాంతంలో

గిరిజన ప్రాంతంలో 6వ షెడ్యూల్‌లో కొన్ని ప్రాంతాలు, 5వ షెడ్యూల్‌లో కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. మన ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న గిరిజన ప్రాంతాలు కొన్ని 5వ షెడ్యూల్‌లోకి వస్తాయి. అయితే, మరి కొంత మంది గిరిజనులని 5 షెడ్యూల్‌లోకి వెలుపల కూడా ఉన్నారు. ఎక్కడ ఉన్నా గిరిజనుల కందరికీ వాళ్ళ సాంప్రదాయ చట్టాలే వర్తిస్తాయి. వాళ్ళ భూమి మీద, ఇతర విషయాల మీద ఏం చేసినా వాళ్ళ అసెంబ్లీలు వాటిని అమోదిస్తే తప్ప అమలు కావు. 5వ షెడ్యూల్, 6వ షెడ్యూల్‌కి సంబంధించి కూడా మన అసెంబ్లీ ఒక చట్టం చేసినట్లేయితే ఈ చట్టాన్ని తిరిగి గవర్నర్ ప్రత్యేకంగా ఆమోదించాలి. షెడ్యూల్డ్ ఏరియాలకి సంబంధించి ట్రైబల్ ఎడ్వైజరి కౌన్సిల్ కూర్చుని వాళ్ళు ఆమోదించి తర్వాత గవర్నరు అమోదిస్తే తప్ప ఈ అసెంబ్లీలో చేసిన చట్టాలు గిరిజన ప్రాంతంలో అమలు కావు. కొన్ని రకాలైన ఆదేశాలు గ్రామ పంచాయితి ఆమోదిస్తే తప్ప అమలు కావు. గిరిజనుల రక్షణకి కొన్ని ప్రత్యేకమైన చట్టాలు ఉన్నాయి. ఈ చట్టాలు ఉన్నా వాళ్ళ మీద దాడులు చేస్తున్నారు. ముఖ్యంగా ఇప్పుడు అటవి సంరక్షణ చట్టంలో మార్పులు చేసి పెద్ద ఎత్తున దాడి చేస్తున్నారు. ఇది చాలదన్నట్టు మీరందరూ యుసిసి పరిధిలోకి వస్తారని చెప్పి వాళ్ళల్లో ఉన్న బహుభార్యత్వాని నిషేధిస్తారా? ఇప్పటికీ గిరిజనులలో నూటికి 7 లేక 8 మంది ఇద్దరు లేక ముగ్గురు భార్యలు కలిగి ఉన్నారు. దేశం మొత్తం మీద చూస్తే బహుభార్యత్వం పెద్ద సమస్యగా లేదు. 1965 నాటికి దేశం మొత్తం మీద 6 శాతం మంది బహుభార్యత్వం కలిగి ఉండేవారు. 1974 నాటికి దాదాపు 5 శాతానికి, 2010 నాటికి ఒక్క శాతం కంటే దిగువకు తగ్గిపోయింది. ఈ విషయంలో హిందువులు, ముస్లింల మధ్య పెద్ద తేడా లేదు. అయినా ఏకరూప పౌరస్మృతి లేదు కాబట్టి వాళ్లు ఎక్కువ మంది భార్యలను కలిగి ఉంటున్నారు కాబట్టి వాళ్ళ జనాభా పెరిగిపోతోంది అని వాదిస్తున్నారు. ఇది అర్థం పర్థం లేని వాదన. బిడ్డకు జన్మనిచ్చేది తల్లి. తల్లుల సంఖ్య బట్టి జనాభా పెరుగుదల ఉంటుంది కాని, భర్తల సంఖ్య ఎంత అనేదానితో నిమిత్తం ఏమిటి? నిజానికి ఎక్కువ బహుభార్యత్వం ఇప్పుడు గిరిజన ప్రాంతాల్లోనే ఉన్నది. అక్కడ యూసిసి చేస్తారా ? మినహాయిస్తారా? మినహాయింపులు ఇస్తూ ఉంటే ఇంక యూనిఫారమ్ సివిల్‌కోడ్ ఎమిటి?

పెట్టుబడిదారుల కోణం నుంచి చూసినప్పుడు హిందూ అవిభక్త కుటుంబం అనేదానికి మన ఇన్‌కంటాక్స్ చట్టాలలో చాలా మినహాయింపులు ఉన్నాయి. వేలకోట్ల రూపాయల పన్నులను ఈ హిందూ అవిభక్త కుటుంబం పేరు చెప్పి ఎగ్గొట్టేస్తున్నారు. పెద్దపెద్ద పెట్టుబడిదారులు, భూస్వాములు, బాగా డబ్బు ఉన్న వాళ్లంతా అదాయాలను హిందూ అవిభక్త కుటుంబం కింద చూపించి దాని కింద వచ్చే రాయితీలన్నిటినీ పోందుతున్నారు. హిందూ అవిభక్త కుటుంబానికి ఉన్న రాయితీలు యూసిసిలో ఉంచుతారా తీసేస్తారా చెప్పాలి. తీసేస్తాము అంటే హిందూ అవిభక్త కుటుంబాలుగా ఉన్న వాళ్ళందరూ వ్యతిరేకిస్తారు. ఉంచుతాము అంటే ముస్లింలకూ, ఇతరులందరికీ దీన్ని విస్తరించాల్సి వస్తుంది. దానికి సమాధానం వాళ్ళ దగ్గర లేదు. అలాగే గిరిజన ప్రాంతాలకు వీటిని వర్తింప చేస్తారా ? ఈ ప్రాంతాలకు సంబంధించి మూడు రకాలుగా ఉన్నాయి. కొందరు గిరిజన ప్రాంతాలకు వెలుపల ఉన్నారు. మరి కొందరు 5వ షెడ్యూల్‌లో ఉన్నారు,తక్కినవారు 6వ షెడ్యూల్‌లో ఉన్నారు, ఎవరికి ఎలా వర్తిస్తుంది. ఇలాంటి అనేకమైన ప్రశ్నలకి వాళు ్ళ సమాధానం చెప్పాలి.

(మిగతా 13వ పేజీలో)

**అనుభవాలు - గుణపాఠాలు**

# తెలంగాణలో ఇండ్లు, ఇండ్లస్థలాల పోరాటం



రచయిత సిపిఐ(ఎం) తెలంగాణా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

**ఎస్ వీరయ్య**

ఇండ్లు, ఇండ్లస్థలాల సమస్య మీద తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో బస్సుయాత్ర జరిగింది. పేదలకు ఇండ్ల సమస్య చాలా తీవ్రంగా ఉన్నది. వేగంగా జరుగుతున్న పట్టణీకరణతో సమస్య ముదిరింది. కనీస వేతనాలు కూడా లేని పేదలు ఇంటి కిరాయి కట్టుకునే పరిస్థితి లేదు. మరోవైపు కేంద్రప్రభుత్వం గత డిసెంబర్ 31 నాటికే ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద అందరికీ ఇంటి సౌకర్యం కల్పిస్తానన్న వాగ్దానం అమలుచేయనేలేదు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో సుమారు 30 లక్షల మందికి ఇండ్లు లేవని తేలింది. అందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం చేసింది. మొదటి విడతలో 5,60,000 ఇండ్లు రెండేండ్లలో నిర్మించి ఇస్తానన్నది. కానీ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న సమయానికి కూడా కేవలం 3 లక్షల ఇండ్లు నిర్మించగా కేటాయించింది 33 వేలు మాత్రమే. దరఖాస్తులు పెట్టుకున్న 13 లక్షల మంది పేదలు ఎదురుచూస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆస్తులను నగదీకరణ (మోనిటైజేషన్) పేరుతో బడాబాబుల పరం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నది. ప్రభుత్వ భూములు అమ్మకాలకు పెట్టి నిధులు సమకూర్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఇంకేమాత్రం ఆలస్యం చేసినా పేదలకు జానెడు జాగా మిగిలే అవకాశం లేదన్న ఆందోళన మొదలైంది. అందుకే గత 15 మాసాలుగా ప్రభుత్వ, మిగులు భూములు, వ్యవసాయం అడుగంటిన శిఖం భూములలో పేదలు గుడిసెలు వేసుకుని హక్కుల కోసం పోరాడుతున్నారు. ఈ పోరాటం 19 జిల్లాలకు విస్తరించింది. 64 పోరాట కేంద్రాలలో 50వేలకు పైగా కుటుంబాలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. అందుకే ప్రజా సంఘాల నాయకుల బస్సుయాత్రకు పేదలనుంచి మంచి స్పందన వచ్చింది. పోరాడుతున్న పేదలకు ధైర్యం నింపి అండగా ఉన్నామన్న విశ్వాసం కల్పించేందుకు, సంఘటితం చేసేందుకు ఈ యాత్ర జరిగింది.

రాష్ట్రంలో ఖాళీ స్థలాలు లేక కాదు. రకరకాల పేర్లతో సుమారు 6లక్షల ఎకరాల ఖాళీ స్థలాలు ఉన్నాయి. రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులు, కొంతమంది స్థానిక రాజకీయ నాయకులతో కుమ్మక్కై భూకబ్జాదారులు, రియలెస్టేట్ వ్యాపారులు వేలాది ఎకరాల భూమి అక్రమంగా కబ్జా చేస్తున్నారు. బహుళ అంతస్తుల భవనాలు, పెద్దపెద్ద వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆయా జిల్లాలలో ఒకవైపు సిపిఐ(ఎం) నాయకత్వం, మరోవైపు ప్రజా సంఘాల నాయకులు ఈ బండారం బయటపెడుతున్నారు. అయినా వీరిని పట్టించుకోని పోలీసు అధికారులు కొన్ని ప్రాంతాలలో గుడిసెలు వేసుకున్న పేదలపైన మాత్రం దాడులు చేస్తున్నారు. 530మంది మీద కేసులు పెట్టారు. 35 మంది మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసారు. వీరిలో అత్యధికులు బడుగు బలహీన వర్గాలవారు కావటం గమనార్హం. 212 మందిని తహశీల్దార్ దగ్గర బైండోవర్ చేసారు. మహిళలతో సహా 54 మందిని జైలుకు పంపారు. ఆదివాసీ యువకుడి మీద పీడీ చట్టం ప్రయోగించారు. పోలీసు దాడులలో 248 మంది గాయపడ్డారు.

యాత్ర బృందం గుడిసెల కేంద్రాలలోనే వారు పెట్టింది తింటూ, రాత్రులు అక్కడే బస చేసారు. ఇది గుడిసెవాసుల మీద, పార్టీ, ప్రజాసంఘాల శ్రేణుల మీద మంచి ప్రభావం చూపింది. రాష్ట్ర నాయకులు గుడిసెల కేంద్రాలలో బస చేయటం, వారితో పాటు తినటం, వారితో గడపటం వారెప్పుడూ ఊహించలేదు. అందుకే ఈ యాత్ర వారిని బాగా ఆకట్టుకున్నది. గుడిసెల కేంద్రాలలో ఉన్న పరిస్థితులు చూసిన తర్వాత బృందం నాయకులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కోరుతారని భావించినవారికి ఆశ్చర్యం కలిగించింది. విలువల పట్ల విశ్వాసం పెంచింది. గుడిసెల ప్రాంతంలో సమస్యలు, దృశ్యాలు అత్యంత సన్నిహితంగా పరిశీలించేందుకు యాత్ర బృందానికి ఇదోక మంచి అవకాశంగా ఉపయోగపడింది. గుడిసెల కేంద్రాలన్నీ పట్టణ శివారు ప్రాంతాలు కావడంతో చెట్లు చేమలు, చెత్తాచెదారం మధ్య గుడిసెలు వేసారు. కరెంటు, నీరు, రోడ్ల సౌకర్యాలు లేవు. అనేక కేంద్రాలలో తాచుపాములు, కొండచిలువలతో సహా గుడిసెల్లోకి వస్తున్నాయి. ఇక తేళ్ళకు లెక్కేలేదు. ఒకచోట గుడిసెల మధ్య జరుగుతున్న సభలోకే పాము వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా పేదలు అక్కడే నివసిస్తున్నారు. మరో ప్రత్యామ్నాయం లేకనే ఇందుకు సిద్ధపడుతున్నారు.

అన్ని పోరాట కేంద్రాల్లోనూ మహిళలే ముందుంటున్నారు. సమరశీలంగా తెగించి పోరాడుతున్నారు. మహిళ తలదాచుకునేందుకు గూడు కావాలి. బట్టలు మార్చుకోవడం, ఆడపిల్లల పెంపకం, బహిర్భూమి, స్నానం లాంటి సమస్యలు చాలా సున్నితమైనవి. మహిళల ఆత్మగౌరవానికి సంబంధించింది కూడా. పైగా వీరిలో ఉన్నత విద్యావంతులైన యువతులు గణనీయంగా ఉన్నారు. అందుకే పోలీసులు వేధించినా, లాఠీఛార్జీలు చేసినా, పోలీసు స్టేషన్లల్లో చిత్రహింసలు పెట్టినా, అర్ధరాత్రులు దాడి చేసి అవమానించినా వెనుకకు తగ్గడం లేదు. రెండు పోరాట కేంద్రాల పూర్తి బాధ్యత మహిళా కార్యకర్తలే తీసుకోవడం గమనార్హం. రాత్రీపగలూ ఈ కార్యకర్తలు గుడిసెవాసులతోనే ఉంటున్నారు. ప్రతి పోరాట కేంద్రంలో మహిళలు ఐద్వా కమిటీలుగా ఏర్పడుతున్నారు. కోరుట్ల భూపోరాట కేంద్రంలో

> ❝ ఒకవైపు పేదలు ఇంటి సౌకర్యాన్ని జీవన్మరణ సమస్యగా పరిగణిస్తున్నారు. మరోవైపు భూకబ్జాకోరులు, అధికారులు వింత వాదనలు చేస్తున్నారు. విలువైన భూములు పేదలకు ఎందుకివ్వాలి అంటున్నారు. బడాబాబులు కబ్జా పెడితే మాత్రం మాట్లాడరు. ఇల్లు లేకపోతే కొనుక్కోవాలి గాని, ప్రభుత్వ భూమిని ఆక్రమించడం చట్ట విరుద్ధం కాదా అంటున్నారు. కొందరు రియల్ ఎస్టేట్ గద్దలు, రాజకీయ నాయకులు కబ్జా చేసినప్పుడు చట్టం వీరికి గుర్తుకు రాదు. ❞

సగం మంది ముస్లిం మహిళలు ఉండడం ప్రత్యేకత. పోలీసులు గుడిసెలు పీకేసిన సందర్భంగా మహిళలంతా ఆ భూమి మీదనే రాత్రులు కూడా నిద్రించారు. కొంత మంది వీరి మధ్య చిచ్చుపెట్టేందుకు ముస్లిం మత గురువులను రెచ్చగొట్టారు. ముస్లిం మహిళలు భర్తకు దూరంగా బహిరంగ ప్రదేశంలో నిద్రించడం ఖురాన్ ఆదేశాలకు విరుద్ధమని చర్చకు పెట్టారు. ఆ ముస్లిం మహిళలే దీనికి సమాధానం చెప్పారు. అక్కడ గుడిసెలు వేసేందుకు అనుమతిస్తే ఖురాన్ ఆదేశాలకు అనుగుణంగా గుడిసెల్లోనే ఉంటాం కదా అన్నారు. అంతేకాదు, అక్కడ భూపోరాట కమిటీలో ముస్లిం మహిళ కూడా ఉన్నారు. ఇవన్నీ మహిళకు తడికెచాటు ప్రాధాన్యతను చాటిచెబుతున్నాయి. అందుకే ఈ ఉద్యమంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు.

మంచినీరు, కరెంట్, రోడ్లు వంటి సౌకర్యాలు లేవు. అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. అయినా వీరంతా శ్రామికులే కదా, స్వయంగా వారే బావులు త్రవ్వుకుంటున్నారు. ఒక కేంద్రంలో ఒక పెద్ద కాలువ దాటడానికి కట్టెలతో వంతెన కూడా నిర్మించుకున్నారు. గాలికి, వర్షానికి ఇబ్బంది రాని పద్ధతుల్లో గుడిసెలు నిర్మిస్తున్నారు. ఈ విషయంలో స్వానుభవమే వారికి దిక్సూచి. ఒక కేంద్రంలో మహిళల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు, స్నానాల గదులు నిర్మించారు. స్థానిక అధికారుల మీద ఒత్తిడి తెచ్చి కరెంటు సౌకర్యం పొందినవారు కొందరైతే, ఒక కేంద్రంలో విరాళాలతో సౌర విద్యుత్ సౌకర్యం పొందారు. అనేక కేంద్రాల్లో కరెంటు స్తంభాల నుండి స్వయంగా వారే ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని కేంద్రాల్లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు, సంఘ సంస్కర్తల పేరుతో విజ్ఞానకేంద్రాలు నిర్మించుకున్నారు. ఒక కేంద్రంలో వైద్యసౌకర్యం, పిల్లలకు రెండుపూటలా ట్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేసారు.

ఒకవైపు పేదలు ఇంటి సౌకర్యాన్ని జీవన్మరణ సమస్యగా పరిగణిస్తున్నారు. మరోవైపు భూకబ్జాకోరులు, అధికారులు వింత వాదనలు చేస్తున్నారు. విలువైన భూములు పేదలకు ఎందుకివ్వాలి అంటున్నారు. బడాబాబులు కబ్జా పెడితే మాత్రం మాట్లాడరు. వీరి దృష్టిలో భూమికి విలువ ఉన్నది కానీ, పేద, బడుగు, బలహీనవర్గాల మనుషులకు విలువ లేదు. ఇల్లు లేకపోతే కొనుక్కోవాలి గాని, ప్రభుత్వ భూమిని ఆక్రమించడం చట్ట విరుద్ధం కాదా అంటున్నారు. కొందరు రియల్ ఎస్టేట్ గద్దలు, రాజకీయ నాయకులు కబ్జాచేసినప్పుడు చట్టం వీరికి గుర్తుకు రాదు. పైగా అసంఘటిత కార్మికులకు, వ్యవసాయ కూలీలకు రోజుకు పన్నెండు గంటలు పనిచేసినా కనీస వేతనాలు ఎక్కడా అమలు కావడం లేదు. మోడీ ప్రభుత్వం క్షేత్రస్థాయి కనీసవేతనం రోజుకు రు.178/- గా నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పేదలు జీవితకాలం కష్టపడ్డా పొట్ట నింపుకోవడమే కష్టం. ఇంటి సౌకర్యం అసాధ్యం. అందుకే పేదలకు ఇంటి సౌకర్యం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అంతేకాదు, రాజ్యాంగం జీవించే హక్కు ఇచ్చింది. గౌరవ ప్రదమైన ఇంటి సౌకర్యం జీవించే హక్కులో భాగమని ఢిల్లీ హైకోర్టు చెప్పింది. ప్రభుత్వం ఇంటి సౌకర్యం కల్పించడంలో విఫలమైనప్పుడు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకోవడమే తప్ప, ప్రత్యామ్నాయం లేదుకదా! ఇప్పటిదాకా నోరు మెదపని అధికారులు, పేదలు గుడిసెలు వేసుకున్న చోట అభివృద్ధి అవసరాలున్నాయని అడ్డుకుంటున్నారు. ప్రజలకు ఇంటి సౌకర్యం కూడా అభివృద్ధిలో భాగమేనన్న స్పృహ లేదు. ఇప్పటికే పట్టాలు పొంది నివసిస్తున్న పేదలను కూడా చెత్త డంపింగ్ యార్డ్ కోసం ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి పొమ్మంటున్నారు. చెత్తకు ఉన్న విలువ మనిషికి లేదు. ఇన్ని అడ్డంకులను అధిగమించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న చోట స్థానికులకే అవకాశం ఇవ్వాలనే పేరుతో గ్రామాల నుంచి వచ్చి పనులు చేసుకుంటున్నవారికి నిరాకరించాలని చిచ్చుపెడుతున్నారు. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో వలసలు అనివార్యం. వీరికి సౌకర్యాలు నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధం. పైగా పక్క జిల్లా నుంచి వచ్చి శాసన సభ్యులైనవారు, పక్క వార్డు నుంచి వచ్చి కౌన్సిలర్‌గా గెలిచినవారు, గ్రామాల నుంచి వచ్చి పట్టణంలో స్థిరపడి కౌన్సిలర్లు అయినవారు ఇలాంటి వాదనలు పెట్టడం చాలా ఆశ్చర్యం. ఈ తప్పుడు వాదనలన్నింటినీ పేదలు సమర్థవంతంగా తిప్పికొడుతున్నారు.

యాత్ర ప్రారంభం కాగానే పోలీసులు ఆటంకాలు సృష్టించారు. మహబూబాబాద్ పోరాట కేంద్రంలో పోలీసు దాడులకు గురైన వారిని పరామర్శించేందుకు పోరాట కేంద్రంవైపు పోతున్న యాత్ర బృందాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. బృందంలోని ఒక నాయకుడ్ని అరెస్టు చేశారు. బస్సును స్వాధీనం చేసుకున్నారు. మహిళలు తిరగబడిన తర్వాతనే యాత్రను ముందుకు సాగనిచ్చారు. ఒక కేంద్రంలో పోరాట కమిటీ నాయకుడి మీద స్థానిక కౌన్సిలర్లు భౌతికదాడి చేసారు. మరో కేంద్రంలో యాత్ర బృందం వచ్చిన సందర్భంగా బహిరగసభకు హాల్ ఇవ్వకుండా గ్రామాభివృద్ధి కమిటీల పేరుతో పెత్తందారులు అడ్డుకున్నారు. వర్షంలోనే సభ జరిగింది. పేదలంతా చెక్కుచెదరలేదు. ఇంకో కేంద్రంలో యాత్ర బృందానికి ఎలాంటి సౌకర్యం కల్పించినా వారిని కులం నుంచి బహిష్కరిస్తామని, గ్రామంలో, వారికి ఎలాంటి సౌకర్యాలు ఉండవని గ్రామాభివృద్ధి కమిటీ నాయకుల పేరుతో పెత్తందార్లు హెచ్చరికలు చేసారు. యాత్ర బృందం పోరాట కేంద్రంలోనే తిని, అక్కడే బస చేయడంతో వీరి ఎత్తుగడలు ఫలించలేదు (తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో గ్రామపంచాయతీలకు సమాంతరంగా గ్రామ పెత్తందారులు కుల సంఘాల నాయకులతో కలిపి కమిటీలు వేస్తున్నారు. దానికి గ్రామాభివృద్ధి కమిటీ అని పేరుపెట్టి అగ్రకుల పెత్తందారులే నాయకులుగా వ్యవహరిస్తున్నారు.) ఒక కేంద్రంలో హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నించారు. అదే కేంద్రంలో యాత్ర బృందం నాయకులకు స్వాగతం పలికిన హిందూ, ముస్లిం మహిళలు

బృంద సభ్యులకు ఒకవైపు బతుకమ్మలు అందించగా, మరోవైపు ముస్లిం సంప్రదాయ టోపీలు ఇచ్చి ఎర్రకండువాలు కప్పారు. ఈ దృశ్యం అందరినీ ఆకట్టుకున్నది.

ఇన్ని అవరోధాలను అధిగమిస్తూ పేదలు నిలదొక్కుకుంటున్నారు. ఇందుకు కారణం నాయకుల ముందస్తు పరిశీలన, ఏర్పాట్లు, కార్యకర్తల నిబద్ధత. భూమికి సంబంధించిన లోతుపాతులన్నీ నాయకులు ముందుగానే అధ్యయనం చేసి తగిన హోమ్‌వర్కుతో రంగంలోకి దిగిన చోట అధికారుల, భూకబ్జాకోరుల వాదనలు తేలిపోతున్నాయి. పేదలకు పట్టు దొరుకుతున్నది. దీనికి తోడు పోరాట కేంద్రాన్ని తగిన సామర్థ్యం ఉన్న కార్యకర్త 24 గంటలు అంటిపెట్టుకుని ఉన్నచోట గుడిసెలు నిలబడ్డాయి. ఇలాంటి తగు ఏర్పాట్లు లేకుండానే దిగిన చోట ఇబ్బందులు ఎదురయినాయి.

గుడిసెలు వేయడం ప్రారంభించినప్పుడే ప్రతి 25 మంది నుంచి 50మందికి ఒకరు చొప్పున గుడిసెవాసులే నాయకులుగా బాధ్యత తీసుకున్నారు. తమ పరిధిలోని వారిని క్రమశిక్షణగా నిలబెట్టే బాధ్యత వారిది. గుడిసెల కేంద్రాల్లో తాగి అల్లరి చేయకుండా, ఇతర అక్రమ వ్యవహారాలు నడవకుండా చూసే బాధ్యత వారిదే. వీరికి ప్రారంభంలోనే సంఘటితం కావడానికి అవసరమైన చైతన్యం కల్పించే తరగతులు నిర్వహించారు. పోరాట కేంద్రాల్లో మహిళలు ఐద్వాలో సభ్యులుగా చేరుతున్నారు. యువతీ యువకులు డివైఎఫ్ఐ సభ్యులుగా చేరుతున్నారు. వ్యవసాయ కూలీలు, పేద రైతులు సంఘంలో చేరుతున్నారు. ఆయా సంఘాలకు కమిటీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ పేదల్లో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఇంటి పనివారలు, ఇతర కాంట్రాక్ట్ తదితర రంగాల కార్మికులు గణనీయంగా ఉన్నారు. వీరందరూ తమతమ రంగాలకు యూనియన్లు ఏర్పాటు చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. పార్టీ సానుభూతిపరులుగా మారినవారితో ఆగ్జిలరీ గ్రూపులు ఏర్పాటుచేస్తున్నారు. స్థూలంగా బస్సుయాత్ర సకాలంలో చేపట్టిన సరైన కార్యక్రమం అని తేలింది. సుదీర్ఘకాలంగా సాగుతున్న గుడిసెవాసుల పోరాటం గానీ, వారికి భరోసానిచ్చిన బస్సుయాత్ర కానీ, ఎర్రజెండా మీద జరుగుతున్న రాజకీయ దాడికి చెంపపెట్టు. దుష్ప్రచారాలు చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులెవ్వరూ ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం గానీ, పేదల సమస్యల పరిష్కారం కోసంగానీ పోరాటాలు చేసిన దాఖలాలు లేవు. పరస్పర నిందలు, వ్యక్తిగత దూషణలు తప్ప ప్రజల సమస్యలు వీరికి పట్టవు. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్నది ఎర్రజెండానే కావడం గమనార్హం.

> ❝ గుడిసెలు వేయడం ప్రారంభించినప్పుడే ప్రతి 25 మంది నుంచి 50మందికి ఒకరు చొప్పున గుడిసెవాసులే నాయకులుగా బాధ్యత తీసుకున్నారు. తమ పరిధిలోని వారిని క్రమశిక్షణగా నిలబెట్టే బాధ్యత వారిది. వీరికి ప్రారంభంలోనే సంఘటితం కావడానికి అవసరమైన చైతన్యం కల్పించే తరగతులు నిర్వహించారు. పోరాట కేంద్రాల్లో మహిళలు ఐద్వాలో, యువత డివైఎఫ్ఐలో వ్యవసాయ కూలీలు, పేద రైతులు సంఘంలో సభ్యులుగా చేరుతున్నారు. సంఘాలకు కమిటీలు ఏర్పాటు చేసుకుంటున్నారు.❞

❊

# మతచిచ్చు రేపడానికే యుసిసి నాటకం

(10వ పేజీ తరువాయి)

అందువల్ల యూసిసి చర్చ వెనక ఉన్నది ఒకటే రాజకీయం. గత ఈ పదేళ్ళ కాలంలో ఏంచాశామో చెప్పుకోడానికి బిజెపి దగ్గర ఏమి లేదు కాబట్టి ఈ ఎన్నికల్లో ఆ విషయాలు చర్చకు రాకుండా ఉండాలంటే యుసిసిని ముందుకు తీసుకువచ్చి రచ్చ చేయ్యాలి, హిందువుల, ముస్లింలు మధ్య ఘర్షణగా దాన్ని మార్చాలి. ఈ రచ్చ చేయ్యడానికి బిజెపికి 21వ లా కమిషన్ సిఫార్సు అడ్డం కాబట్టి వాటిని తొక్కిపెట్టి మళ్ళీ 22వ లా కమిషన్ తీసుకువచ్చారు. వీళ్ళు కూడా ఇబ్బందికరమైన సిఫార్సులు చెయ్యకుండా వాళ్ళ టైం ఎన్నికలు అయిపోయేదాకా పొడిగించారు. అంటే సమస్యను పరిష్కరించడం కాదు. చిచ్చు రగిల్చి ఆ మంటలో చలి కాచుకోవడం వారి ఉద్దేశం.

**యు సి సి – ఒక లౌకిక సమస్య**

కుటుంబచట్టాలు ఉమ్మడి చట్టాలుగా తీసుకురావాలంటే సుప్రీం కోర్టు చెప్పినట్టు వాటిని లౌకిక స్వభావం ప్రాతిపదికగా తీసుకురావాలి. పెళ్ళికి–మతానికి, విడాకులకు–మతానికి, దత్తతకు–మతానికి సంబంధం లేదని ఒప్పుకోవాలి, ఇవన్ని ఒప్పుకోవడం అంటే సెక్యులరిజాన్ని ఒప్పుకోవడమన్న మాట. కానీ మోడీ ప్రభుత్వానికి లౌకికవాదం అంటేనే పడదు. లౌకిక స్వభావం లేకుండా యూసిసి అనేది సాధ్యమా? లౌకిక దృక్పథం లేకుండా యూసిసిని తీసుకురాలేరు. మోడీ, బిజెపి – ఆర్ఎస్ఎస్ పరివారం లౌకిక విధానాన్ని వ్యతిరేకిస్తారు. మన దేశం అంతా ఆధ్యాత్మికం అంటారు. అధ్యాత్మికం అనగానే మతం వస్తుంది. మతం అనగానే మత స్వేచ్ఛ వస్తుంది. ఎన్ని మతాలు ఉన్నాయో అన్నింటికీ స్వేచ్ఛ వస్తుంది. రాజ్యాంగం 25వ అధికరణం, 26వ అధికరణం ప్రకారం మత స్వేచ్ఛ ఇచ్చింది. కాబట్టి అందరికి మత స్వేచ్ఛ ఉంటుంది. దానివల్ల ఎవరికి నచ్చిన వ్యక్తిగత చట్టాలు వాళ్ళు చేసుకుంటూ వెళతారు. కుటుంబ చట్టాలు వందల రకాలు వస్తాయి. అందువల్ల మతం నుంచి ఈ అంశాలన్నింటినీ విడగొట్టకుండా యూసిసిలో ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యలేరు.

యూసిసి కావాలంటే సెక్యూలరిజం ఉండాలని ఒప్పుకోవాలి. సెక్యూలరిజాన్ని ఒప్పుకుంటేనే యూసిసి గురించి మాట్లాడమని చెప్పాలి. సెక్యూలరిజం కాదు మాది హిందూత్వ వాదం అంటే మనువాదుల ఆధిపత్యం కోసం ఇదంతా చేస్తున్నారని అనుకోవాలి. అంటే స్త్రీకి స్వేచ్ఛ లేకుండా చేయడానికి చేసే ప్రయత్నం అనుకోవాలి. ఈ హిందూ అగ్రవర్ణ ఆలోచనల్ని దేశం అంతటి మీద పెత్తనంగా రుద్దాలని చూస్తున్నారనుకోవాలి. ఇది ఒక పెద్ద కుట్ర. ఇది కుదరదని మనం స్పష్టంగా చెప్పాలి. యూసిసి అనేది పూర్తిగా సెక్యూలరిజం, లౌకికవాదంతో ముడిపడి ఉన్న అంశం. ఈ రెండింటిని విడగొట్టి చూడాలనుకోవటం అసాధ్యం.

❊

# మత వ్యవస్థలలో పరిణామాలు

## క్రీ.పూ.200 నుండి క్రీ.శ.300 మధ్య

ఎం.వి.ఎస్.శర్మ



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

### బౌద్ధం

అశోకుడి కాలంలో విస్తరించిన బౌద్ధం ఆ తర్వాత క్రీ.శ.300 వరకు మన ఉపఖండంలో ప్రధాన మతంగా ఉండేదని మనకు లభిస్తున్న శాసనాలను బట్టి, చారిత్రిక కట్టడాల శిధిలాలను బట్టి రూఢిగా చెప్పవచ్చు. ఈ చారిత్రిక వాస్తవాన్ని సంఘపరివారం వక్రీకరిస్తోంది. ఈ వక్రీకరణ రెండు రకాలుగా ఉంది. మొదటిది: అనాదిగా భారతదేశంలో హిందూ మతమే ప్రధానమతం అని చెప్పడం. రెండోది: బౌద్ధం అంటే హిందూ మతంలో భాగమే అని చెప్పడం.

బుద్ధుడు నిరీశ్వరవాది. బ్రాహ్మణాధిపత్యాన్ని, యజ్ఞాలు ఇతర కర్మకాండలను తీవ్రంగా వ్యతిరేకించినవాడు. ఈ ఒక్క వాస్తవాన్ని బట్టి ఆరెస్సెస్ ప్రచారకులు చెప్పుకుంటున్నది పూర్తిగా తప్పు అని తేటతెల్లం ఔతోంది. అంతేగాక, క్రీ.పూ. 6వ శతాబ్దంలో పుట్టిన సిద్ధార్థుడు బుద్ధుడిగా మారి బౌద్ధాన్ని ప్రతిపాదించాక దాదాపు 800 నుండి 1000 సంవత్సరాలపాటు బౌద్ధం మన ఉపఖండంలో ప్రధాన మతంగా ఉంది అని చెప్పడానికి చారిత్రిక ఆధారాలు స్పష్టంగా ఉన్నాయి.

అయితే అశోకుడి అనంతర కాలంలో బౌద్ధం పలు మార్పులకు లోనైంది. బుద్ధుడు ప్రతిపాదించిన మౌలిక సూత్రాలతో సహా పలు విశ్వాసాలకు, సాంప్రదాయాలకు సంబంధించిన మార్పులు జరిగాయి. వాటిలో ముఖ్యమైనది బౌద్ధం తేరవాదం, మహాయానం అనే రెండు శాఖలుగా విడిపోవడం.

తేరవాదం బుద్ధుడి మూల ప్రతిపాదనలకే కట్టుబడివుండాలన్న అభిప్రాయాన్ని బలంగా ముందుకు తెచ్చింది. పాళీ భాషలో రాసిన 'మిళిందపన్హ' గ్రంథంలో నాగసేనుడు అనే బౌద్ధభిక్షువు మిళిందుడు (గ్రీక్ రాజు మియాండర్) అడిగిన ప్రశ్నలకు సూటిగా చెప్పిన సమాధానాలు తేరవాదుల వాదనలను స్పష్టంగా వివరిస్తాయి. ఆత్మ అనేది లేదు అని, పుట్టడం, మరణించడం, పునర్జన్మ (మళ్ళీ పుట్టడం) అనే ప్రక్రియలో ఫలానా వ్యక్తిది ఫలానా ఆత్మ అనే గుర్తింపు ఏదీ ఉండదని, మళ్ళీ మళ్ళీ పుట్టడం అనే జీవన చక్రం నుండి విముక్తి (దీనినే నిర్వాణం అని అన్నారు) పొందాలంటే ఈ జన్మలో చేసే కర్మలను బట్టి అది ఉంటుందని, ఎవరి దయతోనూ దానికి సంబంధం లేదని నాగసేనుడి సమాధానాలు వివరించాయి. అహింస, దయ అనే విలువలకు అత్యంత ప్రాముఖ్యతను తేరవాదం ఇచ్చింది. దమ్మపదం అనే గ్రంథం (రచయిత ఎవరో తెలియదు)లో బుద్ధుడు స్వయంగా చేసిన బోధనలను ఒక పద్ధతి ప్రకారం ఏర్పాటు చేసి ప్రాకృతంలో రాశారు. ఇది క్రీ.శ. మొదటి శతాబ్దం నాటిది. తర్వాత దానిని పాళీ భాషలో తిరిగి రాశారు. ఇప్పుడు అదే లభ్యమౌతోంది. ఆ తర్వాత దానినే ఉదనవర్గ అనే పేరుతో సంస్కృతంలో రాశారు.

క్రీ.శ. మొదటి శతాబ్దం నాటికే బౌద్ధంలో చీలికలు స్పష్టంగా చరిత్రలో నమోదయ్యాయి. మధురలో స్థాపించిన ప్రముఖమైన అశోక స్తంభం (నాలుగు సింహాల స్తూపం) మీద చెక్కిన సమాచారంలో 'సర్వాస్తివాదం', 'మహాసంఘి' అనే రెండు ముక్కలుగా బౌద్ధం చీలిపోయినట్టు ఉంది. సర్వాస్తివాదం బుద్ధుడు ఒక మనిషిగా పుట్టి ఈ నేలమీద తిరుగాడినట్టు నొక్కి చెప్పింది. దానికి భిన్నంగా మహాసంఘీయులు బుద్ధుడిని సంపూర్ణుడైన వ్యక్తిగా, దైవత్వం కలిగినవాడిగా వాదించారు. సర్వాస్తివాదం అనేది తేరవాదం అయింది. మహాసంఘీయులు మహాయాన బౌద్ధాన్ని ముందుకు తెచ్చారు. ఆ తర్వాత కాలంలో ఇంకా చీలికలు ఏర్పడ్డాయి. కాని అన్నీ ప్రధానంగా తేరవాదం గానో, మహాయానం గానో పరిగణించబడుతున్నాయి. బుద్ధుడు ఒక చారిత్రక వ్యక్తి అని అంగీకరించినవారు తేరవాదులు. బుద్ధుడికి దైవత్వాన్ని ఆపాదించినవారు మహాయానవాదులు. మహాయానం అంటే మహా రథం అని అర్థం. బుద్ధుడికి దైవత్వాన్ని ఆపాదించినవారు తమ వాదానికి పెట్టుకున్న పేరు అది. తమతో విభేదించినవారి వాదాన్ని వీళ్ళు 'హీనయానం' అన్నారు. అంటే 'అల్పమైన రథం' అని అర్థం. తేరవాదాన్నే చాలామంది హీనయానం అని ప్రస్తావిస్తారు.

కనిష్కుడి కాలానికి చెందిన అశ్వఘోషుడు బుద్ధచరిత్ర, సౌందరానంద అనే గ్రంథాల రచయిత. మహాయాన బౌద్ధాన్ని విశేషంగా బలపరిచినవాడు. కల్పనమండిక అనే గ్రంథాన్ని రచించిన కుమారలత అశ్వఘోషుడి అనంతర కాలపు వ్యక్తి. ఈ కల్పనమండిక గ్రంథం మరో అడుగు ముందుకేసి బుద్ధ నామమే ముక్తికి మార్గం అన్నంతవరకూ పోయింది. బుద్ధుడు నిర్యాణం చెందే దశలో (అతడి మరణ సమయంలో) అతడిని బోధిసత్త్వుడు అని తేరవాదులు అన్నారు. అదే మహాయాన బౌద్ధంలో బోధిసత్త్వుడు అనేక సార్లు వివిధ జంతువుల రూపాలతోబాటు మానవ రూపంలో సైతం వివిధ జన్మలెత్తినట్టు, తనను తాను విముక్తి చేసుకోవడమే గాక ఇతరులకు కూడా విముక్తి లేదా నిర్యాణం ప్రసాదించగలిగినట్టు చెప్పుకున్నారు. ఆ విధంగా బుద్ధుడికి దైవత్వం ఆపాదించారు. ఇది చివరికి బోధిసత్త్వుడిని దైవంగా ఆరాధించే స్థితికి చేరింది.

ఇందుకు అవసరమైన తాత్విక ప్రాతిపదికను కల్పించినవాడు నాగార్జునుడు. ఇతను శాతవాహనరాజు గౌతమీపుత్ర శాతకర్ణి కాలంవాడు అని చెప్తారు కాని క్రీ.శ.3వ శతాబ్దానికి చెందినవాడైవుండాలి. ఇతని రచనలు సంస్కృతంలో ఉన్నాయి. ఇతడు ప్రతిపాదించినదే శూన్యవాదం. మన కంటికి

కనిపించే ప్రపంచం, అందులో జరిగే పరిణామాలు అన్నీ అవాస్తవం అని నాగార్జునుడు చెప్పాడు. అయితే విముక్తికి సంబంధించిన జ్ఞానం తెలియని వారికి ఇది వాస్తవ ప్రపంచంగానే గోచరిస్తుందని అన్నాడు. బుద్ధుడు చెప్పిన దానికి ఇది భిన్నం. అయితే కొందరికి (విముక్తి జ్ఞానం లేనివారికి) ఇది వాస్తవ ప్రపంచం అని మరికొందరికి (విముక్తి జ్ఞానం పొందినవారికి) ఇది వాస్తవ ప్రపంచం కాదని చెప్పడం వలన నాగార్జునుడి వాదానికి మాధ్యమిక వాదం అన్న పేరు వచ్చింది. ఇక్కడ విముక్తి జ్ఞానం అంటే ఈ ప్రపంచం మిధ్య అని తెలుసుకోగలగడమే. బోధిసత్వుడి కృప పొందగలిగితే ఈ ప్రపంచం నుండి ముక్తి లభిస్తుంది. అంటే మళ్ళీ పునర్జన్మ ఉండదు. అదే నిర్యాణం. నిర్యాణం అంటే ఈ ప్రపంచం నుండి విముక్తి పొంది శూన్యం లోకి ప్రవేశించడం.

ఫాహియాన్, యువాన్‌చ్వాంగ్ తదితర చైనా దేశపు యాత్రికులు గ్రంథస్తం చేసినదానిని బట్టి దాదాపు 7వ శతాబ్దం వరకూ దేశంలోని అత్యధిక బౌద్ధ ఆరామాలు తేరవాదానికి కట్టుబడి వ్యవహరించినట్టు నిర్ధారించవచ్చు.

బౌద్ధాన్ని విస్తరింపజేయడంలో, ప్రచారం చేయడంలో బౌద్ధ ఆరామాలది ముఖ్యమైన పాత్ర. బౌద్ధ భిక్షువులుగా, భిక్షుణిలుగా మారిన పురుషులు, స్త్రీలు సంఘ ఆరామాల్లో జీవించేవారు. ఈ ఆరామాలకు వచ్చే దానాలు, గ్రాంట్లు రాను రాను పెరుగుతూ వచ్చాయి. అప్పుడు ఈ ఆరామాలు పెద్ద పెద్ద నిర్మాణాలతో అభివృద్ధి చెందాయి. బుద్ధుడి అవశేషాలకు గానీ, విగ్రహాలకు గానీ పూజలు జరిగే ప్రదేశాన్ని చైత్యం అని అంటారు. ఇందులో బుద్ధుడి అవశేషాలను ఉంచిన ప్రదేశం మీద ఎత్తైన, గుండ్రని నిర్మాణాన్ని నిర్మిస్తారు. దానినే స్తూపం అంటారు. ఈ స్తూపాలవద్దకు బౌద్ధ ధర్మాన్ని అనుసరించే వారంతా వచ్చి తమ విముక్తి కోసం వేడుకుంటారు. ఇక్కడే భిక్షువులు తక్కిన బౌద్ధులను కలుసుకుంటారు. ఈ బౌద్ధ విహారాలు ఎక్కువగా అందరూ ప్రయాణించే రహదారుల వెంబడి నిర్మించబడ్డాయి. పశ్చిమ కనుమల వద్ద కన్హేరి, జున్నార్ ప్రాంతాలలో దాదాపు 80 గుహలు బౌద్ధ విహారాలుగా మలచబడివున్నట్టు పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఆ ప్రాంతం అంతర్జాతీయ వాణిజ్యం సాగే రహదారికి సమీపాన ఉంది. వారణాసి, విదిశ పట్టణాల సమీపంలో ఉన్న సారనాథ్, సాంచీ స్తూపాలు ప్రసిద్ధి కెక్కాయి. వాటితోబాటు దక్కను ప్రాంతంలో నాగార్జున కొండ, అమరావతి కూడా ప్రసిద్ధిచెందిన బౌద్ధవిహారాలు కలిగివున్నాయి. ప్రతీ ప్రధాన స్తూపం సమీప ప్రదేశాలలో పలు చోట్ల ఆరామాలు ఉండేవి.

తేరవాద, మహాయాన బౌద్ధాలు రెండూ బుద్ధుడి ప్రతిమలను గాని, అతడి అవశేషాలను గాని పూజించడం అనే సాంప్రదాయాన్ని అనుమతించాయి. ఈ ఆరాధనా పద్ధతి బౌద్ధానికి సామాజిక పునాది వేగంగా పెరగడానికి దోహదం చేసిందని చెప్పవచ్చు.

> **“బౌద్ధం లాగే జైనం కూడా బ్రాహ్మణాధిపత్యాన్ని వ్యతిరేకించిన మతం. బౌద్ధం లాగే జైనం కూడా సన్యాసాన్ని ప్రోత్సహించింది. ఈ రెండింటిలోనూ పలు ఉమ్మడి లక్షణాలు ఉన్నాయి. క్రీపూ.3వ శతాబ్దంలో చంద్రగుప్త మౌర్యుడి పాలన చివరి రోజుల్లో వచ్చిన అతి పెద్ద కరువు ఫలితంగా పెద్ద సంఖ్యలో జైన సన్యాసులు దక్షిణాదికి వలసలు పోయారు. వీళ్ళు తమ ప్రాచీన సాంప్రదాయాన్ని అనుసరించి దిగంబరులు గానే కొనసాగారు.”**

### జైనం

బౌద్ధం లాగే జైనం కూడా బ్రాహ్మణాధిపత్యాన్ని వ్యతిరేకించిన మతం. బౌద్ధం లాగే జైనం కూడా సన్యాసాన్ని ప్రోత్సహించింది. ఈ రెండింటిలోనూ పలు ఉమ్మడి లక్షణాలు ఉన్నాయి. క్రీ.పూ. 3వ శతాబ్దంలో చంద్రగుప్త మౌర్యుడి పాలన చివరి రోజుల్లో వచ్చిన అతి పెద్ద కరువు ఫలితంగా పెద్ద సంఖ్యలో జైన సన్యాసులు దక్షిణాదికి వలసలు పోయారు. వీళ్ళు తమ ప్రాచీన సాంప్రదాయాన్ని అనుసరించి దిగంబరులు గానే కొనసాగారు. ఉత్తరాదిన దిగబడిపోయినవారు పాటలీపుత్రంలో జరిగిన ఒక పెద్ద కూటమిలో 12 భాగాలున్న ఒక సాంప్రదాయాన్ని రూపొందించుకున్నారు. అందులో భాగంగా జైన సన్యాసులు తెల్ల వస్త్రాలు ధరించాలని నిర్ణయించారు. ఆ విధంగా దక్షిణాదికి వలస వచ్చిన వారు దిగంబరులుగా. ఉత్తరాదిన ఉన్నవారు శ్వేతాంబరులుగా జైనం రెండు శాఖలుగా విడిపోయింది. నగ్నంగా సంచరించే ఆచారం దిగంబర జైనులలో చాలాకాలం కొనసాగింది. అశోకుడి స్తూపాలలో వీరిని నిగంతులు అని పేర్కొన్నారు. అంటే అన్ని బంధాలనూ తెంచుకున్నవారని, వంటిమీద దుస్తులు లేనివారని అర్థం. జైనుల సాంప్రదాయాలను భగవతి సూత్రాలు అన్న పేర పేర్కొన్నారు. అంగవిజ్జ అన్న ఇంకో గ్రంథం కూడా ఉంది. జైన సన్యాసులకు తక్కిన ప్రపంచంతో ఏవిధమైన సంబంధం ఉండాలో ఇది వివరిస్తుంది. క్రీ.పూ. ఒకటవ శతాబ్దానికి చెందిన ఖారవేలుడు అనే కళింగరాజు కాలంలో జైనులను బాగా ఆదరించినట్టు తెలుస్తోంది. తమిళ-బ్రాహ్మీ లిపిలో దక్షిణాదిన లభించిన రాతి శాసనాలను బట్టి దక్షిణాది రాజ్యాలలో జైన సన్యాసులను బాగా ఆదరించినట్టు తెలుస్తోంది. జైనులు మహావీరుడి విగ్రహాలను ఆరాధించారు. ఉత్తరాదిలో మథుర సమీపంలో కంకాళి-తిల అనే చోట పెద్ద జైన స్తూపం ఉంది. బౌద్ధుల మాదిరిగా జైనులు ఎక్కడా స్తూపాలను నిర్మించలేదు. అందుచేత మథురలో ఉన్న స్తూపం చాలా ప్రత్యేకమైనది. ఇక్కడ చాలా విలువైన ఆధారాలు లభించాయి. జైనమత స్థాపకులను తీర్థంకరులు అంటారు. వారిలో వర్ధమాన మహావీరుడు 24వ తీర్థంకరుడు. ఇతడు బుద్ధుడికి సమకాలీకుడు. అంటే జైనం బౌద్ధం కన్నా ముందే ప్రారంభం అయింది. అథర్వణవేదంలో కూడా జైన తీర్థంకరుల ప్రస్తావన ఉంది.

### అజీవికులు

అశోకుడి కాలంలో ఒక ప్రధానమైన మతంగా ఉన్న అజీవిక మతం తర్వాత దాదాపు కనుమరుగైపోయింది. క్రీ.పూ. 200-క్రీ.శ. 300 మధ్య కాలంలో లభించిన చారిత్రిక ఆధారాలలో ఎక్కడా వీరి ప్రస్తావన కనిపిం చదు. అజీవికులు కూడా బ్రాహ్మణ మతాన్ని కాదని వేరే పద్ధతిని అనుసరించిన వారే.

### బ్రాహ్మణమతం

మౌర్య పాలన అనంతర కాలంలో బ్రాహ్మణ మతంలో రెండు ప్రధానమైన ధోరణులు వ్యక్తం అయ్యాయి. మొదటిది: ప్రజలందరికీ వర్తించే సామాజిక ప్రవర్తనా నియమాలను తామే అందించగలమన్న ధోరణి. రెండవది: వైదిక క్రతువులు సమాజంలో కొద్దిమందికి మాత్రమే అవకాశం కల్పిస్తాయి.

> **"బౌద్ధం గాని, జైనం గాని నిర్దేశించిన నియమావళులు ప్రధానంగా ఆ మతాలకు చెందిన సన్యాసులకు, ప్రచారకులకు వర్తిస్తాయి. సామాన్య ప్రజానీకానికి అవి కేవలం ఒక నైతిక ప్రవర్తనా నియమావళిని మాత్రమే అందించాయి. ఈ శూన్యాన్ని బ్రాహ్మణ మతం పూర్తి చేసింది. ప్రజలందరికీ వర్తించే విధంగా మతారాధన, వ్యక్తిగత, పౌర, నేర నియమావళితో కూడిన ఒక మత వ్యవస్థను అది అందించింది. అందులో కుల కట్టుబాట్లు, సాంప్రదాయాలు కూడా ఇమిడివున్నాయి."**

అందుచేత అన్ని కులాలవారికీ వర్తించే దైవారాధన పద్ధతులను ప్రవేశపెట్టడం రెండవ ధోరణిగా వచ్చింది. ఈ రెండు ధోరణులూ చాలా ముఖ్యమైన ప్రభావాన్ని కాలక్రమంలో కలిగించగలిగాయి.

బౌద్ధం గాని, జైనం గాని నిర్దేశించిన నియమావళులు ప్రధానంగా ఆ మతాలకు చెందిన సన్యాసులకు, ప్రచారకులకు వర్తిస్తాయి. సామాన్య ప్రజానీకానికి అవి కేవలం ఒక నైతిక ప్రవర్తనా నియమావళిని మాత్రమే అందించాయి. ఈ శూన్యాన్ని బ్రాహ్మణ మతం పూర్తి చేసింది. ప్రజలందరికీ వర్తించే విధంగా మతారాధన, వ్యక్తిగత, పౌర, నేర నియమావళితో కూడిన ఒక మత వ్యవస్థను అది అందించింది. అందులో కుల కట్టుబాట్లు, సాంప్రదాయాలు కూడా ఇమిడివున్నాయి. అంతవరకు ఉనికిలో ఉన్న ధర్మసూత్రాలు కేవలం మత, యజ్ఞ క్రతువుల విధివిధానాలను నిర్దేశించడమే ప్రధానంగా రూపొందాయి. కానీ మనుధర్మశాస్త్రంతో మొదలై అనంతర కాలంలో వచ్చిన ధర్మశాస్త్రాలన్నీ సమాజ, వ్యక్తిగత జీవితపు అన్ని పార్శ్వాలనూ స్పృశించాయి. ఆ విధంగా రెండో శతాబ్దపు ప్రథమ భాగంలో రాయబడిన మనుధర్మశాస్త్రం పురోహితుల కర్మకాండల గురించే గాక, న్యాయసూత్రాలను కూడా రూపొందించింది. గత నెల వ్యాసంలో మనుధర్మశాస్త్రం శూద్రకులాలను, దళితులను అణగదొక్కడానికి కావలసిన నియమాలను ఏ విధంగా నిర్దేశించిందో వివరించాను.

మనుధర్మశాస్త్రం తర్వాత యాజ్ఞవల్క్య ధర్మశాస్త్రం రూపొందింది. ఇది క్రీ.శ. రెండో శతాబ్దపు చివరి భాగంలో గాని మూడో శతాబ్దంలో గాని వచ్చివుండాలి. ఆ తర్వాత నారద స్మృతి వంటివి ఇంకా చాలా వచ్చాయి కాని అన్నింటికన్నా మనుధర్మశాస్త్రమే ఎక్కువ ప్రభావం చూపగలిగింది. పెళ్ళి, వారసత్వం, రుణం, శిక్షలు వంటి విషయాల్లో బౌద్ధంగానీ, జైనం గానీ ఏమీ పేర్కొననందున అన్ని విశ్వాసాలవారూ బ్రాహ్మణమతపు ధర్మశాస్త్రం నియమాలనే అనుసరించారు. ఇది బ్రాహ్మణమతం పైచేయి సాధించడానికి దోహదం చేసింది. బౌద్ధం చాలా ఉచ్ఛ దశలో ఉన్న కాలంలో సైతం ప్రజలు, ప్రభువులు బ్రాహ్మణమతపు ధర్మశాస్త్రాన్నే సామాజిక జీవితంలో పాటించాల్సివచ్చింది.

భక్తి భావన బలంగా ముందుకు రావడం రెండో పరిణామం. అంతవరకూ ప్రధాన దేవతలుగా ఉండిన బ్రహ్మ, ఇంద్రుడు మొదలైన వైదిక దేవతల ప్రాధాన్యత బౌద్ధం తాకిడితో బలహీనపడింది. ఈ వైదిక దేవతలను ప్రసన్నం చేసుకోవాలంటే చాలా సంక్లిష్టంగా ఉండే యజ్ఞాలు తదితర వైదిక క్రతువులు నిర్వహించవలసివచ్చేది. అందరికీ వాటిని నిర్వహించడం సాధ్యం అయ్యే విషయం కాదు. దానికి తోడు బౌద్ధం, జైనం యజ్ఞాలను వ్యతిరేకించి చేసిన ప్రచారం ఆ వైదిక దేవతలను బలహీనులుగా సమాజం ముందు నిలబెట్టింది. అందరూ ఆరాధించగలిగే కొత్త దేవతలు బ్రాహ్మణ మతానికి అవసరం అయారు. ఆ విధంగా ప్రాధాన్యత సంతరించుకున్న దేవతలు విష్ణువు, శివుడు. ఈ శివుడు వేదాలలో ప్రస్తావించబడిన రుద్రుడే. ఈ ఇద్దరికీ సంపూర్ణంగా భక్తిపూర్వకంగా లోబడి వారిని ఆరాధించే విధానాలను పాటించిన వారికి ఆ దేవతల కరుణ లభిస్తుందన్న విశ్వాసాన్ని బ్రాహ్మణ మతం కలిగించింది. ఈ క్రమంలో బ్రాహ్మణమతం శైవమతం, వైష్ణవ మతంగా చీలిపోయింది.

ఇందులో విష్ణువు ప్రత్యేకత ఆయా కాలాల్లో వేరే వేరే అవతారాలు ధరించి భూమిమీద అవతరించడం. ఈ మాదిరి అవతారాలేవీ శివుడికి లేవు. విష్ణువు ఇప్పటికి 9 సార్లు అవతరించినట్టు పదోసారి అవతరించబోతున్నట్టు ప్రచారం చేసే పురాణాలు ఉన్నాయి. ఈ అవతారాల్లో ఏడవది రామావతారం, ఎనిమిదవది కృష్ణావతారం. అవతారాల వరసక్రమంలో రాముడి తర్వాతే కృష్ణుడు ఉన్నప్పటికీ కృష్ణుడిని ఆరాధించే ఆచారాలు ముందు వచ్చాయి. కృష్ణుడికి ఉన్న మరోపేరు వాసుదేవుడు. క్రీ.పూ.350 నాటికి చెందిన పాణిని తన గ్రంథంలో వాసుదేవుడు ఒక దైవంగా పేర్కొన్నాడు కానీ అందులో రాముడి ప్రస్తావన లేదు. మెగస్థనీస్ (క్రీ.పూ.300) తన గ్రంథంలో గ్రీక్ దేవత అయిన హిరాకిల్స్ గాథలతో పోల్చదగ్గ దేవత భారత ఉపఖండంలో ఆరాధించబడుతున్నట్టు రాశాడు. హిరాక్లిస్ కుమార్తె పాండైయా ముత్యాల సాగులో పేరుపొందిన రాజ్యానికి రాణిగా ఉన్నట్టు అక్కడ గాథలు ఉన్నాయి. అశోకుడి శాసనాలలో కూడా పాండైయా ప్రస్తావన, పాండ్య రాజ్య ప్రస్తావన ఉన్నాయి. పాండ్యుల రాజధాని మదురై. కృష్ణుడు జన్మించినది మధురలో. రెండు పేర్లూ దగ్గరగా ఉన్నాయి. కుంతి కృష్ణుడికి మేనత్త అవుతుంది. కుంతి సంతానం పాండవులు. కృష్ణుడు ఒక పశువుల కాపరిగా, సాధారణ మానవులు చేసే అల్లరి చిల్లరి పనులన్నీ చేసినవాడిగా వర్ణించబడుతూనే దైవానికుండే శక్తియుక్తులన్నీ ఉన్నవాడిగా మనకి కనపడతాడు. బౌద్ధ జాతక కథల్లో ఒకటైన ఘట జాతక కథలో కృష్ణుడి గాథ ఉంది. వాయవ్యప్రాంతంలో కొంత భూభాగాన్ని పాలించిన గ్రీకు రాజు అగాథోక్లిస్ (క్రీ.పూ.150) ముద్రించిన నాణేల్లో చక్రం ధరించిన కృష్ణుడి బొమ్మతో, నాగలి ధరించిన బలరాముడి బొమ్మతో ఉన్నవి లభించాయి. తక్షశిల నుండి విదిశ (మధ్యప్రదేశ్) కు వచ్చిన గ్రీకు రాయబారి అక్కడ ఒక ధ్వజస్తంభాన్ని స్థాపించాడు. (క్రీ.పూ. 2వ శతాబ్దం చివరి కాలంలో) దానిమీద దేవదేవుడు వాసుదేవుడు అని, తాను అతడికి భాగవతుడినని (భక్తుడినని) చెక్కించాడు. దాని సమీపంలో జరిపిన తవ్వకాలలో ఒక దేవాలయం వంటి నిర్మాణపు అవశేషాలు దొరికాయి. బహుశా బ్రాహ్మణమతపు తొలి దేవాలయాల్లో అది కూడా ఒకటి అయివుండాలి.

మహాభారతంలోకి కృష్ణుడి పాత్ర ప్రవేశించింది. అంటే పురోహితవర్గం కూడా కృష్ణుడి ఆరాధనను గుర్తించి కృష్ణుడు దేవుడుగా అంగీకరించిందని అనుకోవాలి. మహాభారతంలో వివిధ భాగాలు వేర్వేరు కాలాల్లో రాయబడినవి. దాని తుదిరూపం క్రీ.శ.రెండో శతాబ్దంలో వచ్చింది. దాని గురించి మరోసారి ముచ్చటిద్దాం. ప్రస్తుతం ఇక్కడ భగవద్గీత గురించి కొన్ని మాటలు చెప్పాలి.

గీతలో అర్జునుడి ప్రశ్నలకు కృష్ణుడు సమాధానాలు చెప్పినట్టు చూపించారు. హిందూ మతానికి చెందిన కొన్ని ప్రధానమైన భావాలు ఇందులో పొందుపరిచారు. వైదిక కర్మకాండలు ప్రధానమైనవని అంటూనే వాటికి పరిమితమైన ప్రాధాన్యత మాత్రమే ఉందని చెప్పించారు. ఎటువంటి ప్రతిఫలాన్నీ కోరకుండా కృష్ణుడికి దాసోహం అనడం అన్నింటికన్నా ప్రధానం అని గీత పేర్కొంది. బౌద్ధంలో ఉన్న పునర్జన్మ భావనను గీత స్వీకరించింది. అదే మాదిరిగా యోగశాస్త్రం (ఇది నిరీశ్వరవాదంగా మొదలైంది), సాంఖ్యం (ఇది ఒక బలమైన నిరీశ్వరవాదాన్ని ప్రతిపాదించింది) వంటి తాత్విక సిద్ధాంతాలను స్వీకరించింది. కర్మ సిద్ధాంతాన్ని కులవ్యవస్థ చట్రంలో సమర్థవంతంగా ఇమిడ్చి చెప్పింది.

కృష్ణుడి ఆరాధన తొలుత ఏ విధంగా ఒక స్థానిక సాంప్రదాయంగా మొదలైందో, రాముడి ఆరాధన కూడా ఆవిధంగానే మొదలైవుండాలి. బుద్ధుడి జాతక కథల్లో దాశరథ జాతక కథ ఒకటి. అందులో రాముడు వారణాసికి చెందినవాడు. అతడు వనవాసానికి వెళ్ళినది హిమాలయాలకు. దండకారణ్యానికి కాదు. వాల్మీకి రామాయణంలో రాముడు అరణ్యవాసం పూర్తి చేసుకుని తిరిగి రావడంతో కథ ముగుస్తుంది. అందుతో రాముడు ఒక మానవుడిగానే చిత్రించబడ్డాడు. ఆ తర్వాత రామాయణంలో చొప్పించిన ప్రక్షిప్తాలలో రాముడు విష్ణువు అవతారం అయిపోయాడు. క్రీ.శ. రెండవ శతాబ్దానికి వాల్మీకి రామాయణం తాలూకు తొలి రూపం ఉనికిలో ఉంది. అశ్వఘోషుడు ఈ విషయాన్ని తన రచనల్లో ధృవీకరించాడు. మహారాష్ట్ర లోని నానేఘాట్ కనుమ దగ్గర లభించిన శాతవాహనులకు చెందిన శాసనాల్లో (ఇవి క్రీ.శ.మొదటి శతాబ్దానికి చెందినవి) వైదిక దేవత అయిన ఇంద్రుడికి, సంకర్షణ–వాసుదేవులకి (బలరాముడికి, కృష్ణుడికి) తమ ప్రార్థనలు విన్నవించుకున్నారు. అందులో రాముడి ప్రస్తావన లేదు. అదే ఆ తర్వాత గౌతమీపుత్ర శాతకర్ణి (ఒక శతాబ్దం తర్వాత) ఒక శాసనం లో తనకు రాముడితో, కృష్ణుడితో, అర్జునుడితో సమానమైన శక్తి ఉన్నట్టు చెప్పుకున్నాడు.

“కృష్ణుడి ఆరాధన తొలుత ఏ విధంగా ఒక స్థానిక సాంప్రదాయంగా మొదలైందో, రాముడి ఆరాధన కూడా ఆవిధంగానే మొదలైవుండాలి. బుద్ధుడి జాతక కథల్లో దాశరథ జాతక కథ ఒకటి. అందులో రాముడు వారణాసికి చెందినవాడు. అతడు వనవాసానికి వెళ్ళినది హిమాలయాలకు. దండకారణ్యానికి కాదు. వాల్మీకి రామాయణంలో రాముడు అరణ్యవాసం పూర్తి చేసుకుని తిరిగి రావడంతో కథ ముగుస్తుంది. అందుతో రాముడు ఒక మానవుడిగానే చిత్రించబడ్డాడు.”

**కాల పట్టిక**

| | | |
|---|---|---|
| బౌద్ధజాతక కథలు (స్థూపాలపై లభించినవి, బర్హుత్ వద్ద) | క్రీ.పూ. | 150 |
| మథురలో లభించిన కృష్ణుడి ముద్ర ఉన్న నాణేలు | | 100 |
| ఖారవేలుడు (జైనమతాన్ని ఆదరించిన కళింగరాజు) | | 50 |
| శివుడి ముద్రతో ఉన్న నాణేలు (కుషాను చక్రవర్తులు ముద్రించినవి) | క్రీ.శ. | 140 |
| మనుస్మృతి రచన | | 150 |
| కనిష్కుడు రాజు అయిన కాలం | | 160 |
| అశ్వఘోషుడు (బుద్ధచరిత్ర రచయిత) | | 175 |
| యాజ్ఞవల్క్య స్మృతి | | 200 |
| నాగార్జునుడి కాలం | | 250 |
| మహాభారతం తుదిరూపం పొందినది | | 300 |

విష్ణువుతో పోల్చితే శివుడి ప్రస్తావన ముందునుంచీ ఉంది. రుద్రుడు అని శివుడిని ప్రస్తావించారు. శుక్ల యజుర్వేదంలో రుద్రుడికి సంబంధించి ప్రత్యేకమైన ప్రార్థనలు ఉన్నాయి. క్రీ.పూ. రెండవ శతాబ్దానికి చెందిన పతంజలి శివభాగవతుల గురించి (శివభక్తుల గురించి) పేర్కొన్నాడు. వారు ఇనుప శూలాలను ధరించివుంటారని తెలిపాడు. కుషానుల దేవతాగృహాలలో శివుడు ఎద్దుమీద కూచుని ఉన్న విగ్రహాలు, శివ పార్వతుల విగ్రహాలు ఉండేవి. తన భక్తుల దృష్టిలో శివుడే సర్వశక్తి సంపన్నుడు. తనే సృష్టికర్త, తానే విధ్వంసకుడు. లింగం శివుడికి ప్రతిరూపం అయింది. క్రీ.పూ. మొదటి శతాబ్దపు ఉజ్జయిని నాణేలమీద ఒకవైపు ఎద్దుమీద ఉన్న శివుడి బొమ్మ, రెండోవైపు శివలింగం బొమ్మ ముద్రించబడివున్నాయి. శివుడితోబాటు దుర్గను కూడా ఆరాధించారు. మహాభారతంలో, రామాయణంలో శివుడిని ఆరాధించిన ప్రస్తావనలు ఉన్నాయి. మహాభారతంలో దుర్గాస్తోత్రం ఉంది. అయితే శక్తి పూజ అనేది ఒక ప్రత్యేక ఆరాధనా విధానంగా అప్పటికి లేదు. ఆ తర్వాత కాలంలో తలెత్తి వుండాలి.

నాగార్జున కొండ ప్రాంతంలో జరిపిన తవ్వకాలలో ఇరవైకి పైగా శివాలయాలు బైటపడ్డాయి. ఇవి క్రీ.శ. 3,4 శతాబ్దాలనాటివి. వీటిలో ఒకటి వైష్ణవాలయం. వీటిలో కార్తికేయుడు, గణేశుడు కూడా దేవతలుగా ఉన్నారు.

భక్తి సాంప్రదాయం బ్రాహ్మణ మతాన్ని పురోహితులకే పరిమితమైన మతం స్థాయి నుండి ప్రజల్లో పలుకుబడి కల మతంగా మారడానికి దోహదం చేసింది. అయితే అదే సమయంలో పురోహిత వర్గం తన ఆధిపత్యాన్ని కోల్పోలేదు.

(సశేషం)


## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

విదేశాంగం

# అమెరికా సంస్థల లాభాల కోసమే సైనిక ఒప్పందాలు



అమెరికా పర్యటనలో ప్రధాని మోడీతోబాటు
అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఆయన సతీమణి

రఘు

రక్షణ పరికరాల సరఫరా కోసం ఈ మధ్య భారత్, అమెరికా మధ్య రెండు ఒప్పందాలు జరిగాయి. ఇటీవలి అమెరికా పర్యటనలో ప్రధానమంత్రి వీటిపై సంతకాలు చేశారు. ముప్పై ఒక్క రీపర్ ఎమ్ క్యు – 9బి అనే మానవ రహిత సాయుధ డ్రోన్‌లను మనదేశ నౌకాదళానికి 15, సైన్యం, వైమానిక దళాలకి చెరో ఎనిమిది చొప్పున అమెరికా విక్రయించనుంది. భారతదేశం ఎంతో కాలంగా కావాలనుకుంటున్న ఈ డ్రోన్‌లు ఒక అధునాతన, అతి విలువైన సమాచారం సేకరించే గూఢచర్యానికి వీలు కల్పిస్తాయి. నిఘా, గూఢచర్యంలో శత్రు ప్రాంత పరిశీలనకు (ఐ ఎస్ ఆర్) మంచి సామర్థ్యాన్ని ఇవ్వటమే కాక అవసరమైనప్పుడు భూమి, సముద్ర – ఉపరితలం పైన లేదా సముద్రం కింద ఉన్న లక్ష్యాలను ఛేదించే సామర్థ్యాన్ని కూడా ఇస్తాయి. ఈ రీపర్ డ్రోన్ల యొక్క విడిభాగాలను భారతదేశంలోనే కూర్పు చేసి తయారు చేయడమే కాక, వీటిని ఇతర వినియోగదారులకు సరఫరా చేయటం కోసం ఇక్కడే ఒక అంతర్జాతీయ (మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్) నిర్వహణ, మరమ్మత్తు, తనిఖీ సదుపాయాలను ఏర్పాటు చేయడం వంటివి కూడా ఈ ఒప్పందంలో ఉన్నాయి. కనీసం 8 నుండి 10 శాతం విడిభాగాలను భారత్‌లోనే సమకూర్చుకోవాలని, దీనిని 15 నుండి 20 శాతానికి పెంచటం కోసం ప్రయత్నించాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

జనరల్ ఎలక్ట్రికల్ (జి ఇ) ఏరోస్పేస్‌కి, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ ఎ ఎల్) మధ్య జరగనున్న ఎంతో ముఖ్యమైన ఒప్పందానికి కూడా అమెరికా అంగీకరించింది. దీని ప్రకారం అధిక సామర్థ్యం గలదిగా నిరూపించబడిన ఎఫ్ –414 జెట్ ఇంజిన్‌ను భారతదేశంలో తయారుకాబోయే స్వదేశీ లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌కు (ఎల్ సి ఎ) తేజాస్ ఎమ్ కె 2 కి వాడతారు. దీనికి ముందున్న ఎఫ్ – 404 ఇంజిన్‌లు మునుపటి ఎల్ సి ఎ తేజాస్ వెర్షన్‌లు అయిన ఎమ్ కె 1 మరియు ఎమ్ కె 1ఎ లలో ఇప్పటికే ఉపయోగిస్తున్నారు. అధికారికంగా మిత్రదేశం కాని భారతదేశంలో అమెరికా మూలం ఉన్న ఒక ప్రధాన సైనిక వేదిక వీటిని తయారు చేయడం ఇదే మొదటిసారి. ఇది నిజంగానే యూ ఎస్ చేసిన అరుదైన ఏర్పాటు.

జెట్ ఇంజన్లలో జెట్ ఎయిర్‌క్రాఫ్ట్ (పౌర, మిలిటరీ ఏదైనా) సాంకేతికత అత్యంత సంక్లిష్టమైనదే కాక అధునాతనమైనది కూడా. దీనిని యూ.ఎస్, యూ.కె, ఫ్రాన్స్, రష్యా వంటి కొన్ని దేశాలు మాత్రమే అభివృద్ధి చేసి ఉపయోగిస్తున్నాయి. జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాలలో ఈ సాంకేతికతను కొన్ని ప్రత్యేక రంగాలలోనే వాడుతున్నారు. చైనా ఎంతో ప్రయాసతో ఈ లక్ష్యాన్ని చేరటానికి ప్రయత్నిస్తూ, దానికి చేరువ అవుతున్నట్లు తెలుస్తోంది. కానీ స్వీయ – ఆధారిత నమూనా – అభివృద్ధి సామర్థ్యాన్ని ఇంకా సాధించలేదు. ఈ జి ఇ ఎఫ్ – 414 ఒప్పందం ప్రధానంగా "సాంకేతిక బదిలీ" (టి ఒ టీ) ఒప్పందంగా భారతీయ మీడియాలో ప్రచారం చేస్తున్నారు, అంటే ఈ ఒప్పందం వల్ల భారతదేశం ఇటువంటి సాంకేతికత కలిగిన దేశాల జాబితాలోకి చేరుతుందని అర్థం. ఇది కేవలం లైసెన్స్ పొందిన ఉత్పత్తి కేంద్రం గానే ఉంటుందా లేదా నిజంగానే డిజైన్, డేటా, యాజమాన్య పరిజ్ఞానంలో హెచ్ఎఎల్‌కి భాగస్వామిగా ఉంటుందో చూడాల్సి ఉంది.

### డ్రోన్ల ఒప్పందం

ఈ 31 అత్యుత్తమమైన సాయుధ రీపర్లని రిమోట్‌లీ పైలట్ వెహికల్స్ (ఆర్ పి వి) లేదా డ్రోన్‌లు అంటారు. వీటిని జనరల్ ఆటమిక్ కంపెని తయారు చేసింది. విదేశాలకు సైనిక పరికరాలను అమ్మే చట్టం (ఎఫ్ ఎమ్ ఎస్) కింద 300 కోట్ల డాలర్ల విలువైన డ్రోన్లను భారతదేశానికి విక్రయించడానికి అమెరికా ప్రభుత్వం అంగీకరించింది.

రీపర్ (గార్డియన్ అని కూడా పిలుస్తారు) అనేది హై – ఆల్టిట్యూడ్ లాంగ్ – ఎండ్యూరెన్స్ (హెచ్ ఎ ఎల్ ఇ) డ్రోన్ లేదా మానవరహిత వైమానిక వాహనం (యూ ఏ వి). ఇవి 50,000 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో, దాదాపు 1800 కి.మీ పరిధి, 40 గంటలకు పైగా ప్రయాణించగల సామర్థ్యం కలిగి ఉన్నాయి. బయట నుండి నింపకలిగిన ఇంధనం ట్యాంకులతో, పూర్తిగా లోడ్ చేయబడిన ఆయుధాలతో ఎంచుకున్న లక్ష్యాలపై దాదాపు 24 గంటల పాటు తిరగగలవు. వీటివలన భారతీయ గగనతలంలో ఉంటూనే సైన్యం, వైమానిక దళాలు ఎల్ ఓ సి, ఎల్ ఏ సి లేదా తమ అంతర్జాతీయ భూ సరిహద్దుల మీదుగా అనేక వందల కిలోమీటర్ల దూరంలో జరిగే వాటిపై కచ్చితమైన సమాచారాన్ని సేకరించగల

సామర్థ్యం వస్తుంది. అలాగే భారతదేశం చుట్టూ ఉన్న సముద్రాలపై విస్తృతమైన నిఘాను ఉంచగలవు. దీనివల్ల భారతదేశానికి అమెరికా ద్వారానే సరఫరా చేయబడిన, సముద్ర నిఘా విమానం బోయింగ్ పి8ఐ పై అధికభారం పడకుండా ఉంటుంది.

ఈ కొత్త సాయుధ రకం డ్రోన్లు వివిధ రకాల ఆయుధాలు తీసుకెళ్ళటంతో పాటు విస్తృత శ్రేణి గల సెన్సార్లు, రాడార్, డేలైట్ టీవీ సిస్టమ్‌లతో కూడిన సెన్సార్ సూట్‌లు, ఇన్‌ఫ్రా-రెడ్ ఇమేజింగ్ మొదలైన వాటిని కలిగి ఉంటాయి. సీ గార్డియన్ అని పిలవబడే సముద్ర సంబంధ రీపర్ రకంలో సోనోబోయ్ మేనేజ్‌మెంట్ మరియు కంట్రోల్ సిస్టమ్స్ (ఎస్ ఎమ్ సి ఎస్), అలానే సోనోబోయ్ (అంటే ధ్వనితో లేదా సోనార్‌తో పనిచేసే నీటిమీద తేలే పరికరం) డిస్పెన్సర్ సిస్టమ్‌లు (ఎస్ డి ఎస్) ఉంటాయి. ఇవి చాలా కచ్చితంగా యుద్ధ సామగ్రిని ప్రయోగించగలిగి, చిన్న తరహాలో దాడులు చేయగలిగే డ్రోన్‌లు.

భారతదేశం కోరుకునే అసలైన ఆయుధ వ్యవస్థలేమిటో ఇంకా బయటకి చెప్పలేదు. ఇప్పుడు రాబోయే ఇండియన్ రీపర్స్‌కు ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ మరియు యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్‌లను ముందు నిలబడేలా రక్షణ కవచాలు కలిగిన ఉన్నాయో లేదో కూడా తెలియదు. ఈ రీపర్‌లను విడదీసి, ఒక పెద్ద రవాణా విమానంలో సులభంగా అండమాన్‌కో, మరొకచోటికో రవాణా చేసి, ఇవి పని చేసే పరిధిని మరింత విస్తరించవచ్చు.

భారతదేశం చాలా కాలంగా విభిన్న సామర్థ్యాలతో కూడిన మానవరహిత వైమానిక వాహనాల (యూ ఏ విలు) పట్ల ఆసక్తి చూపిస్తోంది. అయితే మన దగ్గర ఎప్పుడూ జరిగేటట్లే, వెంటనే కొని తెచ్చుకుని, అవసరానికి వాడటానికీ, మరియు ఎక్కువ సమయం పట్టినా, తక్కువ ఖర్చుతో కూడుకున్న దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేయాలనే కోరికకు మధ్య ఈ సమస్య నలుగుతున్నది.

స్వదేశీ యూ ఏ వి లు రుస్తోమ్, తపస్ బి హెచ్ -201 లు (ఆకాశంలో వైమానిక నిఘా కోసం వ్యూహాత్మక అధునాతన ప్లాట్‌ఫారమ్) దాదాపు 35,000 అడుగుల ఎత్తులో ఎగిరే మిడిల్ అల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (ఎమ్ ఏ ఎల్ ఇ) డ్రోన్‌లను మనం అభివృద్ధి చేస్తున్నాం. ఇవి ఇంకా అభివృద్ధి దశలో ఉన్నాయి. ఒక జెట్ ఇంజిన్‌తో పని చేసే కొన్ని ఇ యూ ఏ వి లను తయారు చేయడం కోసం హెచ్‌ఏ ఎల్ కు ఇంకా సమయం పడుతుంది. ఇంతలోనే కమికాజె డ్రోన్‌లు, ఎమ్ ఏ ఎల్ ఇ హెరాన్ యూ ఏ వి లను భారతదేశం ఇజ్రాయల్ నుండి కొనుగోలు చేసింది. అయితే వీటిలో శాటిలైట్ కమ్యూనికేషన్ పరిమితులు ఉండటం, ఇంకా భారతదేశంలోనే హెరాన్ ఎమ్ కె 2ని ఆయుధీకరించే విధంగా ఒప్పందం చేసుకోవడంలోను సమస్యలు వచ్చాయి.

> ❝ఈ ఒప్పందంలో రెండు ప్రధాన ప్రతికూలతలు ఉన్నాయి. మొదటిది, భారతదేశం సాయుధ హెచ్ఏ ఎల్ ఇ రీపర్‌లను కొనుగోలు చేయడానికి 300 కోట్ల డాలర్లను వెచ్చించటంతో యూ ఏ విల యొక్క దేశీయ అభివృద్ధికి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం, సాయుధ బలగాల నుండి ఒక స్పష్టమైన వ్యూహాత్మక దృక్పథం కోసం డి ఆర్ డి ఓ ఒత్తిడి చేస్తే మంచిది.❞

సాయుధ డ్రోన్‌ల కోసం అమెరికాతో ఒకప్పుడు జరిగిన సుదీర్ఘ చర్చలు ఆ దేశం యొక్క నిబంధనలు, రాజకీయ అనుమానాల మధ్య ఇరుక్కుపోయాయి, అయితే గత దశాబ్దంలో అమెరికా వ్యూహంలో వచ్చిన మార్పుతో భారతదేశంతో తమకి లాంఛనమైన మిత్రత్వం లేకపోయినా తమతో కలిసి వ్యవహరించేలా దానికి ఒక ముఖ్యమైన పాత్ర కల్పించాలని అమెరికా అనుకుంటోంది.

2017లో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం నిరాయుధ సీ గార్డియన్ (రీపర్) డ్రోన్ ప్రతిపాదనను భారతదేశానికి పంపటం ఆశ్చర్యం కలిగించింది. మిత్రరాజ్యం కాని ఒక దేశానికి ఇటువంటి ప్రతిపాదన పంపటం ఇదే మొదటిసారి. భారతీయ నావికాదళం గత రెండేళ్ళుగా ఇటువంటి రెండు రీపర్‌లను లీజు క్రింద తీసుకుని ఉపయోగిస్తున్నది. అవి 10,000 గంటలకు పైగా నిఘా ఉంచినందుకు నావికాదళం సంతృప్తిగా ఉందని చెప్పారు. 2020లో భారతదేశం నాల్గవ భూ సంబంధ నిఘా కోసం బేసిక్ ఎక్స్ఛేంజ్ అండ్ కో-ఆపరేషన్ అగ్రిమెంట్ (బెకా) ఒప్పందం, సరిగ్గా చెప్పాలంటే అన్ని ఒప్పందాలకు మూలంగా పిలబడేటువంటి దానిమీద భారతదేశం సంతకం చేసింది. ఈ ఒప్పందం ప్రకారం అమెరికా మిత్రదేశాలకు కూడా సున్నితమైన సైనిక పరికరాలను సరఫరా చేస్తుంది. దీని వల్ల ఎట్టకేలకు అమెరికా భారత్‌కు సాయుధ డ్రోన్‌లను సరఫరా చేసే అంశాన్ని పరిశీలించేందుకు తలుపులు తెరుచుకున్నాయి.

అణు విద్యుత్ కేంద్రాలు లేదా మెగా ఫైటర్-జెట్ వంటి పెద్ద కాంట్రాక్టులు దక్కక పోయినా అమెరికా భారతదేశంతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలి అని పట్టుదల చూపటాన్ని భారతదేశంలోని కొంతమంది వ్యాఖ్యాతలు ప్రశంసిస్తున్నారు. ఇదే సమయంలో 2000 కోట్ల డాలర్ల విలువైన భారీ రవాణా సాధనాలయిన హెలికాప్టర్లు, సముద్ర, భూ నిఘా విమానాల విక్రయం గురించి అమెరికా చేసిన ప్రతిపాదన మంచి వ్యాపారమే!

ఈ ఒప్పందంలో రెండు ప్రధాన ప్రతికూలతలు ఉన్నాయి. మొదటిది, భారతదేశం సాయుధ హెచ్ఏ ఎల్ ఇ రీపర్‌లను కొనుగోలు చేయడానికి 300 కోట్ల డాలర్లను వెచ్చించటంతో యూ ఏ విల యొక్క దేశీయ అభివృద్ధికి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం, సాయుధ బలగాల నుండి ఒక స్పష్టమైన వ్యూహాత్మక దృక్పథం కోసం డి ఆర్ డి ఓ ఒత్తిడి చేస్తే మంచిది. తక్కువ ఖర్చుతో కూడిన ఎమ్ ఏ ఎల్ ఇ మరియు కమికాజె డ్రోన్‌ల అభివృద్ధికి తిరిగి ప్రాధాన్యత ఇవ్వడం గురించి కూడా డి ఆర్ డి ఓ తీవ్రంగా ఆలోచించవచ్చు. రెండవది, ఈ రీపర్‌లు భారతదేశాన్ని అమెరికా సైనిక వ్యవస్థలతో మరింతగా అనుసంధానం చేసి, వాటిపై ఆధారపడేలా చేస్తాయి. ముఖ్యంగా దృశ్యశ్రేణికి ఆవల ఉన్న డ్రోన్‌ల మార్గదర్శకానికి ఆవశ్యకమైన ఎన్‌క్రిప్టెడ్ శాటిలైట్ కమ్యూనికేషన్ సిస్టమ్‌లు అమెరికా సైనిక వ్యవస్థలతో అనుసంధానం చేయబడతాయి. దీనివల్ల ఈ రీపర్లు యూ ఎస్ సరఫరా చేసిన ఇతర అపాచీ అటాక్ హెలికాప్టర్‌లు, పి 8ఐ గూఢచారి విమానాలు మొదలైన వాటితో ఇంకా సులభంగా జోడింపబడటం, అమెరికా సైనిక వ్యవస్థలతో అనుసంధానమయ్యే సామర్థ్యాన్ని గురించి కొందరు వ్యాఖ్యాతలు నొక్కిచెబుతున్నారు. కాని దానితో భారతదేశ

> **"దీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న మరొక ఒప్పంద మేమిటంటే రాబోయే స్వదేశీ తేజాస్ ఎమ్ కె 2 యుద్ధ విమానం కోసం జి ఇ ఎఫ్-414 ఏరో-ఇంజిన్‌లను కొనుగోలు చేయటం, మన దేశంలోనే వాటిని ఉత్పత్తి చేయటము. 2024 లో రోల్-అవుట్ అయి, 2027లో ఫ్లైట్ టెస్టింగ్ అయ్యే షెడ్యూల్ వలన ఈ విమానం ఈ దశాబ్దం చివరిలో వినియోగంలోకి వస్తుందని భావిస్తున్నారు."**

వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి మరింత ఒత్తిడికి లోనవుతుంది.

**జి ఇ ఇంజిన్లు**

దీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న మరొక ఒప్పందమేమిటంటే రాబోయే స్వదేశీ తేజాస్ ఎమ్ కె 2 యుద్ధ విమానం కోసం జి ఇ ఎఫ్-414 ఏరో-ఇంజిన్‌లను కొనుగోలు చేయటం, మన దేశంలోనే వాటిని ఉత్పత్తి చేయటము. 2024 లో రోల్-అవుట్ అయి, 2027లో ఫ్లైట్ టెస్టింగ్ అయ్యే షెడ్యూల్ వలన ఈ విమానం ఈ దశాబ్దం చివరిలో వినియోగంలోకి వస్తుందని భావిస్తున్నారు.

జి ఇ ఎఫ్-414 అనేది ప్రస్తుతం వాడుతున్న ఇంజినే. అది ఏ విధంగానూ కొత్తది కాదు. ఇది దాని ముందున్న ఎఫ్-404 ప్లాట్‌ఫారమ్‌పైనే నిర్మించబడినా దీని డిజైన్, మెటీరియల్స్, తయారీలో వాడిన సాంకేతికత పరంగా చూస్తే అభివృద్ధి చేయబడినది. 84 కె ఎన్ (కిలో న్యూటన్‌లు) శక్తి గల ఎఫ్-404 ఇంజన్ స్వదేశీ ఎల్ సి ఎ తేజాస్ ఎమ్ కె 1 లో ఉంది. ఈ ఇంజన్‌తో 40 విమానాలు ఇప్పటికే సేవలో ఉన్నాయి. ఇంకా 2024 నుండి 2029 మధ్య సంవత్సరానికి 16 చొప్పున 83 ఎమ్ కె 1 A ఫైటర్‌లు ఈ ఇంజన్ లతో హెచ్ఏఎల్ ద్వారా డెలివరీ చేయనుంది. మొత్తంగా ఇవి వరుసగా 75 మరియు 99 ఎఫ్ - 404 ఇంజిన్‌లను కలిగి ఉంటాయి. వింతైన విషయమేమిటంటే 1970లలో భారతదేశం కొనుగోలు చేయాలనుకున్న స్వీడిష్ సాబ్ విగ్గెన్‌కు ఎఫ్-404 ఇంజిన్ ఉంది, కానీ అప్పుడు యుఎస్ అమెరికన్ ఇంజిన్‌ల సరఫరాను నిషేధించింది! ఎఫ్-404 నుండి ఎఫ్ - 414 మధ్య ఉన్న అన్ని 5600 ఇంజన్లు, 1600 ఎఫ్-414లతో సహా అన్నీ జి ఇ ద్వారా సరఫరా చేయబడి, ప్రస్తుతం వాడకంలో ఉన్నాయి. ఎఫ్ - 414 ఇంజన్లు అమెరికా యొక్క ఫ్రంట్‌లైన్ బోయింగ్ ఎఫ్/ఎ -18 యుద్ధ విమానాలకు కూడా



ఫ్రాన్స్ పర్యటనలో ఆ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో ప్రధాని నరేంద్ర మోడీ

ఉన్నాయి. ఎల్ సి ఎ ఎమ్ కె2 విమానం ఎల్ సి ఎ ఎమ్ కె 1, ఎమ్ కె 1 ఏ ల కంటే బరువు, పెద్దది కావటం వల్ల మరింత శక్తివంతమైన ఇంజిన్ అవసరం, అందువల్ల ఎఫ్-414 ఇంజిన్ ఉపయోగించడానికి ఎంపిక చేసారు. ఒకే రకమైన ఇంజిన్‌ల కుటుంబంలో భాగం కావడం వల్ల, రెండు ఇంజన్ల బయటి కొలతలు ఒకేలా ఉండటం వల్ల, 98 కె ఎన్ శక్తి గల ఎఫ్-414 ని ఎల్ సి ఎ ఎమ్ కె2లో ఉపయోగించడం సహజంగానే జరిగింది.

ఎల్ సి ఎ ఎమ్ కె 2 యొక్క ప్రోటోటైప్ అభివృద్ధి కోసం ఎనిమిది ఎఫ్-414 ఇంజిన్‌లను డిఆర్‌డిఓ హెచ్ ఎ ఎల్ కి జి ఇ ఇప్పటికే సరఫరా చేసింది. కచ్చితంగా ఇన్ని అని ఇంకా ఖరారు కానప్పటికీ, దాదాపు 120-130 దాకా ఎల్ సి ఎ ఎమ్ కె 2 విమానాలను ఐఏఎఫ్ ఆర్డర్ చేయవచ్చని అంచనా వేశారు, ఈ ఆర్డర్‌లో దాదాపు రెండువందల ఎఫ్-414 ఇంజన్లు సరఫరా ఉంటుంది.

తుది ఒప్పందంపై సంతకం చేసిన మూడేళ్ల తర్వాత ఎఫ్-414 ఇంజిన్ల యొక్క సరఫరా ప్రారంభమవుతుందని చెప్పారు. ఏది ఏమైనప్పటికీ, ఎల్ సి ఎ ఎమ్ కె2 యొక్క సేవలు రాబోయే దశాబ్దంలో అందుబాటులోకి వస్తాయని, ఇంకా హెచ్ ఎ ఎల్ కొత్త ఉత్పత్తి సౌకర్యాన్ని ఏర్పాటు చేయడానికి చాలా సంవత్సరాలు పడుతుందని తెలుస్తోంది. ఎఫ్-414 రాక ఈ దశాబ్దం చివరిలో మాత్రమే ఆశించాలనేది వాస్తవం.

2012లో దాదాపు 58 శాతం ''సాంకేతికత బదిలీ'' ఉంటుందని, మొదటిసారిగా ఎఫ్-414 ని ఎల్ సి ఎ ఎమ్ కె2 కోసం ఎంపిక చేశారు. అంటే ఇంజిన్ తయారీ ధరలో దాదాపు 58 శాతం స్థానిక భాగాలు, లేబర్, ఇతర సేవలను ఉపయోగిస్తారు. యుఎస్ సైనిక పరికరాల ఉత్పత్తిని తమ దేశం బయట చాలా అరుదుగా చేస్తుంది. కాబట్టి అటువంటి తయారీని ''సాంకేతిక బదిలీ''గా పరిగణిస్తుంది. మరోవైపు భారతదేశం అనేక దశాబ్దాలుగా సోవియట్/రష్యన్, ఫ్రెంచ్ మరియు బ్రిటీష్ విమానాలు, ఇంకా ఇంజిన్‌లను వాటి లైసెన్స్‌తో తయారు చేస్తోంది. అయితే దీనిని సాంకేతిక బదిలీగా పరిగణించలేమని తెలుసు. సాంకేతిక బదిలీ అంటే కేవలం తయారీ మాత్రమే కాకుండా డిజైన్-డెవలప్‌మెంట్ కూడా ఉంటుంది.

ప్రస్తుత ఒప్పందం ఉత్పత్తి వ్యయాలలో దేశీయ వాటాని 80 శాతానికి పెంచింది. ఇది చాలా ఎక్కువ. అయితే ఇక్కడ అంతకు ముందు లైసెన్స్ పొందిన బ్రిటీష్ లేదా ఫ్రెంచ్ విమానాల, ఇంజిన్ల ఉత్పత్తి యొక్క చరిత్రను పరిశీలిస్తే, ఆ ఇంజిన్‌లని పనిచేయించే అనేక క్లిష్టమైన భాగాలు, ఇంకా ఇతర సామగ్రి జి ఇ నుండే వచ్చేవి. అయినా హెచ్ ఎ ఎల్ ద్వారా ఈ ఇంజన్‌ను తయారు చేయడం వలన హెచ్ ఎ ఎల్ కి, ఇంకా దాని ప్రభుత్వ లేదా ప్రైవేట్ రంగ సబ్ - కాంట్రాక్టర్ల, సరఫరాదారుల సాంకేతిక సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది. అలానే వారికి కొత్త సామగ్రి, కొత్త తయారీ పద్ధతులు, యంత్రాలతో పరిచయం ఏర్పడుతుంది. ఈ సాంకేతికతను ఈ రంగం, మరియు ఇతర రంగాలలో భారతీయ సంస్థలు, పారిశ్రామిక

*(మిగతా 28వ పేజీలో)*

# మార్క్స్ దృష్టిలో పరాయికరణ



రచయిత డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు

**వై రాము**

మార్క్స్ తన మేధో ప్రస్థానాన్ని యంగ్ హెగెలియన్‌గా ప్రారంభించాడు. హెగెల్ తాత్వికతను పరిశీలించి ప్రశ్నించాడు. అనంతరం ఫ్యూయర్ బా మానవతావాదాన్ని నిశితంగా అధ్యయనం చేసాడు. ఈ క్రమంలోనే 1844 సంవత్సరంలో ఆర్థిక తాత్విక రాతప్రతులు (ఇ.పి.యం) రాసాడు. దీనికి గొప్ప ప్రత్యేకత ఉంది. ఇది రాసే నాటికి మార్క్స్ వయస్సు 26 సంవత్సరాలు మాత్రమే. ఆ వయస్సులోనే మానవ స్వభావం గురించి పరాయికరణ రూపంలో లోతైన విశ్లేషణ చేసాడు. ఇది పెట్టుబడిదారీ విధానాన్ని విశ్లేషించడానికి మార్క్స్ చేసిన తొలి ప్రయత్నంగా చెప్పొచ్చు.

1844లో ఆర్థిక రాతప్రతుల్లో (ఇ.పి.యం) స్వయం నుండి విడదీయడం అనే “ఎంట్ ఫ్రెమ్ డంగ్” సిద్ధాంతాన్ని వ్యక్త పరిచాడు. ఇది ఫ్యూయర్ బా రచించిన “ది ఎసెన్స్ ఆఫ్ క్రిస్టియానిటి” (1841) పై ఆధారపడి ఉంటుంది. ఇది మానవాతీత దేవుడు అనే ఆలోచన మానవుని సహజ లక్షణాలను దూరం చేసిందని పేర్కొంది. ఈ రాత ప్రతులను 1934లో రష్యాకు చెందిన మార్క్స్ ఏంగెల్స్ ప్రచురణ సంస్థలు ముద్రించాయి. అంటే మార్క్స్ మరణించిన 51 ఏళ్ల అనంతరం వెలుగులోకి వచ్చాయి. ఈ రాత ప్రతుల్లో మార్క్స్ ప్రస్తావించిన “పరాయికరణ” భావన విస్తృత చర్చకు దారితీసింది. “పరాయికరణ” సూత్రీకరణపై అనేక వాఖ్యానాలు, విమర్శలు తలెత్తాయి.

**పరాయికరణ అంటే ఏమిటి ?**

కారల్ మార్క్స్ రచనలు దాదాపు అన్ని శాస్త్రాలను ప్రభావితం చేసాయి. అందులో మానసిక శాస్త్రం కూడా ఒకటి. సైకాలజీలో పరాయికరణకి సంబంధించి చాలా అర్థాలున్నాయి. కాని వాటికి పరిమితులూ ఉన్నాయి. మార్క్స్ గురువు హెగెల్ భావనలో పరాయికరణ అంటే ‘‘ప్రకృతిలోనూ, సమాజంలోనూ మనిషి జీవ శక్తులను బాహ్యీకరించడమే”. అంటే వేరు పడటం గానూ, లేదా పొసగని సంబంధంగానూ వర్ణించాడు. మొత్తంగా పరాయికరణ ప్రక్రియను ఆత్మకు సంబంధించిన ప్రపంచ చారిత్రక అభివృద్ధిగా భావించాడు. హెగెల్ పరాయికరణ భావం భావవాదంగా ఉందని ఫ్యూయర్ బా తిరస్కరించాడు. 1841లో తాను రచించిన ‘‘క్రైస్తవ మత సారాంశం’’లో మానవుల పరాయికరణకు మతం కారణమన్నాడు. దైవ అస్తిత్వంగా భావించబడినది నిజానికి మానవ అస్తిత్వం నుండి పుట్టినది. తన జాతి అస్తిత్వ భావనకు మానవుడిచ్చిన రూపం అనేది ఫూయర్ బా తత్త్వంలోని కీలకాంశం. హెగెల్ పరాయికరణలో భావవాదాన్ని తిరస్కరించినా, ఫూయర్ బా ప్రతిపాదించిన దానిలో ప్రధాన లోపం సామాజిక, రాజకీయ, అంశాలను వదిలేయడంతో సమగ్రత చేకూరలేదు.

హెగెల్ విస్మృతంగా చర్చించిన పరాయికరణ భావనను మార్క్స్ నిజజీవితానికి వర్తింపచేసి అభివృద్ధి చేసాడు. హెగెల్ పరాయికరణ భావనను మతపరంగా అర్థం చేసుకున్న ఫ్యూయర్ బా అభిప్రాయాలను మార్క్స్ తిరస్కరించి ఆయన ప్రతిపాదించిన భౌతికవాద అంశాలనే అభివృద్ధి చేశాడు. పరాయికరణ భావన సామాజిక జీవితంలోని అత్యంత ముఖ్యమైన అంశాలను ప్రతిబింబిస్తుందని మార్క్స్ గుర్తించాడు. లౌకిక, తాత్విక, రాజకీయ పరాయికరణ అసలైన కారణభూతులైన ఆర్థిక పరాయికరణ గూర్చి మార్క్స్ వివరించాడు. దీన్నే శ్రమ – పరాయికరణ అంటాం.

“శ్రమ చేయడం అనేది మానవుని మౌళిక కార్యకలాపం కాబట్టి ఆర్థిక పరాయికరణ అనేది మౌలికమైనది. మానవుడు ప్రకృతిలో పాల్గొనే ఒక ప్రక్రియ శ్రమ. దీనిలో మనిషి తనకీ, ప్రకృతికీ మధ్య పాదార్థిక ప్రతి చర్యలకు తనంత తాను గానే ప్రారంభిస్తాడు, క్రమబద్ధం చేస్తాడు, అదుపు చేస్తాడు, అతడు ప్రకృతికున్న సొంత శక్తుల్లో ఒకడుగా దాన్ని ఎదుర్కొంటాడు. తన కోర్కెలకు అనుగుణంగా ప్రకృతి నుండి వచ్చే ఉత్పాదితాలను స్వాదీనం చేసుకొవడం కోసం తన సహజ శారీరక శక్తుల్ని చలనంలో పెడతాడు. అ రకంగా అతను ‘‘బాహ్య ప్రపంచం పైన పని చేస్తూ దానిని మారుస్తూ అదే సందర్భంలో తన స్వభావాన్ని మార్చుకుంటాడు’’. అంటే మనిషి తన స్వభావానికి అవసరమైన అంశాన్ని తన సొంత కార్యకలపాలపై అదుపు ఆజ్ఞాలు తానే కలిగి ఉంటాడు. తనే చారిత్రక ఆవిష్కర్తగా ఉండటం చేస్తాడు. కాని దీన్ని మరేవరికో కొల్పోవడమే పరాయికరణ.

కార్మికుడే సమస్త భౌతిక సంపదను సృష్టిస్తాడు అయితే అది తనది కాదు. అంతేకాక ఈ సంపదను అతని నుండి వేరుచేసి పెట్టుబడి రూపంలో అతన్ని శాసించే పరాయి శక్తిగా మారుతుంది. దీన్నే మార్క్స్ పరాయికరణ అన్నాడు. మార్క్స్ దృష్టిలో ఆర్థికపరమైన పరాయికరణే అతి ముఖ్యమైన పరాయికరణ రూపం. మిగిలినవి అన్ని దీన్ని అనుసరించే ఉంటాయి. మార్క్స్ 1844 సం॥లో రాసిన రాతప్రతుల్లో 4 రకాల పరాయికరణలను వివరించాడు. అవి,

1. శ్రమ ఉత్పత్తి నుండి పరాయికరణ
2. శ్రమ నుండి పరాయికరణ
3. జాతి స్వభావం నుండి పరాయికరణ
4. ఇతర మనుషుల నుండి పరాయికరణ

**శ్రమ ఉత్పత్తి నుండి పరాయికరణ :**

ఉత్పత్తి యొక్క రూపకల్పన అనేది అది దేని నిమిత్తం, ఏ అవసరం నిమిత్తం ఉత్పత్తి

> **"మనిషి తన జీవితం నుండి పరాయివాడు అయ్యాడంటే అర్థం ప్రతి మనిషి ఇతరులకు పరాయివాడు అయ్యాడని అర్థం. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ పోటీ సృష్టిస్తుంది. ఈ పోటీలో కార్మికులకు వ్యతిరేకంగా కార్మికుడినే నిలబెడుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో అనివార్యంగా వారి మధ్య ఉన్న సంబంధాలు పరాయివి, శత్రుపూరితం అవుతాయి. పెట్టుబడిదారుడి చేతుల్లో సంపద మరింత పోగుబడే కొద్దీ దాన్ని సృష్టించిన కార్మికుడి ఉనికి మరింత దిగజారుతుంది."**

చేయాలనేది దాన్ని తయారుచేసే కార్మికుడు గానీ, దాన్ని వినియోగించే వినియోగదారుడు గానీ నిర్ణయించడు. నిర్ణయించేది పెట్టుబడిదారుడు. లాభమే పరమావధిగా పెట్టుబడిదారుడి ఆకాంక్షల మేరకు అది రూపుదిద్దుకుంటుంది. పెట్టుబడిదారి సమాజంలో శ్రమ మనిషి అభివృద్ధికి దోహదపడే స్వేచ్ఛాయితమైనదిగా కాకుంగా గానుగెద్దు పనిలా మారిపోతుంది. శ్రామికుడి శ్రమశక్తిని సరుకుగా మార్చే క్రమంలో దాని విలువను మార్కెట్ నిర్ణయిస్తుంది. అందులో శ్రామికుడి ఇష్టాయిష్టాలు అవసరాలతో పని లేదు. మార్కెట్ మాయాజాలంలో శ్రమశక్తి బందీ అయిపోయింది. మిగిలిన సరుకుల స్వభావంగానే శ్రమశక్తి కూడా ఒడిదుడుకులు ఎదుర్కొంటుంది. అన్ని రోజులు పని దొరకటం కష్టమైపోతుంది. భూమి, ప్రకృతి వనరులు సొంత ఆస్తిగా ప్రైవేట్ వ్యక్తుల గుత్తాధిపత్యంలోకి వెళ్లిపోయాక ప్రకృతి నుండి శ్రామికుడు వేరు పడ్డాడు. తాను ఉత్పత్తి ఎంత పెంచినా దాని లాభంతో తనకేమి కొత్తగా ఉపయోగం ఉండదు. పై పెచ్చు అదికోత్పత్తి జరిగి డిమాండ్-సప్లై అనుగుణంగా లేకపోతే ఉన్న పని కూడా పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఉత్పత్తి ఎంత నాణ్యతగా ఉన్నా ఎంత ఆకర్షణీయంగా ఉన్నా అది తయారుచేసిన శ్రామికుడిది కాదు, పరాయిది. ఈ క్రమంలోనే శ్రామికుడు మొత్తం ఉత్పత్తి ప్రక్రియ నుండే వేరుపడిపోతాడు.

**శ్రమ నుండి పరాయికరణ :**

పెట్టుబడిదారి వ్యవస్థలో శ్రామికుడు తయారు చేసిన వస్తువు తనది కాదు. దానితో సంబంధమే ఉండదు. అది అతనికి బయటిది, పరాయిది. దాన్ని తన అవసరాల కోసం తయారు చేయలేదు. కూలి కోసం, యజమాని కోసం, మార్కెట్‌లో అమ్మకం కోసం తయారు చేశాడు. అతని అవసరాలకి, అతను తయారు చేసిన వస్తువులకి ప్రత్యక్ష సంబంధం లేదు.



కారల్ మార్క్స్

ఆ వస్తువు గిరాకి, ధర, మారుతున్న టెక్నాలజీ. ఫ్యాషన్లు మొదలైనవి శ్రామికుడి జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. అందుచేత అతను చేసిన వస్తువు అతనికే శత్రువుగా నిలుస్తుంది. అతనికి అతని శ్రమ ఉత్పాదదితంలోని చాలా స్వల్ప భాగం వేతనంగా అందుతుంది. శ్రామికుడు తన్ను తాను వినిమయం చేస్తూ సృష్టించిన వస్తు ప్రపంచం అతనికి వ్యతిరేకంగా నిలుస్తుంది.

**జాతి స్వభావం నుండి పరాయికరణ**

పెట్టుబడిదారీ వ్యవస్థ శ్రామికులను జాతి అనే స్వభావం నుండి కూడా పరాయికరిస్తుంది. జాతి పరాయికరణ ద్వారా మనిషి తన అస్తిత్వాన్ని కోల్పోతాడు. ఈ క్రమంలో మార్క్స్ మనుషులకు, జంతువులకు మధ్య తేడాలు వివరిస్తాడు. జంతువులు ప్రకృతితో అనేక సంబంధాలు కలిగి ఉంటాయి. మానవుడు తన సంతానం, పోషణ విషయంలోనే కాకుండా భవిష్యత్ కోసం, ఇతరుల కోసం కూడా ఉత్పత్తి చేస్తాడు. భౌతిక అవసరాలే కాకుండా సంస్కృతి, నాగరికత విషయంలో అభివృద్ధి చేస్తాడు. అయితే మనిషి వేటిని అయితే అభివృద్ధి చేస్తాడో అవి ఇతరుల సొంత ఆస్తిగా మారిపోతాయి. "శ్రమ వస్తువు అంటే వస్తుగతం చేసిన మనిషి జాతి జీవితమే'' అన్నాడు మార్క్స్. అయితే పెట్టుబడిదారీ శ్రమ నిర్వహణలో ఈ ఉత్పత్తి కార్యకలాపం పూర్తిగా భిన్నంగా మారిపోయింది. ఈ వ్యవస్థలో పనివాడి శ్రమ "జాతి జీవితం" నుండి "వ్యక్తి జీవితం"గా మారిపోయింది. పని అనేది జీవితంలో భాగం కాకుంగా జీవించడానికి పని ఒక సాధనంగా మారిపోయింది. అంటే జీవించి ఉండాలంటే పని చేయాల్సిందే.

**ఇతర మనుషుల నుండి పరాయికరణ**

మనిషి తన జీవితం నుండి పరాయివాడు అయ్యాడంటే అర్థం ప్రతి మనిషి ఇతరులకు పరాయివాడు అయ్యాడని అర్థం. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ పోటీ సృష్టిస్తుంది. ఈ పోటీలో కార్మికులకు వ్యతిరేకంగా కార్మికుడినే నిలబెడుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో అనివార్యంగా వారి మధ్య ఉన్న సంబంధాలు పరాయివి, శత్రుపూరితం అవుతాయి. పెట్టుబడిదారుడి చేతుల్లో సంపద మరింత పోగుబడే కొద్ది దాన్ని సృష్టించిన కార్మికుడి ఉనికి మరింత దిగజారుతుంది. అప్పటి నుండి మనుషుల నడుమ సంబంధాలు వస్తువుల సంబంధాలుగా మారిపోతాయి. పోటికి మార్కెట్‌కి సంబంధించిన నియమాల మేరకు కేవలం వస్తువులు సరుకులుగా అవి కలిగి వుండే విలువలు మాత్రమే పోల్చి చూడబడతాయి.

పరాయికరణ భావనను సృష్టించింది హెగెల్, అయితే మత కోణంలో వివరించాడు. మార్క్స్ నిర్దిష్టంగా పరాయికరణని పని, శ్రమ విభజన ఆధారంగా విశ్లేషించాడు. కాని మార్క్స్ తన తదుపరి రచనల్లో పరాయికరణను ఉపయోగించలేదని, మార్క్స్ తన ఆలోచనల అభివృద్ధి క్రమంలో వదులుకున్నాడనే వాదన ఉంది. దేని ప్రాసంగిత అయినా ఆచరణలోనే తెలుతుంది. మార్క్స్ తన 26వ ఏట రచించిన పరాయికరణ ఆలస్యంగా వెలుగులోకి వచ్చినా ప్రత్యేక చర్చకు, పరిశోధనకు దారి తీసింది. స్థూలంగా చెప్పాలంటే మనిషి మనిషి కోసం, లేదా మనుషుల కోసం కాక మానవేతరమైన డబ్బు, వస్తువులు, అధికారం, గుర్తింపు, కీర్తి మొదలైన వాటి కోసం మనిషి బ్రతుకుతున్నాడు. ఇలా మనిషి మనిషి కాకుండా పోవడమే పరాయికరణ.....

❋

# ఆర్యుల భారతీయ మూలాలపై ఆధారాలు లేవు

జాఫర్ హాబీబ్

సింధు నాగరికత వైదిక నాగరికతలో భాగం కాదు. భారతదేశంలో వైదిక సంస్కృతి ప్రవేశపెట్టిన తీరు, ఆర్యుల వలస సిద్ధాంతంలో వివరించబడింది. పూర్వం కజకస్తాన్‌లోని ఉత్తర కజాక్ గడ్డి మైదానాలలో ఆర్యులు నివసించేవారు. తదనంతర కాలంలో దక్షిణానికి వలసలు వచ్చి భారత ఉపఖండంలో స్థిరపడ్డారు.

గత అనేక సంవత్సరాలుగా ఆర్యుల చరిత్రను గురించి అనేక చర్చలు, వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఇప్పుడవి చరిత్ర పాఠ్యాంశాల పరిధిని దాటి, విస్తృత జనబాహుళ్యంలోకి అడుగుపెట్టాయి. సంస్కృతులు, చారిత్రిక గాధలు, సిద్ధాంతాలు తాముగొప్పంటే తాముగొప్పని నిరూపించుకోడానికి ఒక్కదానిపై ఒకటి దూషణలు, కొట్లాటలకు దిగుతున్నాయి. హిందూ మితవాదం ఇందులో అగ్రభాగాన నిలిచింది. తనదొక ప్రత్యేక, విలక్షణమైన సంస్కృతని, సిద్ధాంతమని, ఇది ఇతర అన్ని సంస్కృతులకన్నా, మతాల కన్నా ఉన్నతమైనదని వాదిస్తున్నది. భారతదేశ వారసత్వ సంపదకు తానను ఏకైక హక్కుదారునిగా స్థిర పరచుకునే ప్రయత్నాలు ఇప్పుడు ముమ్మరం చేస్తున్నది. తప్పుడు కథనాలు అని ప్రపంచ పరిశోధకులు రుజువులతో సహా చూపినా, సత్యాలను హిందూ మితవాదులు పక్కన పడేశారు. కేవలం ప్రజాదరణ పొందిన సామాజిక మాధ్యమాల ద్వారా తమ భావాలను ప్రజలలో ప్రచారం చేస్తున్నారు. హిందుత్వ శక్తులు ప్రచారంలో పెట్టే కథనాలు తప్పులని రుజువులతో సహా చూపడానికి న్యూస్ క్లిక్ వరుసగా వ్యాస పరంపర ప్రచురించబోతున్నది.

గత రెండు దశాబ్దాలుగా 'ఆరుల'పై జరుగుతున్నచర్చ, ఈ మధ్య కాలంలో మళ్ళీ ప్రాధాన్యత సంతరించుకున్నది. అనేక కొత్త రుజువులు దొరకడం, వివరణలు అందుబాటులోకి రావడం, పోటీ కథనాలు బయటపడడం దీనికి కారణం. ఇప్పటి వరకు పండితుల మధ్యే జరిగిన చర్చలు ఇప్పుడు ప్రజల మధ్యకి వచ్చేశాయి. దానితో ఈ చర్చలు కొత్త రూపాన్ని సంతరించుకున్నాయి. భారతీయులుగా ఇది మన గుర్తింపుకు సంబంధించిన అంశం కావడం ఇందుకు కారణం. అందువలన దీని ప్రభావం రాజకీయంగా లోతుగా ఉండడమే కాక, ఇందులో భావావేశానికి సంబంధించిన అంశం కూడా ఇమిడి ఉంటుంది.

'ఆర్యులు' భారతదేశ మూలవాసులేనా, వారే ఇక్కడి నాగరికతకు కారణమా, భారతీయ సంస్కృతిగా చెప్పుకుంటున్న సంస్కృతికి ఆద్యులు వారేనా అనేవి అసలైన ప్రశ్నలు. ఆర్యులు భారతదేశ మూలవాసులని హిందూ మితవాదులు నమ్ముతున్నారు. ఆధునిక హిందువులు వారి ప్రత్యక్ష వారసులేనని, అందువలన భారతదేశం సంప్రదాయబద్ధంగా ఒక హిందూ దేశమని, అందువలన ఈ దేశం హిందువుల హక్కు అనే తమ ఆలోచనకి చట్టబద్ధత కూడా ఉందని హిందూ మితవాదులు అంటున్నారు. సింధు నాగరికతకు, ఆర్యులకు మధ్య రెండు రకాల సంబంధాలు ఉండగల అవకాశాలు ఉన్నాయా అన్నది ఇప్పుడు అసలైన చర్చ. ఆర్యులు సింధు నాగరికతకు ముందే ఇక్కడ నివసించినవారా, దాని ఆద్యులా, లేక సింధు నాగరికత అంతం అయిన తరువాత ఇక్కడికి వచ్చారా? ఆర్యులు ఈ దేశ మూలవాసులు అని వాదించే వారు సింధునాగరికత వైదిక కాలానికి చెందినది అని నిరూపించవలసి ఉంటుంది. సింధు నాగరికతలో కనిపించే కొన్ని ప్రాంతాలు ఘగ్గర్-హక్రా లోయ పొడుగునా ఉన్నాయి. ఇది వేదాలలోని సరస్వతి నది లాగే ఉందని కొందరి వాదన. ఋగ్వేదంలో (హిందూ స్మృతులలో) సరస్వతి నదికి అత్యంత ప్రాధాన్యత ఉన్నది.

నిజానికి ఈ ప్రాంతం కేంద్రం గానే సింధు నాగరికత పుట్టి, ఇతర ప్రాంతాలకు విస్తరించినదనే వాదన ఉంది. ఆర్యులు ఇతర ప్రాంతాల నుండి రావడమే కాక, ఈ ఉపఖండం నుంచే ప్రపంచంలోని నలుమూలలకి విస్తరించారని అంటున్నారు. ఇక్కడ గమనించవలసిన అంశం, 'ఆర్యులు' అన్నది ఒక జాతిని గురించి సూచించేది కాదు. ఆర్యులంటే ఇండో యూరోపియన్ భాష మాట్లాడే ఒక సమూహం. తమలో తాము ఒకరినొకరు 'ఆర్య' అని సంబోధించు కుంటూ ఉండడం వలన ఆ పదం వారిని గురించి చెప్పుకునేటప్పుడు వచ్చింది. అయితే ఆర్యులు అనే పదం అర్థం వేదాలలో అనేక సార్లు మార్పులకు గురవుతూ వచ్చింది అన్న విషయం కూడా మనం గమనంలో పెట్టుకోవాలి.

హరప్పన్ నాగరికతగా కూడా పిలవబడే సింధు నాగరికత 2600-1900 బి సి ఏల మధ్య కాలంలో ఉండేది. అది విస్తారమైన ప్రాంతంలో వ్యాపించి ఉండేది. పంజాబ్‌లోని అత్యధిక భాగం (భారతదేశం, పాకిస్థాన్‌లలో ఉన్న పంజాబ్), హర్యానా, పశ్చిమ ఉత్తర ప్రదేశ్, తూర్పు రాజస్థాన్, సింధ్, గుజరాత్‌లో అగ్రభాగం ఈశాన్య ప్రాంతంలో కొన్ని భాగాలూ, బలూచిస్తాన్ దక్షిణ భాగం ఇందులో ఉండేవి.

ఈ నాగరికతను పరిశీలించినప్పుడు చరిత్రకారులు ఒక విచిత్రమైన సమస్యను ఎదుర్కొన్నారు. ఈ నాగరికత లిపిని ఇప్పటికీ చదవలేకపోయారు. అందువలన మనం పురావస్తు శాస్రం పైన, భౌగోళిక ఆధారాల పైన, జీవశాస్త్ర రుజువుల పైన ఆధారపడ వలసి ఉంటుంది. ఈ నాగరికతలోని కొన్ని ప్రధానమైన స్వరూపాలను గుర్తించడం జరిగింది. వాటి ఆధారంగా వారు నివసించిన ప్రాంతాలను గుర్తించడం జరిగింది. ఇందులో కొన్ని - సింధులిపి, ఎండలో ఆరపెట్టిన ఒక్కొక్కటి 1:2:4 నిష్పత్తితో, 13.63 కిలోగ్రాముల బరువున్న ఇటుకలు, తిన్నని రోడ్లు ఉన్న పట్టణ, నగర నివాస కేంద్రాలు, మురుగు నీటి పారుదల వసతులు, భవనాలు, చుట్టూ గోడలు కట్టిన బావులు, చెరువులు, కుండలు తయారు చేయడానికి ఉపయోగించే ప్రత్యేకమైన చక్రాలు, ఉత్తర, దక్షిణ అభిముఖంగా పూడ్చిపెట్టిన స్మశానవాటికలు వగైరా.

సింధు నాగరికత అంతం అవడానికి అనేక కారణాలు చెపుతున్నారు. అవి వివాదాస్పదంగా కూడా ఉన్నాయి. ఆ కారణాలలో కొన్ని - పర్యావరణంలో మార్పులు - అతివృష్టి అనావృష్టి వంటివి -,పర్యావరణ విధ్వంసం, ఇతర ఆసియా ప్రాంతాలతో ఉన్న విదేశీ వాణిజ్యంలో నష్టాలూ, రాజ్యం విఫలమవడం.

ఇక ఆర్యుల విషయానికి వస్తే, ఇండో యూరోపియన్ భాషను మాట్లాడేవారు. వేద

> **❝ ఇక ఆర్యుల విషయానికి వస్తే, ఇండో యూరోపియన్ భాషను మాట్లాడేవారు. వేద గ్రంధాలు రచించారు. ఋగ్వే దం లాంటి వేదాల ఆధారంగా చరిత్రకారులు ఆ నాటి సమా జంలో సంస్కృతీ, సంప్రదాయాలను గుర్తించగలిగారు. అయితే 'వైదిక సమాజం' అంటూ ఒక సమాజం లేదని గుర్తించాలి. వైదిక గ్రంధాలు అనేక శతాబ్దాలలో క్రమంగా అభివృద్ధి చెందుతూ వచ్చాయి. ❞**

గ్రంధాలు రచించారు. ఋగ్వేదం లాంటి వేదాల ఆధారంగా చరిత్రకారులు ఆ నాటి సమాజంలో సంస్కృతీ, సంప్రదాయాలను గుర్తించగలిగారు. అయితే 'వైదిక సమాజం' అంటూ ఒక సమాజం లేదని గుర్తించాలి. వైదిక గ్రంధాలు అనేక శతాబ్దాలలో క్రమంగా అభివృద్ధి చెందుతూ వచ్చాయి. చరిత్రకారులు ఈ సమాజాలలో క్రమంగా జరిగిన మార్పులను గమనించారు. అంతేకాని వైదిక సమాజం అని ఒక స్థిరమైన కాలాన్ని నిర్ధా రించలేమని తెలుసుకున్నారు. దీనికి ఒక ఉదాహరణ ధాన్యం, బార్లీ వంటి వాటిని వైదిక గ్రంధాలలో ఉపయోగించడం క్రమంగా పెరుగుతూ ఉండడం అని చెప్పుకోవచ్చు. అంటే కాలక్రమంగా వ్యవసాయం అభివృద్ధి చెందుతూ వచ్చిందన్నమాట.

సింధు నాగరికతను, ఆర్యుల నాగరి కతను పరిశీలించినపుడు చరిత్రకారులు రెండు విధాల రాజకీయ వ్యవస్థలను, సామాజిక నిర్మాణాలను కనుగొన్నారు. రెండింటిలో మతాచారాలు, అలవాట్లు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. సింధు నాగరికతలో సువ్యవస్థిత నగర సమాజం, అందులో కేంద్రీకరించబడిన రాజ్యాధికారాలు, విదేశీ వ్యాపారాలు, స్థిరమైన వ్యవసాయ ఉత్పాదకత ఉన్నట్టు పురాతత్వ శాస్త్రవేత్తలకు సాక్ష్యాలు దొరికాయి.

సాహిత్యం ఆధారంగా చూసినప్పుడు, వైదిక (వేదకాలం నాటి సమాజం) సమాజం పట్టణీకరించబడని పశుపాలక వ్యవస్థకి చెందినది. ఇందులో గణాధిపతి కేంద్రంగా ఉండడం, క్రతువులతో నిండిన మతాచారాలు ఉండడం గమనించారు. వైదిక గ్రంథాలలో గుర్రాలను గురించిన ప్రస్తావన పదేపదే కనిపిస్తుంది. కానీ సింధు నాగరికతలో గుర్రాల ప్రస్తావన అసలుండదు. కేవలం సురుకొండ లో మాత్రమే అడవి గాడిదలు కనిపిస్తాయి.

చరిత్రకారులకు రెండు నాగరికతలలో పోలికలు కనిపించలేదు. ఋగ్వేదంలో ప్రధానమైన దేవతలు, దేవుళ్ళు ఇంద్రుడు, అగ్ని, లేదా వరుణుడుల గురించిన ప్రస్తావన, ఆధారాలు సింధు నాగరికతలో లేవు. ఈ రెండు సమాజాల నిర్మాణంలో, నిర్వహణలో కూడా కచ్చితమైన బేధాలు ఉన్నాయి. అంటే ఆ రెండూ ఒకే విధమైనవని భావించే అవకాశాలు లేవు.

పురావస్తు సాక్ష్యాల ఆధారంగా కూడా ఘగ్గర్ – హక్రా లోయ సింధు నాగరికతకు కేంద్రంగా ఉండేదనడానికి ఆధారాలు లేవు. ఇక్కడి నివాస ప్రాంతాలు చిన్నవిగా ఉన్నాయి. కేవలం ఒకే ఒక్క నివాస ప్రాంతం పెద్దదిగా ఉంది. దీనినే ప్రస్తుతం గంవేరీవాలా అంటున్నాము. ఘగ్గర్–హక్రా ప్రాంతమే ఋగ్వేదంలో వర్ణించిన సరస్వతి నది తీరమని అనలేము. పైగా ఆఫ్ఘనిస్థాన్ లోని హరాక్స వాలి నదీతీరం సరస్వతి నదితో పోలి ఉంది.

**ఆర్యుల వలస సిద్ధాంతం**

సింధు నాగరికత వైదిక నాగరికతలో భాగం కాదని ఇప్పుడు స్పష్టంగా తెలుసు కున్నాము. భారతదేశంలో వైదిక సంస్కృతి మొదలైన విధానాన్ని ఆర్యుల వలస సిద్ధాం తంతో వివరించవచ్చు. ఆర్యులు ఉత్తర ఖజకిస్థాన్ లోని ఖాజాక్ గడ్డి భూములు ఉన్న ప్రాంతం నుండి దక్షిణం వైపుకు వలసలుగా వచ్చారని, క్రమంగా భారత ఉపఖండానికి చేరుకున్నారని ఈ సిద్ధాంతం ప్రతిపాదిస్తుంది. జెనెటిక్ ఇంజినీరింగ్ (జన్యుపరమైన శాస్త్ర జ్ఞానం) కూడా తమ పరిశోధనల్లో ఆర్యులు ఖాజాక్ లోని గడ్డి మైదానాల నుండి 2100 బిసిఇ ప్రాంతాలలో వలసలుగా దక్షిణ ఆసియా ప్రాంతానికి బయలు దేరారని తేల్చింది. అలా ప్రయాణించిన వారు దక్షిణ ఆసియాను చేరుకునే సరికి 1500 బిసిఇ అయింది.

రాఖీ గర్హి నుండి ఒకటి, షేరి కి సోక్త, గోనూర్‌లలో దొరికిన అస్తిపంజరాలలో సింధు నాగరికతకు చెందిన వారి నుండి 12 డి ఎన్ ఏ నమూనాలలో సేకరించారు. ఆ ఆధారాల ప్రకారం ఆర్యులలో ఇరానియన్ల, మొదటి భారతీయుల (65000 సంవత్సర కిందట ఆఫ్రికా నుండి బయలుదేరి ఇతర ప్రాంతాలకు వచ్చినవారి) నమూనాలు ఉన్నాయి. వారిలో ఆర్యులతో సంబంధాలున్న స్టెప్పీల వారసత్వ అంశాలు లేవు. అంటే ఆర్యుల పూర్వీకుల నమూనాలు లేవు. అంటే దానర్థం సింధునాగరికత ఉత్కృష్ట స్థాయిలో ఉన్న ఈ ప్రాంతంలో ఆర్యులు నివాసం లేరన్నది స్పష్టం. కానీ ఈ రోజు భారతదేశ వ్యాప్తంగా గడ్డి మైదానవాసుల డి ఎన్ ఏ లు కనిపిస్తాయి. అంటే ఏదో ఒక నిర్దిష్ట కాలంలో ఆర్యులు భారతదేశానికి వలస వచ్చారన్నది స్పష్టం. ఈనాడు కనుగొనబడిన జన్యుపరమైన, భాషా పరమైన ఆధారాలు పరస్పర సంబంధం కలిగి ఉన్నాయి. వివిధ భాషలు ఎలా ఒక ప్రాంతం నుండి వేరొక ప్రాంతానికి వ్యాపించాయో, పరస్పర సంబంధాలు కలిగి ఉన్నాయో, వికసించాయో ఈ జన్యుపరమైన ఆధారాలు తెలియచేస్తున్నాయి. ఈ సందర్భం లోనే ఇండో – యూరోపియన్ భాష వ్యాపిం చింది అని చెప్పుకోవచ్చు. దాని నుండి సంస్కృతం, గ్రీక్, లాటిన్ భాష ఉద్భవించాయి. ఈ వలసలు వచ్చిన వారి భాషలు కూడా అవే.

టోనీ జోసెఫ్ రాసిన 'ఆదిమ భారతీ యులు' లో సింధు నాగరికత క్షీణించిన తరువాత ఆ ప్రజలు అంతర్ధానం అయిపో లేదు. వారు భారత ఉపఖండం అంతా వ్యాపించారు. సారవంతమైన కొత్త భూములను వెతుక్కుంటూ పోయారు. అదే కాలంలో ఆర్యులు ఈ ఉపఖండంలోకి ప్రవేశించారు. వారితో పాటుగా వారి ప్రత్యేకమైన సంస్కృతిని కూడా తీసుకొచ్చారు. ఆనాడు ఇక్కడ ఆ రెండు సంస్కృతులు, ప్రజలు పరస్పరం సహకరించు కున్నారు' అని రాసారు.

కేవలం ఆర్యులే భారతదేశ ప్రాచీనులుగా వాదించడం అంటే, మన మూలాల సమగ్రా కృతిని అర్థంచేసుకునే అవకాశాన్ని వదులుకో వడమే. భారతదేశ వ్యాప్తంగా సాంస్కృతికంగా, సమాజపరంగా, జన్యుపరంగా కూడా ఉన్న వైవిధ్యాలను నిర్లక్ష్యం చేయడమే. కానీ హిందూ మితవాదులు తమ సంస్కృతే ఉన్నతమైనదిగా, ప్రధానమైనదిగా స్థిరపరిచేందుకు కథలు అల్లుతున్నారు. ఈ వ్యాసాలలో ఇటువంటి చిత్రణను అంగీకరించక, భారతదేశ చరిత్ర పట్ల ఒక సంపూర్ణ అవగాహన కల్పించే ప్రయత్నం జరుగుతుంది.

**బూటకపు చరిత్ర బహిర్గత క్రమం II**
**సంస్కృతం – తల్లా చెల్లా?**

'సంస్కృతం భాషలన్నిటికీ తల్లని' హిందూ మితవాదు, అనేక ఇతర సంస్థలు, వ్యక్తులు దావా చేస్తుంటారు. సంస్కృతం నుండి లాటిన్, గ్రీక్,

ఇంగ్లీష్ ఉద్భవించాయని అంటుంటారు. దీనికి కొంత మృదుత్వం జోడించి, సంస్కృతం భారతదేశ భాషలన్నిటికి మాతృభాష అని మరో వాదన ప్రచారంలో పెట్టారు. వీటన్నిటి పరమార్థమొకటే. హిందుత్వ ఆధిపత్యాన్ని స్థిరీకరించడం. జాతీయంగా, అంతర్జాతీయంగా తన మార్కు హిందూయిజాన్ని వ్యాపింప చేయడం. తామొక ఉన్నతమైన జాతికి, సంస్కృతికి వారసులమనే తప్పుడు జాతి గర్వాన్ని తన అనుయాయులలో పాదుగొల్ప డం. సర్ విలియం జోన్స్ 1786 ఫిబ్రవరి 2న వెలువరించిన 'థర్డ్ యానివర్సరీ డిస్కోర్స్' అనే పుస్తకం నుండి ఇచ్చిన ఉటంకింపులో, "దాని పూర్వాపరాలు ఏవయినప్పటికీ, సంస్కృ తం ఒక అద్భుతమైన భాష, గ్రీక్ కన్నా సమగ్రమైనది. లాటిన్ కన్నా సమృద్ధవంతమైనది. ఆ రెండిటికన్నా అద్భుతమైన చమత్కా రం కలది..." అని రాసారు.

ఈ ప్రకటనని ఆధారంగా చేసుకుని సంస్కృతం అన్ని భాషలకన్నా ఉన్నతమైనదిగా ప్రకటించడం మొదలయింది. నిజానికి ఈ ఉటంకింపు సగమే. ఆ తరువాతి మాటలు ..." సంస్కృతానికి మిగిలిన ఆ రెండు భాషలతో (గ్రీక్, లాటిన్) బలమైన అనుబంధం ఉంది. వాటి క్రియలలో, వ్యాకరణ విధానాలలో కూడా. ఇది కేవలం కాకతాళీయంగా జరిగి ఉండకపోవచ్చు. ఆ బంధాలు దృఢమైనవంటే, ఏ తాత్వికుడూ ఆ మూడు భాషలు ఒకే మూలం నుండి వచ్చాయని భావించకుండా వాటిని పరిశీలించలేరు. ఆ మూడు భాషల మూల భాష బహుశా ఇక మిగిలి ఉండక పోవచ్చు."

ఇది సంస్కృతం యొక్క స్వరూపాన్ని అంచనా వేయడంలో ఒక కొత్త దారిని సూచి స్తుంది. లాటిన్, గ్రీక్ భాషలతో సంస్కృతానికి సారూప్యత ఉంది అంటే సంస్కృతం నుండే అవి పుట్టాయని కాదు. మూడింటి మూలాలు ఒకటే అయి ఉండవచ్చని, ఇంకో మౌలిక భాష ఉండవచ్చని దాని అర్థం. అంటే సంస్కృతం అన్ని భాషలకు మూలమన్న అవగాహనని ఇది సవాలు చేస్తున్నది. సంస్కృతం కూడా ఇతర ప్రాథమిక భాషలలో ఒకటని సూచిస్తున్న దన్నమాట.

సంస్కృతం దాని తక్షణ భూతకాలంలో ఇండో- ఆర్యన్ కుటుంబానికి చెందినదే. ఇది ఇండో ఇరానియన్ కుటుంబంలో భాగం. ఈ ఇండో ఇరానియన్ భాష, ఇండో యూరోపి యన్ కుటుంబ భాషలలో భాగం. ఒక భాష కుటుంబం అంటే, వాటి అన్నిటికి ఒక ప్రాచీన భాష మూలాలు ఉంటాయి. ప్రతో - ఇండో - యూరోపియన్ భాషల పుట్టుకకు సంబంధించిన అనేక సిద్ధాంతాలు ఉన్నాయి.

**" సంస్కృతం దాని తక్షణ భూతకాలంలో ఇండో- ఆర్యన్ కుటుంబానికి చెందినదే. ఇది ఇండో ఇరానియన్ కుటుంబంలో భాగం. ఈ ఇండో ఇరానియన్ భాష, ఇండో యూరోపి యన్ కుటుంబ భాషలలో భాగం. ఒక భాష కుటుంబం అంటే, వాటి అన్నిటికి ఒక ప్రాచీన భాష మూలాలు ఉంటాయి. ప్రతో - ఇండో - యూరోపియన్ భాషల పుట్టుకకు సంబంధించిన అనేక సిద్ధాంతాలు ఉన్నాయి. "**

వి.గోర్డాన్ చిల్డే వంటి వారు ఇండో యూరోపి యన్ భాష, నల్ల సముద్రం ఉత్తరాన ఉన్న కాస్పియన్ గడ్డి మైదాన ప్రాంతాలలో ఉద్భ వించిందని అంటారు. కొలిన్ రెన్ఫర్ ఇది అనటోలా, తూర్పు ప్రాంతం దగ్గరలో ఉద్భ వించిందని దావా చేస్తున్నారు.

ఈ భాష మాట్లాడేవారు నల్ల సముద్రానికి చుట్టూ ఉన్న ప్రాంతాల నుండి వచ్చారని ఇక్కడ ప్రధానమైన అంశం. ఆ తరువాతి కాలంలో యూరప్, ఇరానియన్ పీఠభూమి, భారత ఉపఖండం అంతటా వ్యాపించారు. సంస్కృతం కేవలం భారతదేశంలో మాత్రమే రూపొంద లేదు. దాని ప్రాచీన మూలాలు ఆర్యులతో పాటుగా భారతదేశానికి వచ్చాయి. 2000-1500 బి సి ఇ మధ్య కాలంలో ఆర్యులుగా పిలవబడే వారు భారతదేశానికి చేరుకున్నారు. ఆ తరువాత భారత ఉపఖండంలో ఈ జాతి ఒక స్థాయికి పరిణామం చెందింది. ఈ వలస క్రమాన్ని ఆధునిక కాల టర్కీలోని 'మితాన్ని' రాజ్యంలో చూడవచ్చు. (సి 1550-1260 బి సి ఇ). ఇక్కడి స్థానిక హుర్రియన్ భాషలో ఇండో ఆర్యన్ భాష పదాల మూలాలు కనిపిస్తాయి. మితాన్ని గ్రంథాలలో వేదకాలం నాటి దేవతలు - మిత్ర, వరుణుడు, ఇంద్రుడు, నసత్యులను ప్రార్థించడం చూస్తాము. ఈ రాజ్యంలోని కిక్కులి గ్రంథాలలో ఐక, తేరా, పంజా. సత్తా (ఒకటి, మూడు, ఐదు, ఏడు) వంటి పదాలు ఉన్నాయి.

భారతదేశంలో అనేక భాషా కుటుంబాలు మనుగడలో ఉన్నాయి - ఇండో-ఆర్యన్, ద్రావిడ, ఆస్ట్రో-ఆసియాటిక్, టిబెటో- బర్మీస్ వగైరా. ఇండో-ఆర్యన్ భాషను ఇండో-యూరోపియన్ భాషా కూటమికి చెందినదిగా చెప్పవచ్చు. ఉత్తర భారతదేశంలో చదవగల భాషలలో మొదటి ప్రాచీన భాష ఇండో-ఆర్యన్ భాష. ఈ భాషలలో అతి ప్రాచీనమైనది సంస్కృతం. ఆ తరువాతి కాలంలో మధ్య ఇండో-ఆర్యన్ దశ నుండి ప్రాకృతి, పాళీ భాషలు ఉద్భవించాయి. ఈ రెండు భాషలు ఆ నాటి దేశీయ భాషలు. ప్రాకృతి భాషను ఆ నాటి రాజులు, పాళీ భాషను బౌద్ధులు పోషిం చారు. ఈ రెండు భాషలు సంస్కృతం కన్నా భిన్నమైనవిగా భావించబడేవి. స్వతంత్రంగా ఉద్భవించినవిగా పరిగణించబడేవి.

ఈ మధ్య కాలంలో ఈ సమూహం ఆధునిక లేదా కొత్త ఇండో - ఆర్యన్ గ్రూప్‌గా పిలవబడుతున్నది. ఇందులో హిందీ, ఉర్దూ, గుజరాతి, కాశ్మీరీ భాషలు ఉన్నాయి. ద్రావిడ భాషల కుటుంబ మూలాలు ఇదమిద్ధం గా చెప్పబడ లేదు. ఈ సమూహంలో కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ భాషలు మాట్లా డేవాళ్లున్నారు. వారి పదాలలో సంస్కృతానికి సారూప్యంగ కొన్ని పదాలు ఉండడం వలన సంస్కృతం ద్రావిడ భాషలకు తల్లిగా ఉండడా నికి కారణంగా చెప్పుకుంటున్నారు. ఫ్రాంక్లిన్ సి సౌత్వర్థ్ కృషిని చూసినట్లయితే, ద్రావిడ భాషలలోని కొన్ని పదాలు - ఉళక్కై (రోకలిబండ) సంస్కృతంలో ఉలూఖల (రోలు), కుట్టు (దెబ్బ వేయడం) కుట (కొయ్య సుత్తి), నళ్ళు (రెల్లుగడ్డి), నాడ /నాలా (రెల్లుగడ్డి) గుర్తించవచ్చు. అలాగే మనం సంస్కృతంలో మూలాలున్న ద్రవిడ పదాలను కూడా చూడవచ్చు. పక్ష (గాలి, వైపు) ని ద్రావిడ భాషలలో పక్కం అని గ్రద్దని గద్ద అని అక్సాని అక్కు అని అనడం చూస్తాము. ఇవన్నీ అప్పుతెచ్చుకున్న పదాలే. ఒక భాష నుండి మరో భాషకి పెద్దగా మార్పులు లేకుండా వచ్చిచేరినవి.

పెగ్గీ మోహన్ రాసిన 'వాండరర్స్, కింగ్స్, అండ్ మర్చంట్స్',అనే పుస్తకంలో,'' అప్పుతెచ్చుకున్న పదాలను బాహ్య వస్త్రధారణగా పరిగణించాలి. వాటిని వేసుకోవచ్చు. వేసుకోకపోవచ్చు కూడా. ఆ పదాలు ఉండడం వలన గాని లేకపోవడం వలన భాషలో పెద్ద తేడా ఏమి ఉండదు" అని అంటారు. అంటే సంస్కృతం నుండి కొన్ని పదాలు అప్పు తెచుకున్నంత మాత్రాన ఆ భాషలు సంస్కృతం నుండి పుట్టాయని పరిగణించవలసిన పనిలేదు. నిజానికి అందుకు పూర్తి భిన్నంగా అవగాహన చేసుకోవలసి ఉంటుంది. ఎందుకంటే

*(మిగత 34వ పేజీలో)*

# హిందుత్వ, కార్పొరేట్ శక్తులు ఎగదోసిన మణిపూర్ మంటలు



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

**ఎ కోటిరెడ్డి**

మణిపూర్‌లో మహిళలను దారుణంగా సామూహిక మానభంగం చేసి, నగ్నంగా వీధుల వెంటతిప్పినా విశ్వగురుగా సంఘ్ పరివార్ కీర్తిస్తున్న మోడి నోరు విప్పలేదు. మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియో బయటికి వచ్చిన తర్వాత దేశం, ప్రపంచం అంతా ఆ ఘటనను ఖండించటంతో మోడికి నోరు విప్పక తప్పలేదు. అపుడు కూడా మణిపూర్ ఘటనను ఖండించకుండా మణిపూర్‌తో పాటు ఇతర రాష్ట్రాలలో కూడా ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పి, దానినొక సాధారణ సంఘటనగా ముద్ర వేయటానికి ప్రయత్నించాడు. ఇటువంటి వైఖరి దాడులకు గురవుతున్న ప్రజలు మరింతగా భయకంపితులు కావటానికి, దాడులకు పాల్పడుతున్నవారు మరింత ధైర్యంగా దాడులు చేయటానికి పురికొల్పుతుంది. ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల పార్లమెంటు సమావేశాలలో మణిపూర్ మానభంగాలు, హింసాకాండపై మోడితో ప్రకటన చేయించాలని ప్రతిపక్షాలు చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. దానితో మోడితో మాట్లాడించటానికి, ఈ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపటానికి ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాయి.

హిందుత్వ, కార్పొరేట్ శక్తులు అధికారం లోకి వస్తే మైనారిటీలు మాత్రమే కాక సామాన్య ప్రజలు, రైతులు, గిరిజనులు ఎటువంటి పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందో, శాంతి భద్రతల పరిస్థితులు ఎలా దిగజారతాయో, కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలకు దేశాన్ని అమ్మటం కోసం ఏ విధంగా కల్లోలాన్ని సృష్టిస్తాయన్న అంశాన్ని మణిపూర్ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

దేశ ఈశాన్యప్రాంతంలో పర్వతమయంగా ఉన్న చిన్నరాష్ట్రం మణిపూర్. బంగ్లాదేశ్, మయన్మార్‌లతో సరిహద్దును కలిగివుంది. సుమారు 33 లక్షల మంది ప్రజలు ఆ రాష్ట్రంలో నివసిస్తున్నారు. మొత్తం జనాభాలో సగానికి పైగా మెయిటీ తెగవారు ఉన్నారు. కుకి, నాగాలు 43 శాతం ఉన్నారు. మెయిటీలు ప్రధానంగా ఇంఫాల్ లోయలో నివసిస్తుండగా, కుకిలు ఎక్కువగా పర్వతప్రాంతాలలో నివసిస్తున్నారు. మెజారిటీగా ఉన్న మెయిటీలు ప్రభుత్వం, అధికారయంత్రం, పోలీసులు లపై పట్టుకలిగి ఉన్నారు. హింసాకాండకు పాల్పడుతున్న మెయిటీ గూండా గ్యాంగులు తరచుగా పోలీసుల వద్ద నుండి ఆయుధాలను లూటి చేస్తున్నారు. మైనారిటీలుగా ఉన్న కుకీలపై దాడులు చేయటం, వారిని ఇళ్ళ నుండి, ఊళ్ళ నుండి తరిమివేయటం చేస్తున్నారు. అనేక గ్రామాలను తగులబెడుతున్నారు. ఈ క్రమంలో 60 వేలమందికి పైగా ఇళ్ళనుండి తరిమివేయబడి, శరణార్థి శిబిరాలలో తలదాచుకుంటున్నారు. వందిలాది మహిళలను మానభంగాలు చేశారు. వందలాది చర్చిలను ధ్వంసం చేశారు. డజనుకు పైగా దేవాలయాలు కూడా దెబ్బతిన్నాయి.

మెయిటీలు, కుకిల మధ్య అనేక సంవత్సరాల నుండి విబేధాలు కొనసాగుతున్నాయి. తమకు గిరిజన తెగగా గుర్తింపు కావాలని మెజారిటీగా ఉన్న మెయిటీలు డిమాండ్ చేస్తున్నారు. మైనారిటీలుగా ఉన్న కుకిలు ఈ డిమాండ్‌ను వ్యతిరేకిస్తున్నారు. మెయిటీలకు గిరిజన తెగగా గుర్తింపు ఇచ్చినట్లైతే వారు కుకిలు నివసిస్తున్న పర్వత ప్రాతాలలో భూములు కొనుగోలు చేస్తారని, ఆ ప్రాంతంలోనే స్థిర నివాసాలు ఏర్పరచుకుంటారని, దానితో తాము నివసించే ప్రాంతంలో కూడా తాము స్వేచ్ఛగా జీవించటానికి అవకాశం ఉండదని కుకిలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, సమాజంపై వారి పట్టుమరింతగా పెరుగుతుందని భయపడుతున్నారు. పర్వతప్రాంతంలో ఉంటున్న తమను అక్కడి నుండి తరిమివేయటం కోసం మెయిటీలు మెజారిటీగా ఉన్న ప్రభుత్వం మాదకద్రవ్యాలపై యుద్ధం పేరుతో తమపై అణచివేత చర్యలను కొనసాగిస్తున్నదని కుకిలు భావిస్తున్నారు. మయన్మార్ నుండి వచ్చిన వారు ఇక్కడ స్థిరపడుతున్నారని, కుకీలు వారికి మద్దతిస్తున్నారని ప్రభుత్వం ఆరోపిస్తున్నది. వాస్తవంలో రాష్ట్రంలో పెరుగుతున్న జనాభాతో పాటు ఆర్థిక అవసరాలు, నిరుద్యోగం భూమికోసం ఆందోళనలు పెరగటానికి కారణంగా ఉన్నాయి. ఇటువంటి పరిస్థితులలో మైనారిటీలుగా ఉన్న కుకిల సమస్యలను పరిష్కరించి, వారిలో ఉన్న భయాలను తొలగించటానికి మారుగా ప్రభుత్వం వారిని మరింతగా భయాందోళనలకు గురిచేసే చర్యలు తీసుకున్నది. ఖనిజసంపద పుష్కలంగా ఉన్న పర్వతప్రాంతాల నుండి కుకిలను తరిమివేసి, వారి నివాసప్రాంతాలు, సాగుభూములు, అడవులను కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలకు ఇవ్వటం ప్రభుత్వ లక్ష్యంగా ఉన్నది.

రాష్ట్రంలో ఉన్న ప్రధానతెగలు మెయిటి, కుకి, నాగాలలో సాయుధ తీవ్రవాద గ్రూపులున్నాయి. తమ ప్రాంతాలకు స్వయం పాలన, భూములు, ఇతర సమస్యలపై ఈ గ్రూపులు ప్రభుత్వం, రక్షణ బలగాలపై పోరాడటంతో పాటు తమలో తాము కూడా పోరాడుకుంటున్నాయి. వీటితో పాటు మతపరమైన వ్యత్యాసాలు కూడా ఉన్నాయి. మెజారిటిగా ఉన్న మెయిటీలు ప్రధానంగా హిందువులుగా ఉండగా, మైనారిటిలుగా ఉన్న కుకిలు ఎక్కువ మంది క్రైస్తవులుగా ఉన్నారు. దీనిని ఆధారంగా చేసుకొని సంఘ్ పరివార్ మెజారిటీగా ఉన్న మెయిటీలను మైనారిటీలుగా ఉన్న కుకిలపై దాడులకు రెచ్చగొట్టింది. మెయిటీలను గిరిజనులుగా

గుర్తించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు, ప్రభుత్వం దానిని వెంటనే అమలు జరపటానికి పూనుకోవటం ఈ హింసాకాండకు తక్షణ కారణంగా ఉన్నాయి.

హింసాకాండకు పాల్పడుతున్న మూకలు పోలీసుల వద్దనుండి ఆయుధాలను దోచుకెళుతున్నారని చెబుతున్నారు. నిజంగానే పోలీసుల వద్దనుండి ఆయుధాలను దోపిడీ చేసి, వాటితో హత్యాకాండను కొనసాగిస్తుంటే అటువంటి హింసాత్మక మూకల పట్ల ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరించాలి? కాని ప్రభుత్వం ఈ గ్యాంగుల పట్ల ఉదారంగా వ్యవహరిస్తున్నది. వారికి సహకరించే విధంగా పనిచేస్తున్నది. రాష్ట్రంలో ఇంత హింసాకాండ జరుగుతుంటే, 130 మందికి పైగా ప్రాణాలను కోల్పోతే, వందలాది మంది మహిళలను మానభంగాలు చేస్తుంటే, వేలాది మంది మూడు మాసాల నుండి శరణార్థ శిబిరాలలో గడుపుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడాలేదు. తప్పుడు వార్తలు, ప్రచారాలను నిలువరించటానికి, వాస్తవాలను ప్రజలకు చెప్పటానికి, హింస, మానభంగాలకు పాల్పడుతున్న వారిని నిలువరించటానికి కూడా ప్రభుత్వం పూనుకోలేదు. దాని ఫలితంగానే మెయిటీ మహిళలను కుకిలు మానభంగం చేశారని తప్పుడు వార్తలు ప్రచారం కావటం, కుకి మహిళలను సామూహిక మానభంగాలు చేయటం ద్వారా వీటికి ప్రతీకారం తీర్చుకోవాలని మెయిటీలను రెచ్చగొట్టారు. కుకి మహిళలను సామూహికంగా మానభంగం చేయటం, వివస్త్రలను చేసి వీధుల వెంట తిప్పటం తదితరాలకు ఈ పరిణామాలు దోహదం చేశాయి.

> **“హింసాకాండకు పాల్పడుతున్న మూకలు పోలీసుల వద్దనుండి ఆయుధాలను దోచుకెళుతున్నారని చెబుతున్నారు. నిజంగానే పోలీసుల వద్దనుండి ఆయుధాలను దోపిడీ చేసి, వాటితో హత్యాకాండను కొనసాగిస్తుంటే అటువంటి హింసాత్మక మూకల పట్ల ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరించాలి? కాని ప్రభుత్వం ఈ గ్యాంగుల పట్ల ఉదారంగా వ్యవహరిస్తున్నది.”**

నెలల తరబడి ఇంతటి ఘోరాలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించాయి. ప్రజలు వ్యతిరేకిస్తున్నా, ప్రపంచమంతా దుమ్మెత్తిపోస్తున్నా తమ లక్ష్యాలను చేరటమే–మణిపూర్ ప్రజలను మతపరంగా విడదీయటం, మెజారిటీ మతానికి చెందిన వారు తమ వెనుక సమీకృతమయేలా చేసుకోవటం, మైనారిటీలను భయభ్రాంతులను చేసి, వారున్న ప్రాంతాల నుండి తరిమి వేయటం, ఆ భూములను కార్పొరేట్‌లు, బహుళజాతి సంస్థలకు కట్టబెట్టటం, దేశవ్యాపితంగా మెజారిటీ మతానికి చెందిన ప్రజలు తమ వెనుకచేరేలా చేసుకోవటానికి మణిపూర్ ఘటనలను ఉపయోగించుకోవటం–వారికి ముఖ్యం. మైనారిటీలపై దాడులు చేస్తున్నారు కాబట్టి సంఘ్ పరివార్, దాని రాజకీయ ప్రతినిధిగా ఉన్న బిజెపి మెజారిటీ మతానికి ప్రతినిధిగా ఉందనుకుంటే పొరపాటు పడ్డట్టే. వారు మెజారిటీ మతంలోని బ్రాహ్మణవాదానికి మాత్రమే ప్రతినిధులు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బ్రాహ్మణవాదాన్ని అగ్రస్థానంలో నిలబెట్టటానికి, చాతుర్వర్ణ వ్యవస్థను పున:స్థాపించటానికి ఒక్క మణిపూర్ మాత్రమే కాదు. భారతదేశం అంతటినీ మణిపూర్‌లా మార్చటానికి వారేమాత్రం సందేహించరు. వందలు కాదు. వేలు, లక్షల ప్రాణాలు పోయినా పట్టించుకోరు. మహిళలంతా మానసిక క్షోభకు గురైనా లెక్కచేయరు.

మతోన్మాదం పెరిగి, మైనారిటీ మతాలకు చెందినవారిపై దాడులు చేస్తుంటే మైనారిటీల మాన,ప్రాణాలు మాత్రమే ప్రమాదంలో పడవు. మెజారిటీ మతానికి చెందిన ప్రజలు కూడా ఈ నష్టాల నన్నింటినీ అనుభవిస్తారు. ప్రస్తుతం మణిపూర్‌లో అవే పరిణామాలను చూస్తున్నాం. మెజారిటీ మతం పేరుతో వ్యవహరిస్తున్న సంఘ్ పరివార్ తమ ప్రయోజనాల కోసం వేలు, లక్షల మంది మెజారిటీ మతానికి చెందిన ప్రజలను బలిచేయటానికి, దేశాన్ని మత మారణ కాండలో ముంచటానికి ఏ మాత్రం సందేహించదు. సంఘ్ పరివార్ నిజస్వరూపాన్ని ప్రజలు అర్థం చేసుకొని, మెజారిటీ, మైనారిటీలన్న విభజనను పక్కన పెట్టి, సమైక్యంగా ఈ విచ్ఛిన్నకర శక్తులను ఓడించినపుడే మైనారిటీతో పాటు మెజారిటీ ప్రజల మానప్రాణాలకు కూడా రక్షణ లభిస్తుంది.

### సమైక్యంగా ప్రతిపక్ష కూటమి

జులై 17, 18 తేదీలలో బెంగళూరులో ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి సమావేశం జరిగింది. జూన్ 23వ తేదీన పాట్నాలో జరిగిన మొదటి సమావేశంలో 17 రాజకీయ పార్టీలు పాల్గొనగా, బెంగళూరు సమావేశానికి 26 పార్టీలు హాజరయాయి. బెంగళూరు సమావేశంలో కూటమికి 'భారత జాతీయ ప్రజాస్వామ్య సమ్మిళిత కూటమి' –ఇండియా–అన్న పేరును ఖరారు చేశారు. మోడి నాయకత్వంలోని ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తీసుకురావటానికి ప్రయత్నం చేస్తున్నాయి. సైద్ధాంతికంగా, సమస్యల ప్రాతిపదికగా బిజెపికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయాన్ని రూపొందించాలన్న ప్రతిపాదనకు అంగీకరించాయి.

ప్రతిపక్షకూటమిని పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నప్పటికీ, ప్రతిపక్షాలు ఐక్యంగా సమావేశం కావటం బిజెపికి ఎంతగా కలవరం పుట్టిస్తున్నదో ఆ పార్టీ వ్యవహరిస్తున్నతీరు స్పష్టం చేస్తున్నది. ప్రతిపక్షపార్టీల సమావేశానికి పోటీగా జులై 18వ తేదీన బిజెపి కూడా ఎన్‌డిఎలోని పార్టీల సమావేశం జరిపింది. ముందు సన్నాహాలు లేకుండా కలిసొచ్చే పార్టీలతో బిజెపి హఠాత్తుగా సమావేశం జరపటం ప్రతిపక్ష కూటమితో ఆ పార్టీ ఎంతగా కలవరపడుతున్నదన్న విషయాన్ని వెల్లడిస్తున్నది. బిజెపి ఢిల్లీలో జరిపిన ఎన్‌డిఎ కూటమిలోని పార్టీల సమావేశానికి చిన్న చిన్న పార్టీలు మాత్రమే హాజరయాయి. గతంలో బిజెపి మిత్రులుగా ఉండి, తర్వాత దూరమైన ప్రధాన ప్రాంతీయ పార్టీలు టిడిపి, జనతాదళ్ (సెక్యులర్), శిరోమణి అకాలీదళ్(బాదల్) పార్టీలు సమావేశానికి హాజరు కాలేదు. ఎన్‌డిఎ కూటమితో కలిసి ఉంటామని కూడా వారు ప్రకటించలేదు. దానితో బిజెపి మినహా చిన్న పార్టీలు మాత్రమే సమావేశంలో భాగస్వాములయాయి. తమ కూటమిలో 38 పార్టీలున్నాయని బిజెపి చెప్పుకుంటున్నప్పటికీ వివిధ రాష్ట్రాలలో కులాలపై ఆధారపడిన చిన్న

> **❝ ప్రతిపక్షపార్టీలు లౌకికవాదం, ప్రజా స్వామ్యం, రాజ్యాంగాలను పరిరక్షించాలన్న అంశాల ప్రాతిపదికగా కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించటానికి ప్రయత్నిస్తున్నాయి. ధరల పెరుగుదల, అవినీతి, పెరుగుతున్న నిరుద్యోగం తదితర సమస్యలతో పాటు పెరుగుతున్న నిరంకుశ విధానాలు, సమాఖ్య విధానంపై దాడి, కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేయటం వంటి అంశాలను ముందుకు తెచ్చి మోడి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టటానికి పూనుకున్నాయి. ❞**

చిన్న పార్టీలు, ఈశాన్యరాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీలు, శివసేన, ఎన్‌సిపి లాంటి పార్టీల చీలిక గ్రూపులు మాత్రమే కూటమిలో ఉన్నాయి. ఐక్యమవుతున్న ప్రతిపక్షపార్టీలపై అక్కసుతో 'ఇండియా పేరు ఈస్టిండియా కంపెనీకి, ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా వంటి విచ్ఛిన్నకర పార్టీల పేరులోనూ ఉందని మోడి నోరు పారేసుకున్నాడు.

ప్రతిపక్షపార్టీలు లౌకికవాదం, ప్రజా స్వామ్యం, రాజ్యాంగాలను పరిరక్షించాలన్న అంశాల ప్రాతిపదికగా కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించటానికి ప్రయత్ని స్తున్నాయి. ధరల పెరుగుదల, అవినీతి, పెరుగుతున్న నిరుద్యోగం తదితర సమస్యలతో పాటు పెరుగుతున్న నిరంకుశ విధానాలు, సమాఖ్య విధానంపై దాడి, కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేయటం వంటి అంశాలను ముందుకు తెచ్చి మోడి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టటానికి పూనుకున్నాయి. ఈ అంశాలపై దేశం, రాష్ట్రాల స్థాయిలో సదస్సులు, సభలు జరిపి, మోడి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక విధానాలను ఎండగడతామని ప్రకటించాయి.

ఇండియా కూటమిగా ఏర్పడిన ప్రతిపక్షపార్టీలు తమ మధ్య ఉన్న విబేధాలను కూడా పరిష్కరించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్-ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య ఉన్న వైరుధ్యాలను పరిష్కరించటంలో ప్రతిపక్షపార్టీల నాయకులు కొంతమేరకు సఫలమయారు. ఢిల్లీ ప్రభుత్వ పాలనాధికారాలను లాక్కోవటానికి కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను వ్యతిరేకించటానికి కాంగ్రెస్ అంగీకరించింది. దానితో ప్రతిపక్ష కూటమిలో భాగస్వామిగా ఉండటానికి ఎఎపి అంగీకరించింది. ఇదే విధంగా మిగతా కొన్ని పార్టీల మధ్య నున్న వైరుధ్యాలు కొంతమేరకు వెనుకపట్టు పడతాయని భావించవచ్చు. రానున్న కాలంలో మరిన్ని పార్టీలు కూటమిలో భాగస్వాములయే అవకాశం ఉందని నాయకులు ప్రకటించారు.

పది సంవత్సరాల బిజెపి దుష్ట పాలనతో విసిగిపోయిన ప్రజలు ప్రతిపక్షపార్టీల కూటమి వెనుక చేరటానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. బిజెపి పాలనలో కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలు, ప్రజల భూములు, ప్రభుత్వ ఆస్తులను కబళించేవారికి మినహా సామాన్యప్రజలకు చేకూరిన లబ్ది శూన్యం. బిజెపి ప్రభుత్వం సంఘ్ పరివార్ అజెండాను అమలుచేసే క్రమంలో ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక హక్కులపై దాడిని తీవ్రం చేసింది. దేశంలో పాలన సక్రమంగా జరగటం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థలు, సంస్థలను దిగజార్చింది. రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై పూర్తిస్థాయిలో దాడిచేస్తున్నది. బిజెపి తిరిగి కేంద్రంలో అధికారంలోకి రావటం జరిగితే ఆధునిక భారతదేశాన్ని పూర్తిగా ధ్వంసం చేసి, ఆటవిక, అనాగరికతలలో దేశాన్ని ముంచుతుంది. బిజెపి ప్రమాదాన్ని వివరించటం, ప్రజలను చైతన్యవంతం చేయటం, ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తేవటంలో ప్రతిపక్షకూటమి విజయం సాధించాలని ఆశిద్దాం. ❋

---

# అమెరికా సంస్థల లాభాల కోసమే సైనిక ఒప్పందాలు

*(20వ పేజీ తరువాయి)*

వ్యవస్థలు ఎంత వరకు వాడుకుంటాయి అనేది వాటి వంతు.

1989లో 'కావేరి' ఇంజన్‌ను (1970ల ప్రారంభం నుండి ఇంతకుముందు చాలా పని చేసినప్పటికీ) తయారు చేసే ప్రయత్నాలు ప్రారంభమైనప్పటికీ స్వదేశీ పరిజ్ఞానంతో యుద్ధ విమానాల అభివృద్ధి చేసే ప్రయత్నం ఇబ్బందుల్లో పడింది. అనుకున్న సమయంలో పూర్తి చేయలేకపోడం, నిర్మాణ ఖర్చులు పెరిగిపోవడంతో చివరికి ఈ ప్రయత్నాన్ని వదిలేశారు. దానికి బదులుగా భారతదేశంలో వీటిని రూపొందించి, అభివృద్ధి చేయడం కోసం విదేశీ ఇంజిన్ తయారీదారులు జి ఇ, ఫ్రెంచ్ ఎస్ ఎన్ ఇ సి ఎమ్ ఎ మరియు బ్రిటిష్ రోల్స్ రాయిస్‌లను ఆహ్వానించారు. బహుశా కావేరీ ఇంజిన్ యొక్క 'కోర్' పైనే నిర్మాణం జరగనున్న 110 కె ఎన్ శక్తి గల ఇంజన్‌తో ఐదవ తరానికి చెందిన ఈ అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎ ఎమ్ సి ఎ) రానున్న దశాబ్దంలో తన సేవలు అందుబాటులోనికి తేనుంది. ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉండగా, దేశీయ తయారీ ఎల్ సి ఎ ఎమ్ కె 2 కోసం జి ఇ ఎఫ్-414 ఇంజన్‌ని ఖరారు చేయడం అంటే స్పష్టంగా అది అప్‌డేటెడ్ వెర్షన్‌కు ఎంపికవచ్చు అని తెలుస్తోంది.

భారత నావికాదళం కూడా తన కొత్త విమాన వాహక నౌకల కోసం విమానాలను పరిశీలిస్తోంది. ఇక మళ్ళీ జి ఇ ఎఫ్-414 ఇంజిన్‌లతో కూడిన బోయింగ్ ఎఫ్/ఎ-18 హార్నెట్ రేసులో ముందుంది. ఈ ఇంజన్ భారతదేశంలోనే తయారు చేయబడుతున్నందున, ఎఫ్/ఎ-18 కి ఒక స్పష్టమైన ఆధిక్యత ఉందని తెలుస్తూనే ఉంది.

అందువల్ల జి ఇ జెట్ ఇంజన్ ఒప్పందం అంటే స్వదేశీ ఇంజన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు పెద్ద ఎదురుదెబ్బ అవుతుంది. రాబోయే దశాబ్దకాలం పైగా ముఖ్యమైన భారతీయ యుద్ధ విమానాలకి ఎంపిక చేసే పవర్ ప్లాంట్ గా జి ఇ ఎఫ్ - 414 ఇంజన్ ఆధిపత్య స్థానంలో ఉంటుంది.

ఎంత బాగా గేమ్ ఆడావు అమెరికా!

*(అనువాదం: కె పుష్పవల్లి)*

❋

# పశ్చిమాసియాలో పట్టుకోల్పోతున్న ఇస్లామిక్ తీవ్రవాదం

తమీజ్ అహ్మద్



రచయిత పశ్చిమాసియా వ్యవహారాలపై నిపుణుడు, పత్రికా రచయిత

రాజకీయ ఇస్లాం దాని విభిన్న వ్యక్తీకరణలైన–సౌదీ అరేబియాలోని వహాబీ రాజ్యం, ముస్లిం బ్రదర్‌హుడ్, జిహాద్–నాలుగు దశాబ్దాల పాటు పశ్చిమాసియా రాజకీయాల్లో ఆధిపత్యం చెలాయించింది.

1960ల చివరలో అంటే 1967లో ఈజిప్షియన్, సిరియన్ సైన్యాల ఓటమి ప్రభావం, లౌకికవాద అరబ్ రిపబ్లిక్‌ల నుండి సౌదీ అరేబియా నేతృత్వంలోని రాచరికాలకు అనుకూలంగా మార్చినపుడు ఇస్లాం రాజకీయ ప్రభావం మొదటగా అనుభవంలోకి వచ్చింది. 1969లో రబాత్‌లో ఇస్లామిక్ దేశాల శిఖరాగ్ర సమావేశాన్ని ఏర్పాటు చేసి, 1972లో జెద్దా ఆధారిత ఇస్లామిక్ కాన్ఫరెన్స్ (ఓఐసి) ద్వారా ఇస్లామిక్ సమ్మేళనాన్ని సంస్థాగతీకరించడం ద్వారా అరబ్, ఇస్లామిక్ ప్రపంచాలకు నాయకత్వం వహించడంలో రాజ్యం ఏమాత్రం సమయాన్ని వృధా చేయలేదు.

**ఆఫ్ఘనిస్తాన్‌లో గ్లోబల్ జిహాద్**

1960లలో కొంతమంది అరబ్ మేధావులు ఇస్లాం సూత్రాలను ఉపయోగించి, రాజ్యం నియంత్రణకు అతీతంగా శత్రువులను ఎదిరించడానికి ఒక తీవ్రమైన భావజాలాన్ని అభివృద్ధి చేశారు. నిరంకుశ పాలకులు, పాశ్చాత్యశక్తులు వారికి రాజకీయ, ఆర్థిక, సైనిక మద్దతును అందించారు. ముస్లిం దేశాల్లో నాస్తికత్వ భావజాలాన్ని కల్పిస్తున్న సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా గ్లోబల్ జిహాద్‌ను రూపొందించేందుకు 1979లో రాజ్యం, ఇస్లాం ఛాందసవాదులు జోడీ కట్టారు. అందుకు వారు ఆఫ్ఘనిస్తాన్‌ను ఎంచుకున్నారు. ఒట్టొమన్ సుల్తాన్ 1914లో మొదట జిహాద్‌ను ప్రకటించాడు. తరువాత ప్రచ్ఛన్న యుద్ధంలో భాగస్వాములైన అమెరికా, సౌదీ అరేబియా, పాకిస్తాన్ దేశాల ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ దేశాలే దాదాపు అన్ని ముస్లిం దేశాలు, సమూహాలకు చెందిన వేలాది మంది ముస్లిం యువతకు ఆయుధాలు, యుద్ధ నైపుణ్య శిక్షణ, నిధులు సమకూర్చాయి. పశ్చిమ ఆసియాలోని దేశాలు ఒకరిని మించి ఒకరు పోటీపడి మరీ ఈ పవిత్ర యుద్ధవీరులను నాస్తికులతో పోరాడే జిహాద్‌లో పాల్గొనడానికి పంపారు. సౌదీ అరేబియాకు చెందిన ఒసామా బిన్ లాడెన్ ఈ జిహాద్ సంస్థ వ్యవహారాలను పర్యవేక్షించాడు. 1988లో అతను ఈ సంస్థకు అల్‌ఖైదా అనే పేరు పెట్టాడు.

ఆఫ్ఘనిస్తాన్‌లో ఈ జిహాద్ ఊహించని పరిణామాలకు దారితీసింది. 1989లో సోవియట్ సైన్యాల ఉపసంహరణ దేవుడు ఇచ్చిన గెలుపుగా, పాశ్చాత్య శక్తులకు వ్యతిరేకంగా ముస్లింలు సాధించిన మొదటి విజయంగా జిహాదీలు భావించారు. తరువాత ఆఫ్ఘనిస్తాన్ రాజ్యం జిహాదీల విశ్వాసాలకు శత్రువులుగా భావించే పశ్చిమాసియా పాలకులు, వారిని పోషిస్తున్న విదేశీ మదుపుదారులకు వ్యతిరేకంగా అంతర్జాతీయ జిహాద్ ఫౌండేషన్‌ను నెలకొల్పింది. తరువాతి 40 సంవత్సరాలు పశ్చిమాసియాలో రాజకీయ ఇస్లాంను పెంచిపోషించారు.

**రాజకీయ ఇస్లాం భావనలు**

ఇస్లామిక్ రాజ్య అధికారాన్ని ఏర్పాటు చేసే క్రమంలో ఈ జిహాదీ ప్రబోధకులు తాము ఇస్లాం సిద్ధాంతాలుగా భావిస్తున్నవాటిని ప్రచారం చేయడానికి రాజకీయ ఇస్లాం, ఇస్లామిజం అనే పదాలను ఉపయోగించారు. ప్రబోధకులు ఈ సిద్ధాంతాలను విశ్వాసపు స్వర్ణయుగం నుండి తెచ్చినవిగా వాదిస్తారు. ఇది ముస్లింల మొదటి మూడు తరాలుగా భావించే పవిత్రమైన పూర్వీకులు సలాఫ్ అల్ సాలిహ్ కాలానికి చెందినది. ఈ సాంప్రదాయాలను పాటించడం ద్వారా ఆధునిక ముస్లిం సమాజాన్ని నిర్మించవచ్చని కొందరు మేధావులు, ఇస్లామిస్టులు నమ్ముతారు. అందువల్ల ఇస్లామిజంను సలాఫిజం అని కూడా పిలుస్తారు. ఇస్లామిస్టులు ఒకే మూలాలు ప్రస్తావించినా, వారి అభిప్రాయాలు మాత్రం వేరువేరుగా ఉంటాయి. నేడు రాజకీయ ఇస్లాం మూడు రకాలుగా, శాంతియుత ఇస్లామిజం, యాక్టివిస్ట్ ఇస్లామిజం, అతివాద ఇస్లామిజంలుగా వర్గీకరించబడింది. శాంతియుత ఇస్లామిజం శుద్ధమైనది. ఇస్లాం యొక్క నిజమైన ప్రబోధాలను నమ్మేది. రాజకీయంగా పాలకులు నిరంకుశులైనా సరే వారికి నిబద్ధులై ఉండాలని చెబుతుంది. రాజుకు వ్యతిరేకమైన ఆలోచనలను తిరస్కరిస్తుంది. సౌదీ రాజ్యంలో ప్రజల భద్రత, సంక్షేమం కోసం వహాబీ సిద్ధాంతాలను పాటించేందుకు ఇది ఉపయోగపడింది. దాంతో అతనికి విశ్వాసబద్ధులుగా ఉండిపోయారు.

యాక్టివిస్ట్ ఇస్లామిజం ముస్లి బ్రదర్‌హుడ్ యొక్క భావజాలాన్ని ప్రతిబింబిస్తుంది. ముస్లిం ప్రపంచంలో పాశ్చాత్య సంస్కృతిని ఎదుర్కొనడానికి 1928లో హసన్ అల్ బన్నా అనే విద్యావేత్త బ్రదర్‌హుడ్ సంస్థను నెలకొల్పాడు. 'ఇస్లామిజానికి తిరిగిరండి' అని అల్ బన్నా పిలుపునిచ్చాడు. అతని ఉద్దేశ్యంలో ఇస్లాం అంటే "ఒక నమ్మకం – ఆచారం, ఒక జాతి – జాతీయత, ఒక మతం – ఒక రాజ్యం, స్ఫూర్తి, – ఒప్పందం, పవిత్ర పదం, ఖడ్గం". ఈజిప్టులో బ్రదర్‌హుడ్ సంస్థ ద్వారా పెద్ద సంఖ్యలో అనుయాయుల్ని పోగు చేసుకున్నారు. అయితే నియంతలైన అక్కడి రిపబ్లికన్ నాయకులు గమాల్ అబ్దుల్ నాసర్, అన్వర్ సాదత్, హోస్ని ముబారక్‌లు దీనిని రాజకీయ ప్రమాదంగా భావించారు. గత శతాబ్దంలో చాలా కాలం దీన్ని నిషేధించారు. దాని సభ్యులు అజ్ఞాతంలో ఉండి పునాదులను కాపాడుకున్నారు. ఈజిప్టులో స్వేచ్ఛా కార్యకలాపాలు సాగిస్తూ కొన్ని అరబ్ దేశాల్లో అనుబంధ సంస్థలను ఏర్పాటు చేసుకుంది.

> **❝ 2018లో యువరాజు తన దేశంలో లింగ విభజన, హిజాబ్, మహిళల డ్రైవింగ్‌పై ఆంక్షలను తొలగించి, సినిమా, సంగీతం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను మిశ్రమ ప్రేక్ష కుల కోసం అనుమతించడంతో వహాబిజం నుండి మార్పు ప్రారంభమైంది. ఇంతకు ముందు ఇస్లాం పేరుతో సామాజిక ఆంక్షలను అమలు చేసిన ఉలేమాలు ఇప్పుడు ఈ రాచరికపు సడలింపులు ఇస్లామిక్ సిద్ధాంతాలచే నిషేధించ బడలేదని నొక్కిచెప్పారు. ❞**

1980ల నుండి వివిధ అరబ్ దేశాల్లోని బ్రదర్‌హుడ్ సంస్థ యువ సభ్యులు అక్కడి ఇస్లాం మూలాల ఆధారంగా ఇస్లాం సిద్ధాంతాలను అర్ధం చేసుకుని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంతో మిళితం చేసుకోవడం మొదలుపెట్టారు. ప్రజా సంక్షేమానికి ప్రధాన పాత్ర ఇచ్చారు. మత స్వేచ్ఛ, సమానత్వం, బహుముఖత్వం, పాలకుల బాధ్యతగా భావిం చారు.

భారత మేధావి, రాజకీయ నాయకుడు మౌలానా అబుల్ అలా మౌదుది, ఈజిప్టియన్ విద్యావేత్త సయ్యద్ కుతుబ్ జీహాద్‌ను దేవుని ఆజ్ఞను భూమిపై నెలకొల్పడానికి సాధనంగా భావించారు. 20వ శతాబ్ధపు మధ్యకాలంలో తీవ్రవాద ఇస్లాం స్థానాన్ని ఆధునిక మేధావుల ఆలోచనలు ఆక్రమించడం మొదలుపెట్టాయి. దేవుని కూటమి పేరుతో పూర్తి విప్లవం అంటూ హింసకు పాల్పడే విధానాలకు సయ్యద్ ఖుతుబ్ పిలుపిచ్చాడు. దేవుని శత్రువులతో రాజీ పడే అవకాశం లేదు. ఈ రాజకీయ ఇస్లామిస్టుల చర్యలు పశ్చిమ ఆసియా రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపాయో పరిశీలిద్దాం.

**సౌదీలో రూపుదిద్దుకున్న వహాబిజం**

మధ్య అరేబియాలోని నజిద్‌లో 18వ శతాబ్దంలో మొదటి సౌదీ దేశం ఏర్పాటైంది. మతపెద్దలతో కుదిరిన రాజీ ధోరణితో దిరియా పాలకుడైన మతపెద్ద షేక్ మొహమ్మద్ అబ్దుల్ వహాబ్ దాని వ్యవస్థాపక ప్రవక్తగా చేసిన ప్రభోదాల ఆధారంగా ఇది ఏర్పాటైంది. రాజ్యానికి ప్రవక్తలకు మధ్య అనుబంధం 20వ శతాబ్దంలో కూడా, అంటే 1932లో రాజు అబ్దుల్ అజీజ్ మూడవ సౌదీ అరేబియా దేశాన్ని ఏర్పరచిన సమయంలో కూడా కొనసాగింది. ఈ అనుబంధం పాలనకు విశ్వాస ఆధారిత చట్టబద్ధతను అందించింది. మహ్మద్ అబ్దుల్ వహాబ్ ద్వారా ప్రచారం చేయబడిన ఇస్లాం సిద్ధాంతాలు (వహాబిజం అని పిలుస్తారు) ఇస్లాం యొక్క అత్యంత సంకుచితమైన అవగాహనను ప్రతిబింబిస్తాయి. ఆధునిక సౌదీ రాజ్యంలో విద్య, న్యాయ వ్యవస్థ, సామాజిక, సాంస్కృతిక అంశాలలో వహాబీ మత పెద్దలు అపరిమితమైన ప్రభావాన్ని కలిగి ఉంటారు. పాలకుల రాజకీయ, ఆర్థిక విధానాలకు సిద్ధాంతపరమైన మద్దతును అందిస్తారు. ఈ అసాధారణ ఏర్పాటు ప్రజల ప్రవర్తనపై (నిరాడంబర వస్త్రధారణ, స్వేచ్ఛపై ఆంక్షలు, వాహనాలు నడపడంపై నిషేధం, లింగ విభజన తదితరాలలో మహిళలపై ) కఠినమైన నిబంధనలను అమలు చేసింది. ఇస్లాం యొక్క ప్రధాన సిద్ధాంతాల నుండి తీసుకున్నవిగా సమర్ధించబడినప్పటికీ ఈ విధానాలు ప్రజలను అణచివేయడానికి పాలకులకు బలమైన సాధనంగా ఉన్నాయి. ఈ కాలంలో సౌదీ అరేబియా ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో తన ఇస్లాం బ్రాండ్‌ను ప్రచారం చేయడంలో అగ్రగామిగా ఉంది. మసీదులు, మత గురువులు, విద్య, స్కాలర్‌షిప్‌లు మొదలైన వాటికి ఉదారంగా నిధులు సమకూర్చింది. ఇది వివిధ దేశాలలో రాజ్యానికి బలమైన మద్దతును అందించింది.

**వహాబిజాన్ని విడిచిపెట్టిన సౌదీ అరేబియా**

ఫిబ్రవరి 22ను దేశం యొక్క "స్థాపక దినోత్సవం"గా ప్రకటిస్తూ గత సంవత్సరం జనవరి 27న సౌదీ పాలకుడు కింగ్ సల్మాన్ బిన్ అబ్దుల్ అజీజ్ రాజ ఉత్తర్వును జారీ చేశారు. అంటే అతని పూర్వీకుడు మహమ్మద్ ఇబ్న్ సౌద్ మొదటి సౌదీ దేశాన్ని స్థాపించిన రోజు. ఆ రోజు జ్ఞాపకార్థం ఒక లోగో కూడా ప్రచురించబడింది. దానికి నాలుగు చిహ్నాలు ఉన్నాయి: ఖర్జూరాలు – పెరుగుదల, దాతృత్వాన్ని సూచిస్తాయి. మజ్లిస్ కౌన్సిల్ – ఐక్యత, సామాజిక, సాంస్కృతిక సామరస్యాన్ని సూచిస్తుంది. అరేబియా గుర్రం – ధైర్యం, శౌర్యాన్ని సూచిస్తుంది. ఒక మార్కెట్ – ఆర్థిక కార్యకలాపాలు, పారదర్శకత, వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ జాతీయ చిహ్నంలో మతాన్ని ప్రస్తావించలేదు.

"స్థాపక దినోత్సవం" సౌదీ దేశం యొక్క కేంద్ర వ్యవస్థాపక కథనాన్ని తారుమారు చేసింది: మొహమ్మద్ ఇబ్న్ సౌద్, మత గురువు షేక్ మొహమ్మద్ ఇబ్న్ అబ్దుల్ వహాబ్ మధ్య "ఒడంబడిక" తరువాత 1744లో మొదటి సౌదీ రాజ్యం ఉనికిలోకి వచ్చిందని అప్పటి వరకు ఉన్న జాతీయ కథనం పేర్కొంది. ఇప్పుడు వహాబిజంతో రాజ్య అనుబంధం యొక్క ప్రాముఖ్యతను జాతీయ కథనం నుండి మినహాయించినప్పటికీ, రాజ్యం పునాది 27 సంవత్సరాలు వెనుకబడే ఉంది. 2018లో యువరాజు తన దేశంలో లింగ విభజన, హిజాబ్, మహిళల డ్రైవింగ్‌పై ఆంక్షలను తొలగించి, సినిమా, సంగీతం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను మిశ్రమ ప్రేక్షకుల కోసం అనుమతించడంతో వహాబిజం నుండి మార్పు ప్రారంభమైంది. ఇంతకు ముందు ఇస్లాం పేరుతో సామాజిక ఆంక్షలను అమలు చేసిన ఉలేమాలు ఇప్పుడు ఈ రాచరికపు సడలింపులు ఇస్లామిక్ సిద్ధాంతాలచే నిషేధించ బడలేదని నొక్కిచెప్పారు. ఈ కొత్త సౌదీ విధానం ద్వంద్వ ప్రయోజనానికి ఉపయోగపడుతుంది: ఒకటి, కొత్త ఉదారవాద వాతావరణంలో యువరాజుకు తన దేశంలోని యువకులతో సంబంధాలను మరింతగా పెంచుతుంది. రెండు, జాతీయ విధానాల నుండి మత విశ్వాసాలను తొలగించడం బ్రదర్‌హుడ్‌ను మరింత బలహీనపర్చడానికి ఉపయోగ పడుతుంది. సౌదీ ఇస్లామిక్ వ్యవహారాల మంత్రి ఈ కొత్త నిబంధనలు "ఉగ్రవాదాన్ని తిరస్కరించే మితవాద దేశం"ను ప్రతిబింబి స్తున్నాయని వివరించారు. యాస్మిన్ ఫరూక్, నాథన్ బ్రౌన్ వివరించినట్లుగా సౌదీ దృక్పథం లో, "తీవ్రవాదానికి, ఫిరాయింపులకు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడడం ముస్లిం బ్రదర్‌హుడ్‌పై పోరాటంతో సమానం".

**ముస్లిం బ్రదర్‌హుడ్ అధికారం**

బ్రదర్‌హుడ్ భావజాలంతో అనుబంధం గా ఉన్న ఇస్లామిస్ట్ పార్టీలు మొదట్లో అరబ్ విజయగాథగా వర్ణించబడ్డాయి. ట్యునీషియాలో 2010 డిసెంబరులో తిరుగుబాట్లు ప్రారంభ మైన తర్వాత నిషేధించబడిన ఇస్లామిస్ట్ ఎన్నహ్దా పార్టీ, బహిష్కరించబడిన దాని నాయకులు 2011లో జరిగిన ఎన్నికలలో 37 శాతం ఓట్లను పొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. తరువాత 2016లో ఎన్నాహ్దా తన ఇస్లామిక్ గుర్తింపును తొలగించింది. ఐరోపాలోని క్రిస్టియన్ డెమోక్రటిక్ పార్టీల తరహాలో తనను

తాను 'ఇస్లామిక్ డెమోక్రటిక్' పార్టీగా ప్రకటించుకుంది.

ఏది ఏమైనప్పటికీ గత శతాబ్దం చివరలో పేర్కొన్న విధంగా 2000 దశకం ప్రారంభంలో ఈజిప్టులో బ్రదర్‌హుడ్ మేధావులు తమ సంస్థను ఆధునిక ప్రజాస్వామిక ఆలోచన లతో నింపడానికి ప్రయత్నించినట్లుగా అసం తృప్త బ్రదర్‌హుడ్ సభ్యుని వ్యాఖ్యలతో వెల్లడైంది. "'పాతకాలం నాటి దృఢమైన, నిస్సారమైన, మార్పులేని భావజాలానికి' కట్టుబడి ఉన్న సాంప్రదాయ పండితులకు సంస్థలో వాస్తవ అధికారం ఇవ్వబడింది".

2011 ఫిబ్రవరిలో ఈజిప్ట్‌లో అరబ్ స్ప్రింగ్ తిరుగుబాట్లు, స్వేచ్ఛా ఎన్నికలు, పాలనా సవాళ్లకు వారు సంసిద్ధంగా ఉండకపోవటం హోస్నీ ముబారక్ పతనానికి దారితీసింది. తిరుగుబాట్ల నేపథ్యంలో బ్రదర్‌హుడ్ సంస్థ చట్టబద్ధం చేయబడి ఫ్రీడమ్ అండ్ జస్టిస్ పార్టీని స్థాపించింది. దేశంలో అత్యుత్తమ వ్యవస్థీకృత రాజకీయ ఉద్యమంగా పార్టీ 2011-12 ఎన్నికలలో 42 శాతం అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంది. ఆపై దాని అభ్యర్థి మహమ్మద్ మోర్సీ అధ్యక్ష ఎన్నికలలో స్వల్ప తేడాతో విజయం సాధిం చారు. అయితే 2012-13లో అధికారంలో ఉన్న బ్రదర్‌హుడ్ తన పదవీ కాలం అంతా రాజకీయ అనుభవరాహిత్యాన్ని ప్రదర్శించడం తో అపఖ్యాతిని మూటకట్టు కుంది. రెండు గల్ఫ్ దేశాలు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఈ), ఈజిప్ట్ అంతటా విస్తృతంగా మోర్సీ వ్యతిరేక ప్రదర్శనలకు నిధులు సమకూర్చాయి, ఇది జూలై 3, 2013న మాజీ రక్షణ మంత్రి జనరల్ అబ్దెల్ ఫతాహ్ ఎల్‌సిసి నేతృత్వంలో సైనిక దళాలు అధికారాన్ని స్వాధీనం చేసుకునేందుకు దారితీసింది. ఆగస్ట్‌లో కైరోలోని రబా స్క్వేర్‌లో అనేక వందల మంది బ్రదర్‌హుడ్ సభ్యులను హతమార్చడం ద్వారా తాము ఎలాంటి అసమ్మతిని సహించబోమని సాయుధ దళాలు స్పష్టం చేశాయి. 60,000 మంది వ్యక్తులు, ఎక్కువగా బ్రదర్‌హుడ్ సభ్యులు ఖైదు చేయబడ్డారు. మాజీ అధ్యక్షుడు మోర్సీ జూన్ 2019లో జైలులో మరణించారు. "ఈజిప్ట్ నేడు హోస్నీ ముబారక్ నేతృత్వంలోని నియంతృత్వ పాలన చీకటి రోజులను మించిపోయింది" అని నాదర్ హాషేమీ వ్రాశారు.

### యాక్టివిస్ట్ ఇస్లామిజానికి వ్యతిరేకంగా గల్ఫ్ రాచరికాలు

రెండు గల్ఫ్ రాచరికాలు ఆధునిక ప్రజాస్వామ్యంతో ఇస్లామిక్ సూత్రాలను అనుసంధానించే భావజాలాన్ని సమర్థించే బ్రదర్‌హుడ్‌ను తమ "నిశ్శబ్ద" రాజకీయ అస్తిత్వానికి ముప్పుగా పరిగణించాయి. మోర్సీ ప్రభుత్వానికి రాజకీయంగా అనుభవం లేక తప్పులు చేయడంతో ప్రజలను దూరం చేయటం రాచరికాలకు సులభమైంది. ప్రభు త్వం మరో రెండేళ్లు అధికారంలో కొనసాగితే, పాలనాపరమైన సమస్యలపై పట్టు సాధిస్తుం దని, సిద్ధాంతపరంగా సరళత్వానికి మారి, సొంత పునాదిని నిర్మించుకోవచ్చని భయపడ్డారు.

సౌదీ అరేబియా, యుఎఈ కూడా ట్యునీషియాలో ప్రజాస్వామ్య ప్రయోగాన్ని అణగదొక్కడంలో ప్రధాన పాత్ర పోషించాయి. ఇక్కడ బీట్ నోయిర్ ఇస్లామిస్ట్ ఎన్నాహ్దా పార్టీ తన భావజాలంలోని ఇస్లామిక్ భాగాన్ని కుదించడాన్ని ఈజిప్టు అనుభవం నుండి నేర్చుకున్నది. సౌదీ, యుఏఈలు ఎన్నాహ్దాను ఎదుర్కోవడానికి 2014 నుండి లౌకిక, జాతీయవాద, ఇస్లాం వ్యతిరేక నిదాటోన్స్ పార్టీకి నిధులు సమకూర్చడం ప్రారంభిం చాయి. 2014 ఎన్నికలలో అది పొందిన ఓట్లు ఎన్నాహ్దా ఓటు పునాదిని దెబ్బకొట్టటానికి, ఎన్నాహ్దాతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి వీలు కల్పించాయి. అయినప్పటికీ ఇస్లామిస్ట్, ఉదారవాద పార్టీల మధ్య ఏకాభిప్రాయం సంస్కరణలకు దారితీయలేదు.

2019 అధ్యక్ష ఎన్నికలలో ఎటువంటి రాజకీయ నేపథ్యం లేని విద్యావేత్త కైస్ సయీద్‌ను అధ్యక్షుడిగా అధికారంలోకి తీసుకువచ్చాయి. అతను వెంటనే స్తంభించి పోయిన రాజకీయ వ్యవస్థ పట్ల తన అసంతృప్తిని, జాతీయ అసెంబ్లీ సభ్యులలో విస్తృతమైన అవినీతిపై తన "అసహ్యాన్ని" వ్యక్తం చేశాడు. వారిని "రాక్షసులు" మరియు "వేట పక్షులు" అని పేర్కొన్నాడు. జూలై 2021లో అసెంబ్లీని రద్దు చేసి, అధ్యక్షుడు పూర్తి అధికా రాలను స్వీకరించడం ద్వారా ట్యునీషియా ప్రజాస్వామ్య క్రమానికి ముగింపు పలికారు. రాష్ట్రపతి అధికారాలను పొందుపరచడానికి 2022 ఆగష్టులో ఏకంగా రాజ్యాంగాన్ని సవరించాడు. గల్ఫ్, ఈజిప్షియన్ మీడియా సయీద్ రాజ్యాంగ తిరుగుబాటును రాజకీయ ఇస్లాం ఓటమిగా ప్రచారం చేసింది. ఎందుకంటే సారా యెర్క్స్ గుర్తించినట్లుగా, "రాజకీయ ఇస్లాం ప్రజాస్వామ్యానికి అనుకూలంగా ఉంటుందని ఎన్నాహ్దా నిరూపించింది".

ఈజిప్ట్ రెండు గల్ఫ్ రాచరిక దేశాలతో కలిసి సూడాన్‌లో అత్యంత తీవ్రంగా జోక్యం చేసుకుంది. 1989 నుండి సుడాన్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఒమర్ అల్-బషీర్ -రాజకీయ ఇస్లాం వైపు మొగ్గు కలిగి ఉన్నాడని నమ్ముతారు. సౌదీ అరేబియా, యుఏఈ ఉదారంగా అభివృద్ధికి సహాయపడే పేరుతో అతనిని గెలవడానికి ప్రయత్నించాయి. రెండు దేశాలు 2017 జూన్ నుండి ఖతార్‌పై దిగ్బంధనాన్ని ప్రారంభించినప్పుడు, అల్-బషీర్ ఖతార్‌తో తన సంబంధాలను స్థంభింప జేసినట్లు అనిపించింది.

అందువల్ల 2019 ఏప్రిల్‌లో అల్ బషీర్‌ను పదవిలో నుండి దించిన సైనిక అధికారులకు ఆర్మీ చీఫ్ జనరల్ అబ్దెల్ ఫత్తా అల్-బుర్హాన్, పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ అధిపతి జనరల్ మొహమ్మద్ హమ్దాన్ దగాలోకు మద్దతు ఇచ్చారు. తిరుగుబాటు తరువాత బ్రదర్‌హుడ్‌తో సంబంధం ఉన్న అనేక మంది వ్యక్తులను అరెస్టు చేశారు. తరువాత రెండు రాచరిక దేశాలు 2021 అక్టోబర్‌లో ప్రధానమంత్రికి వ్యతిరేకంగా సైనిక తిరుగుబాటుకు మద్దతు ఇవ్వడం ద్వారా సుడాన్ ప్రజాస్వామ్య ప్రయోగాన్ని ముగించ డంలో సహాయపడ్డాయి.

కానీ వారు అనుకున్నట్లుగా పరిణా మాలు జరగలేదు: ఇద్దరు సైనిక రక్షకులు 2023 ఏప్రిల్‌లో ఓటమి పాలై సూడాన్‌ను రక్తపాత, విధ్వంసక పౌర సంఘర్షణలో ముంచారు.

లిబియాలో ప్రజల మధ్య ఘర్షణలు పెంపొందించడంలో యుఏఈ, ఈజిప్టులు చురుకుగా పాల్గొన్నాయి. ట్రిపోలీలో

**"సౌదీ అరేబియా, యుఎఈ కూడా ట్యునీషియాలో ప్రజాస్వామ్య ప్రయోగాన్ని అణగదొక్కడంలో ప్రధాన పాత్ర పోషించాయి. ఇక్కడ బీట్ నోయిర్ ఇస్లామిస్ట్ ఎన్నాహ్దా పార్టీ తన భావజాలంలోని ఇస్లామిక్ భాగాన్ని కుదించడాన్ని ఈజిప్టు అనుభవం నుండి నేర్చుకున్నది. సౌదీ, యుఏఈలు ఎన్నాహ్దాను ఎదుర్కోవడానికి 2014 నుండి లౌకిక, జాతీయవాద, ఇస్లాం వ్యతిరేక నిదాటోన్స్ పార్టీకి నిధులు సమకూర్చడం ప్రారంభించాయి."**

**❝ లిబియాలో ప్రజల మధ్య ఘర్షణలు పెంపొందించడంలో యుఏఈ, ఈజిప్టులు చురుకుగా పాల్గొన్నాయి. ట్రిపోలీలో పరిపాలనపై ఆధిపత్యం చెలాయించే ఇస్లామిస్ట్ బలగాలు దేశాన్ని స్వాధీనం చేసుకోకుండా టోబ్రూక్‌లో అధికార యంత్రాంగానికి మద్దతు ఇచ్చాయి. 2019లో ట్రిపోలీలో పరిపాలనను సైన్యం స్వాధీనం చేసుకునేందుకు మద్దతు ఇచ్చారు. అది విఫలమైన తర్వాత నుండి ఇప్పటి వరకు దేశంలో రాజకీయ ప్రతిష్టంభన కొనసాగుతోంది. ❞**

పరిపాలనపై ఆధిపత్యం చెలాయించే ఇస్లామిస్ట్ బలగాలు దేశాన్ని స్వాధీనం చేసుకోకుండా టోబ్రూక్‌లో అధికార యంత్రాంగానికి మద్దతు ఇచ్చాయి. 2019లో ట్రిపోలీలో పరిపాలనను సైన్యం స్వాధీనం చేసుకునేందుకు మద్దతు ఇచ్చారు. అది విఫలమైన తర్వాత నుండి ఇప్పటి వరకు దేశంలో రాజకీయ ప్రతిష్టంభన కొనసాగుతోంది.

ముస్లిం బ్రదర్‌హుడ్ ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ ఇస్లాం ఇప్పుడు అత్యల్ప స్థాయికి చేరుకున్నట్లు కనిపిస్తోంది. ఈజిప్టులో ఉద్యమం పూర్తిగా కూలిపోయింది. ఒక పరిశీలకుడు దీన్ని గురించి "చాలా అంతరా యం కలిగింది, ఎటువంటి వ్యవస్థీకృత కార్యకలాపాలు లేవు" అని వ్యాఖ్యానించాడు. తమ నాయకులు పిడివాదం, తప్పుల నుండి పాఠం నేర్చుకునేందుకు సిద్ధంగా లేనందున దానిలోని చాలా మంది యువ సభ్యులు తీవ్ర విమర్శకులుగా మారారు. అల్ ఖైదా లేదా ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐసిస్)చే ప్రాతి నిధ్యం వహిస్తున్న రాడికలిజం వైపు మొగ్గు చూపారు.

– రాజకీయ ఇస్లాం లేదా ఇస్లామిజం అనేది ఇస్లామిక్ రాజకీయ క్రమాన్ని రూపొందించడానికి వారి ప్రబోధకులు ఉపయోగించే ఇస్లాం సిద్ధాంతాలు, సిద్ధాంతా లను వివరించడానికి ఉపయోగించే పదాలు.

– రాజకీయ ఇస్లాం దాని విభిన్న వ్యక్తీకరణలు–సౌదీ అరేబియాలోని వహాబీ, ముస్లిం బ్రదర్‌హుడ్, జిహాద్–నాలుగు దశాబ్దాలుగా పశ్చిమాసియా రాజకీయాల్లో ఆధిపత్యం చెలాయించాయి.

– పైన పేర్కొన్న మూడు శక్తులు పశ్చిమాసియాలో తిరోగమనంలో ఉన్నందున, మనం ఈ ప్రాంతంలో ఇస్లామిస్టు అనంతర క్రమాన్ని చూస్తున్నామా?

**జిహాద్ విధ్వంసం**

రాజకీయ ఇస్లాం యొక్క అత్యంత నాటకీయ, అత్యంత వివాదాస్పద వ్యక్తీకరణ జిహాద్. అల్ ఖైదా, ఇస్లామిక్ స్టేట్ అనే దాని రెండు అంతర్జాతీయ సంస్థల అనాలోచిత హింస, క్రూరత్వాలను గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు టెలివిజన్ స్క్రీన్‌లపై చూస్తున్నారు. జిహాదీ హింస రాజకీయ ఇస్లాంతో అనేక దేశాలలో ఉన్మాదమైన ఇస్లామోఫోబియాను పెంచి పోషించింది.

1989లో సోవియట్ యూనియన్ ఆఫ్ఘనిస్తాన్ నుండి వైదొలిగినప్పుడు అమెరికాతో ఘర్షణ తనకు దేవుడు ఇచ్చిన వరంగా ఒసామా బిన్ లాడెన్ భావించాడు. 2001, సెప్టెంబరు 11న అమెరికాపై దాడులు జరిపారు. తర్వాత అమెరికా ఎదురుదాడుల నేపథ్యంలో అల్‌ఖైదా, వారి తాలిబాన్ భాగస్వాములు పాకిస్థాన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆశ్రయం పొందారు. పాకిస్తాన్‌లో అంతకు ముందు పటిష్టంగా నియంత్రించబడిన కేంద్రీకృత సంస్థ అల్‌ఖైదా తనను తాను పునర్నిర్మించుకుంది. ఇది ఇప్పుడు పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికాలోని వివిధ ప్రాంతాలలో–ఇరాక్, యెమెన్, సోమాలియా, దక్షిణ అల్జీరియా, మాలి, నైజీరియా– స్థానికంగా సంబంధాలను కలిగి ఉంది. వారు 2000లలో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో అనేక హేయమైన దాడులు నిర్వహించారు.

ఒసామా బిన్ లాడెన్‌ను మే 2011లో అమెరికా ప్రత్యేక దళాల బృందం హత మార్చింది. అల్‌ఖైదా నాయకత్వం అతని దీర్ఘకాల సహచరుడు, సంస్థ యొక్క ప్రధాన సిద్ధాంతకర్త కూడా అయిన ఐమాన్ అల్–జవహరి చేపట్టాడు. కానీ అల్‌ఖైదా అనతి కాలంలోనే విధ్వంస ఐసిస్‌తో మరుగున పడిపోయింది. 2015లో అధ్యక్షుడు ఒబామా "ఐసిస్ మన ఇరాక్ దండయాత్ర (2003) నుండి పెరిగింది, ఊహించని పరిణామాలకు ఇది ఉదాహరణ" అని చెప్పాడు.

2003లో అమెరికా సైనిక దాడితో దేశాన్ని ఆక్రమించడం ఫలితంగా ఇరాక్ రాజకీయ పరిణామాల క్రమంలో ఏర్పడిన సంస్థ ఐసిస్. విభజించి పాలించే విధానాలలో భాగంగా ఇరాక్ లోని షియా తెగకు ప్రత్యేక హక్కులు కల్పించడం వల్ల దేశంలో మతోన్మాద అబూ ముసాబ్ జర్కావీ ఆధ్వర్యంలో 'ఇరాక్ అల్ ఖైదా' అనే మొదటి జిహాదీ సంస్థ ఏర్పడింది. 2007లో ఇది ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్‌గా మారింది. 2013లో ఇరాక్‌లోని జిహాదీలు సరిహద్దు దాటి అస్సాద్ వ్యతిరేక ఘర్షణలలో చేరడంతో ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్, సిరియాగా (ఐసిస్) పరిణామం చెందింది,

2014 – 2016 మధ్య అబూ బకర్ అల్–బాగ్దాదీ ఆధ్వర్యంలో 60 నుండి 90 లక్షల జనాభా, 2,00,000 మంది సైన్యంతో బ్రిటన్ పరిమాణంలో ఒక ప్రోటో–స్టేట్‌ను రూపొందించడంలో సహాయపడిన భయంకరమైన హింసాత్మక విధానాల ద్వారా ఐసిస్ ఇరాక్, సిరియా అంతటా 'కాలిఫేట్'ని ఏర్పాటు చేసింది. ఇది చమురు అమ్మకాలు, తమ ఆధీనంలోని ప్రాంతంలో వసూళ్ళ ద్వారా లక్షలాది డాలర్ల ఖజానాను కలిగి, ప్రపంచంలోనే అత్యంత సంపన్న తీవ్రవాద సంస్థగా మారింది. గెర్జెన్ మాటల్లో చెప్పాలంటే, "జీవితంలో ఒక గొప్ప ఉద్దేశ్యం: ఇస్లామిక్ ఐక్యతను పునరుద్ధరించడానికి, విముక్తి, మోక్షాన్ని తీసుకురావడంలో సహాయపడే చారిత్రక మిషన్‌లో భాగం" అని ఐసిస్ వేలాది మంది ముస్లిం యువకులను ఆకర్షించింది. ఇది ఆత్మాహుతి బాంబర్లను అందించింది, వీరిలో వందల మంది "బలిదానాల కార్యకలాపాలు" నిర్వహించారు.

ఐసిస్ భావజాలం, కార్యకలాపాల పరంగా అల్ ఖైదాకు ప్రత్యర్థిగా తనను తాను అంచనా వేసుకుంది. ముఖ్యంగా అల్ ఖైదా 'దూర శత్రువు'పై దృష్టి సారిస్తుండగా, అల్–బాగ్దాదీ ఇప్పుడు 'సమీప శత్రువు'పై దృష్టి సారించాడు. గుర్తింపు రాజకీయాలకు, ప్రత్యేకించి తన కూటమి గుర్తింపుకు ప్రాధాన్యత ఇచ్చాడు. ఇరాక్‌లోని షియాలపై అసాధారణ హింసను సృష్టించడం ద్వారా అల్–బాగ్దాదీ జర్కావీ అడుగుజాడలను అనుసరించాడు.

**తిరోగమనంలో జిహాద్**

2022, జులై 31న కాబూల్‌లోని నివాసంపై అమెరికా జరిపిన క్షిపణి దాడిలో ఐమన్ అల్–జవహరి మరణించాడు. అతని దశాబ్దకాల నాయకత్వంలో అల్‌ఖైదా క్రమంగా క్షీణించింది. డేనియల్ బైమాన్ గుర్తించినట్లుగా కొన్ని అనుబంధ సంస్థలచే చెదురుమదురు

దాడులు జరిగినప్పటికీ, ప్రధాన దళాలు పాశ్చాత్య లక్ష్యాలపై ఎటువంటి అద్భుతమైన దాడులను నిర్వహించలేదు. కోల్ బంజెల్ మాట్లాడుతూ జవహరి "అయోమయ స్థితిలో ఉన్న సంస్థ"ని విడిచిపెట్టాడు.

ఐసిస్ కూడా మెరుగైన ఫలితాలు సాధించలేదు. ఐసిస్ 2015–17 సమయంలో అమెరికా మార్గదర్శకత్వంలో సుశిక్షితులైన ఇరాకీ సాయుధ దళాలకు ఇరాక్‌లోని భూభాగాన్ని క్రమంగా కోల్పోయింది. జూలై 2017లో మోసుల్‌ను తిరిగి స్వాధీనం చేసు కుంది. ఇరాక్ ప్రధానమంత్రి హైదర్ అల్–అబాది డిసెంబర్ 2017లో యుద్ధం ముగిసి నట్లు ప్రకటించారు.

❝ ఐసిస్ కూడా మెరుగైన ఫలితాలు సాధించలేదు. ఐసిస్ 2015-17 సమయంలో అమెరికా మార్గదర్శకత్వంలో సుశిక్షితులైన ఇరాకీ సాయుధ దళాలకు ఇరాక్‌లోని భూభాగాన్ని క్రమంగా కోల్పోయింది. జూలై 2017లో మోసుల్‌ను తిరిగి స్వాధీనం చేసు కుంది. ఇరాక్ ప్రధాన మంత్రి హైదర్ అల్-అబాది డిసెంబర్ 2017లో యుద్ధం ముగిసి నట్లు ప్రకటించారు. ❞

సిరియాలోని కుర్దిష్ సిరియన్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఎస్‌డిఎఫ్)ని సమీకరించి ఐసిస్ నియంత్రణలో ఉన్న ప్రధాన పట్టణాలను అమెరికా తిరిగి స్వాధీనం చేసుకుంది. 2016లో మన్‌బిజ్, 2017లో రక్కా, 2019లో చివరి బలమైన కోట బగౌజ్‌లను స్వాధీనం చేసుకుంది. 2019 అక్టోబర్‌లో సిరియాలోని ఇడ్‌లిబ్ ప్రావిన్స్‌లోని బరిషా వద్ద అమెరికా బలగాలు అల్ బగ్దాదీని ఖైదు చేయగా ఆత్మాహుతి చేసుకున్నాడు.

అంతర్జాతీయ జిహాద్ దృక్పథం అస్పష్టంగా ఉంది. జవహరి కాబూల్‌లో నివసిస్తున్నప్పటికీ అల్‌ఖైదాను దేశంలో విస్తరించ డానికి పరిమితమైన ప్రయత్నమే జరిగింది. జులై 2022లో అమెరికా బృందాన్ని ఉటంకిస్తూ బంజెల్ "ఆఫ్ఘన్ నేల నుండి బాహ్య దాడులకు కుట్ర పన్నకుండా అల్‌ఖైదాను తాలిబాన్ నిలువరించింది." అని వ్యాఖ్యానించాడు. అల్‌ఖైదాకు ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రధాన సభ్యులు డజను మంది మాత్రమే ఉన్నారని గత ఏడాది ఆగస్టులో ఒక అమెరికన్ అధికారి చెప్పారు.

ఇరాక్, సిరియాలలో అడపాదడపా హింసాత్మక చర్యలకు పాల్పడే కొద్దిమందికి ఐసిస్ కుదించబడింది. రెండు పొరుగు దేశాల వెలుపల ఎటువంటి కార్యకలాపాలు లేవు. ఆఫ్ఘనిస్తాన్‌లోని 'ఇస్లామిక్ స్టేట్–ఖొరాసన్' పేరు ఉన్నప్పటికీ, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌ల నుండి దాని సభ్యులలో ఎక్కువ మంది ఆకర్షితులయారు. వారు ఆఫ్ఘనిస్తాన్‌లోని వివిధ ప్రాంతాలలో దాడులు చేస్తారు. కానీ తాలిబాన్ లకు శత్రువులుగా, వారి మధ్య తరచూ పోరా టాలు జరుగుతున్నట్లు నివేదికలు ఉన్నాయి.

పాశ్చాత్య దేశాలలో జిహాదీ హింసకు ప్రధాన కారణం తీవ్రవాద సంస్థలతో ఎలాంటి సంబంధాలు లేని స్వీయ–రాడికలైజ్ వ్యక్తుల "ఒంటరి తోడేలు" దాడులు. ఇటీవలి కాలంలో లండన్‌లో కత్తిపోట్లు, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్‌లోని పారిస్, కాన్ఫ్లాన్స్–సెయింట్–హానోరిన్, నైస్, జర్మనీలో డ్రెస్డెన్, అమెరికాలోని వివిధ ప్రాంతాల్లో ఇస్లామిక్ తీవ్రవాదులు కాల్పులు జరిపారు.

నేడు వ్యవస్థీకృత జిహాదీ కార్యకలాపాల యొక్క ప్రధాన ప్రాంతం సబ్–సహారా ఆఫ్రికా. సోమాలియా, మాలి, నైజర్, బుర్కినా ఫాసో లను కలిపే భూభాగం, లేక్ చాడ్, ఈశాన్య నైజీరియా చుట్టూ ఉన్న ప్రాంతాలలో కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. ఈ భూభాగాల్లోని మిలిటెంట్ గ్రూపులు ఇస్లాం పేరుతో పనిచేస్తుండగా, ఉనికిలో లేని పాలనకు సంబంధించిన స్థానిక ఫిర్యాదులు, సేవలు, ఆర్థిక అవకాశాలను అందించడంలో ప్రభుత్వాల వైఫల్యం తదితరాల వలన వారికి మద్దతు లభిస్తున్నది. వారిలో ఎవరికీ వారి స్థావరాల వెలుపలకు దాడులను విస్తరించే సామర్థ్యం, ఆసక్తి లేవు.

**ముఖ్యాంశాలు**

**పోస్ట్–ఇస్లామిజం: దృక్పథం–అధ్యయనం**

1996లో అమెరికా ఆధారిత ఇరానియన్ పండితుడు అసెఫ్ బయెత్, "పోస్ట్–ఇస్లామిజం"– ఇస్లామిజం తర్వాత– అనే పదాన్ని ఉపయోగించాడు, దీనిని "రాజకీయ, సామాజిక స్థితిగా అభివర్ణించాడు. ఇక్కడ ఒక దశ ప్రయోగాల తరువాత ఇస్లామిజం ఆకర్షణ, శక్తి, చట్టబద్ధత తగ్గుతున్నాయి. ఒకప్పుడు తీవ్రంగా మద్దతునిచ్చిన వారు కూడా అలసిపోయారు".

పోస్ట్ ఇస్లామిస్టులు దేశం, సమాజంలో విశ్వాసాల పాత్రను విడిచిపెట్టరు. కానీ దానిని తిరిగి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ఇది "ఇస్లాం మతం యొక్క అంతర్లీన సూత్రాలను తమ మార్గంలోకి మార్చే ప్రయత్నానికి దారి తీస్తుంది. విధులకు బదులుగా హక్కులను, ఏకవచన అధికార స్వరం స్థానంలో బహుళత్వాన్ని, స్థిర గ్రంథాలకు బదులుగా చారిత్రాత్మకతను, గతానికి బదులుగా భవిష్యత్తును నొక్కి చెబుతుంది. ఇది వ్యక్తిగత ఎంపిక, స్వేచ్ఛ, ఆధునికతతో ఇస్లాంను అంతర్లీనం చేసుకోవాలనుకుంటోంది...."

పశ్చిమాసియా రాజకీయాల్లో మనం ఇప్పుడు "ఇస్లామిజం అనంతర" దశలో ఉన్నామని చెప్పడం సందేహాస్పదమే. రాజకీయ ఇస్లాం తిరోగమనంలో ఉండగా, ఉదారవాద రాజ్యాన్ని ఏర్పాటు చేయడానికి జరిగిన అనేక ప్రయత్నాలు విఫలమయ్యాయి.

2010 నుండి అరబ్ స్ప్రింగ్ తిరుగుబాట్లు "స్వేచ్ఛ, న్యాయం, గౌరవం" అనే నినాదాల ద్వారా ప్రేరేపించబడ్డాయి, ఇస్లామిక్ ప్రేరణ లేకున్నా ఆ సమయంలో వ్యవస్థీకృతమైన ఈ తిరుగుబాట్ల వలన ముందస్తు ఎన్నికలలో ఇస్లామిక్ పార్టీలు లబ్ధి పొందాయి. 2018–20లో రెండవ దశ తిరుగుబాట్లు సూడాన్, అల్జీరియా, లెబనాన్, ఇరాక్‌లలో మరో నలుగురు నాయకులను పడగొట్టాయి. అయితే అప్పటికే ఒత్తిడిలో ఉన్న ఇస్లామిజం పాత్ర ఆ ఉద్యమాలలో లేదు.

ఈ భారీ అలజడులు ఉన్నప్పటికీ ఈ ప్రాంతం ఎటువంటి రాజకీయ మార్పును చూడలేదు. విప్లవ ప్రతీఘాతశక్తులు చాలా బలంగా నిలబడ్డాయి. అరబ్ స్ప్రింగ్ తిరుగుబాట్లకు ప్రతిస్పందనగా చమురు–సంపన్నమైన గల్ఫ్ దేశాలు తమ పౌరులలో మార్పుకోసం ప్రయత్నించాలన్న ఉత్సాహాన్ని చల్లబరచడానికి వందల కోట్ల డాలర్లను అందించటంతో పాటు అణచివేత విధానాలను కూడా విస్తృతంగా ఉపయోగించారు. "అరబ్ రాజ్యం బలహీనంగా ఉన్నందున తరచుగా హింసాత్మకంగా ఉంటుంది" అని గొప్ప

**“ సంస్కరణల డిమాండ్లకు ప్రతిస్పందనగా చాలా గల్ఫ్ దేశాలు చమురు ఉత్పత్తి అనంతర భవిష్యత్తు కోసం తమ దేశాలను సిద్ధం చేయడానికి “విజన్” పత్రాలను రూపొందించాయి. అత్యాధునిక సాంకేతికతపై స్థాపించ బడిన సృజనాత్మకత కోసం, రాజకీయాలను శక్తివంతంగా, ఉత్తేజకరంగా మార్చడం కోసం వారు తమ యువతను భాగస్వాములను చేయడానికి ప్రయత్నిస్తారు. అది తమ దేశాలను ప్రపంచ నాయకత్వానికి తీసుకువెళుతుంది. ”**

పండితుడు నజీహాయూబీ నాలుగు దశాబ్దాల క్రితం మాకు చెప్పారు. సంస్కరణల కోసం కృషి చేసినవారు గల్ఫ్ రాచరికాలలో ఖైదు చేయబడ్డారు. తరువాత అనేక అరబ్ దేశాలలో నవజాత ప్రజాస్వామ్యాలను తారుమారు చేయడానికి, తమ ప్రభుత్వాలను ఎన్నుకునే, వాటిని కాలానుగుణంగా మార్చుకునే పౌరుల హక్కును సమర్ధించే యాక్టివిస్ట్ ఇస్లామిజంను తుడిచిపెట్టడానికి సహాయపడింది.

**ప్రతిఘటన యొక్క నిలకడ**

సంస్కరణల డిమాండ్లకు ప్రతిస్పందనగా చాలా గల్ఫ్ దేశాలు చమురు ఉత్పత్తి అనంతర భవిష్యత్తు కోసం తమ దేశాలను సిద్ధం చేయడానికి “విజన్” పత్రాలను రూపొందించాయి. అత్యాధునిక సాంకేతికతపై స్థాపించ బడిన సృజనాత్మకత కోసం, రాజకీయాలను శక్తివంతంగా, ఉత్తేజకరంగా మార్చడం కోసం వారు తమ యువతను భాగస్వాములను చేయడానికి ప్రయత్నిస్తారు. అది తమ దేశాలను ప్రపంచ నాయకత్వానికి తీసుకువెళుతుంది.

జనాభాలో 25 ఏళ్లలోపు వారు అత్యధికంగా ఉన్నందున ఇది సాధ్యమైంది. ఏదేమైనప్పటికీ ఏ విధమైన రాజకీయ సంస్కరణలు లేదా పాలనలో ప్రజల భాగస్వామ్యానికి ఈ “విజన్స్”లో చోటు లేదు. “సౌదీ అరేబియా గొప్పది” లేదా “సౌదీ అరేబియా కోసం సౌదీ అరేబియా” వంటి నినాదాల ద్వారా అన్ని సవాళ్ళు, భిన్నాభిప్రాయాల నోరుమూయించేందుకు ఉద్ధేశ్యించింది. ఇది కొనసాగుతుందా?

ఈ రచయిత గత శతాబ్దాన్నర కాలంగా పశ్చిమాసియా రాజకీయాలపై చేసిన అధ్యయనం, అతని పుస్తకం 'వెస్ట్ ఆసియా ఎట్ వార్' లో కనబడుతుంది. అరబ్ దేశాల్లో దేశీయ దౌర్జన్యం, బాహ్య జోక్యాలకు నిరంతర ప్రతిఘటన క్రమాన్ని వెల్లడించింది. అందువల్ల కార్యాచరణతో కూడిన, తీవ్రవాద ఇస్లామిజం రెండూ ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో విదేశీ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాటం జరిపాయి. అరబ్ స్ప్రింగ్ తిరుగుబాట్ల నేపథ్యంలో ప్రభుత్వ పాలనలో లోపాలను సరి చేయడానికి, ప్రజాస్వామ్య విధానాల కోసం జరుగుతున్న ప్రతిఘటన వ్యక్తీకరణలు. అంతకుముందు కాలంలో వలసవాద వ్యతిరేక తిరుగుబాట్లు, గణతంత్ర విప్లవాలు చేసినట్లుగా జాతీయ గౌరవాన్ని కాపాడటానికి లేదా రాజకీయ క్రమంలో సంస్కరణలను సాధించటానికి రాజకీయ ఇస్లాం ప్రేరణ శక్తిని అందించింది.

రాజకీయ ఇస్లాం మార్పును ప్రభావితం చేయగల సామర్థ్యాన్ని కోల్పోయి, నిరంకుశ పాలన పాతుకుపోయినట్లు కనిపిస్తున్నప్పటికీ, పశ్చిమాసియా రాజకీయాలలో స్థిరత్వం వెనుక, తిరుగుబాట్ల వైఫల్యంతో యువకులలో విపరీతమైన కోపం ఉంది. “కొత్త శక్తులు, తిరుగుబాట్లు” తప్పకుండా ఉంటాయి, దేశ నిరంకుశ పాలకులు విశ్వాసం, విధేయతలను సాకుగా చూపి వాటిని అణచలేరని ఈజిప్టు పండితుడు తారెక్ ఉస్మాన్ 2016లో హెచ్చరించాడు.

అయుబి చెప్పినట్లుగా పశ్చిమాసియా చరిత్ర ప్రకారం “నిరంకుశ పాలకుల అణిచివేతకు ఎదురుతిరిగే శక్తులు ఉత్పన్నమవుతాయి. చరిత్ర ఎన్నడో కప్పిపెట్టేసిందనుకున్న గోడలను బద్దలు కొట్టుకుని భయంకరమైన రాక్షసులను బహిర్గతం చేసే సమయం వస్తుంది.

**(అనువాదం: వల్లభనేని గీత)**

# ఆర్యుల భారతీయ మూలాలపై ఆధారాలు లేవు

*(25వ పేజీ తరువాయి)*

సంస్కృతంలో కూడా ఇతర ద్రావిడ భాషల నుండి అప్పుతెచ్చుకున్న పదాలు అనేకం ఉన్నాయి. కొన్ని ఆంగ్ల పదాలు సంస్కృతంలో ఉన్నాయి కాబట్టి ఆంగ్లభాష సంస్కృతం నుండి ఉద్భవించినదని అనలేముకదా. రెండు భాషల మధ్య సంపర్కం జరిగింది కాబట్టి ఒకభాషలోని పదాలు వేరొక భాషలోకి చేరాయని అర్థం చేసుకోవలసి ఉంటుంది. భాషలు నిరంతరంగా అభివృద్ధి చెందుతుంటాయనడానికి ఇది తార్కాణం. సజీవమైన భాష స్తబ్దుగా నిలిచిపోదు. భాషకి చివరి అంకం ఉండదు. అది ఇతర అనేక సమూహాలతో పరస్పర సంబంధాల ద్వారా నిరంతరంగా వృద్ధి చెందుతూ, విస్తరిస్తూ ఉంటుంది.

సంస్కృత భాషకి చరిత్రలో ప్రత్యేకమైన స్థానం ఉందనడంలో ఎటువంటి సందేహం అవసరం లేదు. భారత సమాజంలో దాని ప్రత్యేకత దాని కుంది. ఇతర భాషల మల్లేనే దాని అందాలు, ఆకట్టుకునే లక్షణాలు దానికున్నాయి. కానీ మనం దానినెలా చూస్తాము, ఎలా అర్థం చేసుకుంటామన్న విషయంలో నేలవిడిచి సాము చేయకూడదు. ఆధునిక సమాజానికి సంబంధించిన వరకు కొంతమంది సంస్కృతాన్ని తెగ పొగిడితే మరికొంత మంది తెగడుతున్నారు. కొందరు సంకుచితంగా సంస్కృతానికి పవిత్రతను ఆపాదించి ఇతర అన్ని భాషలకన్నా ఉన్నతంగా నిలపాలని భావిస్తే, మరికొందరు సంస్కృతం చరిత్ర మూలాలు తవ్వుతున్నారు. ఆఖరికి కుల మూలాలు కూడా వెదుకుతున్నారు. అదో ప్రాచీన భాష అనే ఆలోచనను కూడా నిరాకరిస్తున్నారు. సంస్కృతం భాష పట్ల ఇటువంటి విధానాలు, ముఖ్యంగా కుల మూలాలు వెదకడం వలన ఆ భాష విస్మృతికి, జీవానికి కూడా పరిమితులు ఏర్పడతాయి. సంస్కృతం మిగిలిన అన్ని భాషలకు తల్లివంటిది అనడం వలన ఆ భాష సంకుచితంగా ఉండిపోతుంది, కుదించివేయబడుతుంది. అందుమూలంగా నిల్వపడిపోతుంది. ఆఖరికి చనిపోతుంది. అందుకు భిన్నంగా సంస్కృతానికి కొత్త అన్వయింపులు చేయడం, లోతులలోకి చూడడం, ఆధునిక భారతదేశంలో ఒక స్థానాన్ని కల్పించడం జరిగితే ఆ భాష కూడా సజీవంగా ఉంటుంది.

**(అనువాదం: కె ఉషారాణి)**

# జాతీయ విప్లవకారుడు భగత్ సింగ్

(2వ పేజీ తరువాయి)

వేశాడు. "స్కాట్" ను గుర్తించిన జైపాల్ ఆయన్ను కాల్చుమంటూ భగత్ సింగ్‌కు సంకేతాలు ఇచ్చాడు. అయితే పొరపాటు గుర్తింపు కారణంగా "స్కాట్"కు బదులు జెపి సాండర్స్ హతమయ్యాడు. పోలీసుల కంటపడకుండా లాహోర్‌కి వెళ్లి అజ్ఞాత జీవితం గడిపాడు భగత్ సింగ్. తను గుర్తు పట్టకుండా ఉండటానికి గడ్డం తీసేసి, తలవెంట్రుకలను కత్తిరించుకొని సిక్కు సాంప్రదాయాలను సైతం పక్కన పెట్టడానికి వెనుకాడలేదు.

విప్లవకారుల చర్యలను కర్కశంగా అణిచివేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఒక కొత్త చట్టం తీసుకువచ్చింది. భగత్ సింగ్ లాంటి విప్లవకారులను అణచివేయడం ఆ చట్టం ముఖ్య ఉద్దేశం. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర శాసన సభపై బాంబు వేయాలని సామ్యవాద గణతంత్ర యువజన సంఘం వ్యూహరచన చేసింది. భగత్ సింగ్‌తో పాటు సహవిప్లవ కారుడు "దత్ "8 ఏప్రిల్ 1929 న శాసన సభ వసారాపై బాంబు విసిరి "ఇంక్విలాబ్ జిందాబాద్" (విప్లవం వర్ధిల్లాలి) అని గొంతెత్తి నినదించారు. మీ మీ (బ్రిటిష్) వినికిడి శక్తి కోల్పోయేలా ఇలానే గొంతెత్తి అరుస్తామనీ, వారు ముద్రించిన పలురకాల కరపత్రాలను వెదజల్లారు. విసిరిన బాంబు కేవలం ఒక పొగ బాంబు మాత్రమే. ఎవరూ మరణించటం గానీ, గాయపడటం గానీ జరగలేదు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని అవసరమైతే హింసాత్మకంగానైనా ప్రతిఘటిస్తామని హెచ్చరిక చేయడం కోసమే ఉద్దేశ్యపూర్వకంగా డమ్మీ బాంబుతో దాడి చేశామని భగత్ సింగ్, దత్‌లు చెప్పారు. ఈ దాడి అనంతరం ఇద్దరూ స్వచ్ఛందంగా పోలీసులకు లొంగిపోయారు.

సాండర్స్ హత్య కేసులో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్‌లను అరెస్టు చేసి బ్రిటిష్ ప్రభుత్వం జైల్లో పెట్టింది. విచారణలో భాగంగా దేశ స్వాతంత్రం కోసం తన గళాన్ని వినిపించడానికి న్యాయస్థానాన్ని ఒక ప్రచార వేదికగా మలుచుకున్నాడు భగత్ సింగ్. హత్యా నేరాన్ని అంగీకరించిన భగత్ సింగ్ బ్రిటిష్ ప్రభుత్వం తన దేశాన్ని, దేశ ప్రజలను ఎలా దోచుకుంటున్నదో, సామాన్య ప్రజానీకపు నిరసన గళాలను ఎలా నిర్దాక్షిణ్యంగా అణచి వేస్తోందో చెబుతూ న్యాయస్థానంలో పలు ప్రకటనలు చేశాడు. న్యాయస్థానం ఆ ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసింది.

జైలులో ఉండగా భగత్ సింగ్ ఇతర ఖైదీల హక్కుల గురించి పోరాడాడు. భారత రాజకీయ ఖైదీల కంటే, హంతకులు, దొంగలు అయిన బ్రిటిష్ ఖైదీలకు అధిక ప్రాధాన్యత నీయటం ఆయనను నిరాహార దీక్షకు పురిగొల్పింది. అంతేకాకుండా రాజకీయ ఖైదీలందరికీ సరైన ఆహారం, పుస్తకాలు, దినపత్రికల సదుపాయం, మంచి బట్టలు, సరైన మరుగు దొడ్లు. ఇతర దైనందిన సదుపాయాలు కల్పించాలన్న డిమాండ్లతో దీక్షను చేపట్టాడు. అరవై మూడు రోజుల పాటు కొనసాగిన నిరాహార దీక్షతో బ్రిటిష్ ప్రభుత్వం లొంగి రాక తప్పలేదు. దీనితో సింగ్‌కు సాధారణ భారతీయుల్లో మరింత ఆదరణ పెరిగింది.

ఉరిశిక్ష ఖాయం అన్న సంగతి తెలిసిన తర్వాతనే కాదు అంతకు ముందు నుండి జైలులో ఉన్నప్పుడు కూడా భగత్ సింగ్ నిత్య అధ్యయనశీలిగా ఉండేవాడు. రష్యాలో బోల్షెవిక్ విప్లవం జయప్రదం అవ్వటంతో దాని వెలుగులో యూరప్ ఉద్యమాల చరిత్రను అధ్యయనం చేశాడు. జైల్లో ఉండగానే మార్క్స్, ఎంగిల్స్, లెనిన్‌లు రచించిన అనేక గ్రంథాలను, వాటితో పాటు రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రం సామాజిక శాస్త్రాలను చదువ సాగాడు. క్రమంగా సామ్యవాదం వైపు మళ్లాడు. జైలు అధికారులు నీ ఆఖరి కోరిక ఏమిటి? అని అడిగినప్పుడు నేను లెనిన్ జీవిత చరిత్ర చదువుతున్నానని, నేను చనిపోయేలోగా దానిని పూర్తి చేయాలని కోరుకుంటున్నా అని చెప్పాడు. ఇవన్నీ తన లిఖిత పత్రాల్లో పేర్కొన్నాడు.

మార్క్సిజం అధ్యయనంతో భగత్ సింగ్ ఎక్కువగా ప్రభావితుడయ్యాడు. భారతదేశంలో ప్రథమ మార్క్సిస్టులలో భగత్సింగ్ ఒకరిని ప్రముఖ భారత చరిత్రకారుడు కెఎన్ ఫణిక్కర్ అభివర్ణించాడు. 1931లో జైలులో ఉండగా నాస్తికవాద తత్వాన్ని వివరిస్తూ "నేనెందుకు నాస్తికుడనయ్యాను" అనే శీర్షికతో ఒక వ్యాసం రాశాడు. సర్వశక్తి సంపన్నుడు అని పిలవబడుతున్న దేవుడి పట్ల తనకు విశ్వాసం లేదని ప్రకటించాడు. ఇతరుల హృదయాలకు దగ్గరగా ఉండే కల్పిత గాథలు, మూఢ విశ్వాసాలను నమ్మే స్థితికి తాను దిగజారబోనని స్పష్టం చేశాడు. మతం చావును సులభతరం చేస్తుంది అనే వాస్తవాన్ని గుర్తించానని, అయితే నిరూపితం కాని దైవత్వం కేవలం మానవ బలహీనతకు సంకేతమని తన వ్యాసంలో పేర్కొన్నాడు.

తనకు పడిన ఉరిశిక్ష అమలు గురించి భగత్ సింగ్ మరో ఇద్దరు తమను యుద్ధ ఖైదీలుగా గుర్తించారు గనుక ఉరి తీయకుండా కాల్పుల బృందం చేత హతమార్చాలని వైస్రాయ్‌కి లేఖ రాశారు. తనను ఉరి తీయడానికి నాలుగు రోజుల ముందు తన మిత్రుడైన ప్రసన్న మెహతా జైలులో భగత్ సింగ్‌ను కలిసి క్షమాభిక్ష ముసాయిదాపై సంతకం చేయమని కోరాడు. భగత్ సింగ్ క్షణం కూడా ఆలోచించకుండానే సంతకం చేయడానికి నిరాకరించాడు. బాధతో ప్రసన్న మెహతా భగత్ సింగ్ పట్టుదలను చూసి వెనుదిరిగి వెళ్లిపోయాడు.

23 మార్చి 1931న భగత్ సింగ్‌తో పాటు ఆయన సహచరులు రాజ్ గురు, సుఖ దేవ్‌లను లాహోర్ జైల్లో ఉరితీశారు. సాధారణంగా ఉదయం ఎనిమిది గంటలకు ఉరి తీస్తారు. ఏమి జరుగుతుందో ప్రజలు తెలుసుకునేలోపే రాత్రి 7 గంటల సమయంలో భగత్ సింగ్‌ను ఉరి తీశారు. ఆ జైలు లోపల నుండి ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదాలు బిగ్గరగా వినిపించాయి. జీవితానికి చివరగా తెరదించబోతున్నారు అన్న దానికి ఇది సంకేతం అయింది. గొప్ప విప్లవ యోధుడి గొంతుక మూగబోయింది. గొప్ప ధ్రువతార రాలిపోయింది. దేశస్వాతంత్ర్యం కోసం తన బలి దానం ద్వారా అమరవీరుడుగా భగత్‌సింగ్ గుర్తింపు పొందాడు. చరిత్రలో చిరంజీవిగా నిలిచిపోయారు. వ్యక్తులను చంపటం సులభమైనప్పటికీ వారి ఆశయాలను, ఆదర్శాలను, సిద్ధాంతాలను సమాధి చేయలేరు అన్నది నగ్నసత్యం.

జీవితాన్ని ప్రేమిస్తాం. మరణాన్ని ప్రేమిస్తాం, మేం మరణించి ఎర్రపూల వనంలో పూలై పూస్తాం. ఉరికంబాన్ని ఎగతాళి చేస్తాం, నిప్పు రవ్వల మీద నిదురిస్తాం అన్న ఆ మహా యోధులకు, భరత మాత కన్న ముద్దు బిడ్డలకు జోహార్లు.

❉

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 19, issue: 3 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# తలసరి జిడిపిలో 136వ స్థానంలో భారత్




**భా**రత దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) ఈ ఏడాది 3.75 లక్షల కోట్ల (ట్రిలియన్) డాలర్లు చేరుకుంటుందని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ గత నెల ప్రకటించారు. మనది ప్రస్తుతం ప్రపంచంలోనే 5వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని ఆమె చెప్పారు. రానున్న రెండేళ్ల కాలంలో అంటే 2025 నాటికి మన ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందనీ, ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ, పాలక పార్టీ నాయకులు తరచూ చెబుతుంటారు. దాన్ని తాము సాధించిన గొప్ప ఘనతగా పేర్కొంటుంటారు.

కానీ వాస్తవంగా తలసరి జిడిపిగా చూసినప్పుడు భారత దేశం ప్రపంచంలోని 192 దేశాల్లో 132వ స్థానంలో ఉంది. మొత్తం జాతీయోత్పత్తిని జనాభాతో భాగిస్తే వచ్చేదే తలసరి జిడిపి. ఈ ఏడాది ఐఎంఎఫ్ సరికొత్తగా ఇచ్చిన లెక్కల ప్రకారం భారత దేశ వార్షిక తలసరి జిడిపి 3,497 డాలర్లు. ప్రపంచంలో జిడిపిలో 30.5 లక్షల కోట్ల డాలర్లతో మొదటి స్థానంలో ఉన్న అమెరికా తలసరి జిడిపి విషయంలో మాత్రం 80,034 డాలర్లతో ఏడవ స్థానంలో ఉంది. అయినప్పటికీ భారత దేశ తలసరి జిడిపితో పోలిస్తే అది 23 రెట్లు అధికంగా ఉంది. 18.8 లక్షల కోట్ల డాలర్లతో ప్రచంలో రెండవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన చైనా తలసరి జిడిపి 13,721 డాలర్లు ఉంది. ప్రపంచ దేశాల్లో దాని ర్యాంకు 64. చైనా తలసరి జిడిపి కన్నా అమెరికా జిడిపి ఆరు రెట్లు ఎక్కువ కాగా భారత తలసరి జిడిపి కన్నా చైనా తలసరి జిడిపి అయిదు రెట్లు ఎక్కువ. జనాభా ఎక్కువ ఉంటే తలసరి జిడిపి సాపేక్షంగా తగ్గుతుంది. కానీ భారత్, చైనాలు జనాభాలో దాదాపు సమానంగా ఉన్న విషయం గుర్తుపెట్టుకోవాలి. మరో విశేషం ఏమంటే తలసరి ఆదాయంలో ప్రపంచ 18వ ర్యాంకులో ఉన్న హాంగ్‌కాంగ్ జిడిపిని కలపకుండానే చైనా జిడిపిని లెక్కించడం జరిగింది.

4.4 లక్షల కోట్ల డాలర్లతో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జపాన్ తలసరి జిడిపిలో 35,385 డాలర్లతో 28వ ర్యాంకులో ఉంది. 4.3 లక్షల కోట్లతో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన జర్మనీ తలసరి జిడిపి 51.383 డాలర్లతో జపాన్ కన్నా మెరుగైన 19వ ర్యాంకులో ఉంది. 1,32,372 డాలర్ల తలసరి జిడిపితో లక్జెంబర్గ్ ప్రంచంలో మొదటి ర్యాంకులో ఉంది.

తలసరి జిడిపి రీత్యా చూస్తే సోషలిస్టు దేశాలు తమ విశిష్టతను చాటుకున్నాయి. 1975 వరకు యుద్ధంలో చితికిపోయిన వియత్నాం 4,475 డాలర్ల తలసరి జిడిపితో ప్రపంచంలో 116 వ ర్యాంకులో ఉంది. 7,510 డాలర్లతో క్యూబా 75వ ర్యాంకులో ఉంది. 1,858 డాలర్లతో లావోస్ 152 స్థానంలో ఉంది. ఉత్తర కొరియా వివరాలు లభ్యం కాలేదు.

దక్షిణాసియాలో తలసరి జిడిపిలో భారత్ కన్నా శ్రీలంక, భూటాన్ మెరుగ్గా ఉన్నాయి. 3,497 డాలర్ల తలసరి జిడిపితో భూటాన్ 132వ స్థానంలోనూ, 3,362 డాలర్లతో శ్రీలంక 133వ స్థానంలోనూ ఉన్నాయి. బంగ్లాదేశ్ (2,469 డా.) 144వ స్థానంలో, పాకిస్థాన్ (1,658 డా.) 157వ స్థానంలోనూ ఉన్నాయి. 1,377 డాలర్లతో నేపాల్ 163 ర్యాంకులో ఉంది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ..........................................

వీధి ..........................................

గ్రామం ..........................................

మండలం లేదా పట్టణం ..........................................

జిల్లా ..........................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.